గురువారం
11-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 80
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మొరాకోలో కూలిన రెండు భవనాలు: 19 మంది మృతి

రాబత్: మొరాకోలోని పురాతన నగరాల్లో ఒకటైన ఫెజ్‌లో శిథిలావస్థకు చేరిన రెండు నిర్వాసిత భవనాలు కుప్పకూలాయి. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. మొత్తం 19 మంది ప్రాణాలు కోల్పోగా మరో 16 మంది గాయపడ్డారు. నాలుగు అంతస్తులు ఉండే రెండు భవనాలు గతంలోనే బీటలు వారివున్నాయని అధికారులు తెలిపారు. నిర్వహణ లోపంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఇందులో మొత్తం ఎనిమిది కుటుంబాలు నివాసమున్నట్లు వెల్లడించారు. భద్రతా సిబ్బంది, పౌర రక్షణ శాఖల ప్రతినిధులు అక్కడకు హుటాహుటిన చేరుకొని, సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రులకు తరలించామని, మృతదేహాలను వెలికితీశామని అధికారులు వెల్లడించారు.

దీపావళికి యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ: భారతీయులు ఎంతో ఇష్టంగా జరుపుకునే దీపావళి పండగకు అంతర్జాతీయ గౌరవం దక్కింది. ఈ పండుగకు యునెస్కో వారసత్వ గుర్తింపు దక్కింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో దీపావళి పండగను చేర్చారు. దీపావళితో కలిపి ఇప్పటివరకు భారత్‌కు చెందిన 15 అంశాలు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందాయి. వాటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గాపూజ, గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల మొదలైనవి ఉన్నాయి. వారసత్వ సంపదను

- మిగతా 2 లో

ఉమర్, షర్జిల్ బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్ల వ్యవహారంలో ఉపా కేసులో నిందితులుగా ఉన్న హక్కుల కార్యకర్తలు ఉమర్ ఖాలిద్, షర్జిల్ ఇమామ్ బెయిల్ పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు బుధవారం రిజర్వులో పెట్టింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజరియాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు, సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, సల్మాన్ ఖుర్షీద్, సిద్ధార్థ లుత్రా వాదనలు విన్నది. ఉమర్ ఖాలిద్

మిగతా 2 లో

మోదీతో విభేదించిన రాహుల్

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ), కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) వంటి కీలకమైన కేంద్ర కమిటీల అధినేతల ఎంపికపై ప్రధాని నరేంద్రమోదీతో కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విభేదించారు. పారదర్శక సంస్థలకు నియామకాలు ఖరారు చేయడానికి బుధవారం ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. సమావేశం అనంతరం అత్యున్నత పదవులకు ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్లు పేర్కొంటూ... లిఖితపూర్వక

- మిగతా 2 లో

రూ. వెయ్యి కోట్లతో స్టార్టప్ ఫండ్

- కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి
- యూనివర్సిటీల్లో 'ఇంక్యుబేషన్' కేంద్రాలు
- ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్ పరిచయానికే గ్లోబల్ సమ్మిట్: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించడానికి రూ. వెయ్యి కోట్లతో స్టార్టప్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధులతో స్టార్టప్ కంపెనీలను ప్రారంభించడమే కాకుండా... కనీసం ఒక బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. టీ హబ్ లో ఏర్పాటు చేసిన గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి బుధవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు రేవంత్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. "హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్ లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నా. అంటే కనీసం ఒక బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. వీటిల్లో 2034 నాటికి కనీసం 10 స్టార్టప్‌లు సూపర్ యూనికార్న్ కంపెనీలుగా మారాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్ పరిచయం చేయాలన్న లక్ష్యంతో రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పై గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామని తెలిపారు. జాతీయ ,అంతర్జాతీయ కార్పొరేట్ ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ రైజింగ్ విజన్‌ను ఆవిష్కరించామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో ప్రారంభమైన స్టార్టప్‌లు పెద్ద పెద్ద కంపెనీలుగా ఎదిగాయని వివరించారు. ప్రస్తుతం వస్తు ఉత్పత్తి ఆధారిత స్టార్టప్‌లు, ఇన్నొవేటివ్ స్టార్టప్‌లు, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్‌లపై ద ృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందన్నారు. స్టార్టప్‌లకు అవసరమైన సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ కలిసి పనిచేయబోతున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో 'ఇంక్యుబేషన్' సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ 'వన్ హబ్'కు ధీటుగా ఈ కేంద్రాలను తీర్చి దిద్దుతామన్నారు. 2024 లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయిందన్నారు. మహిళా నేత ృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లెడ్ స్టార్టప్ లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్ గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి
పెట్టుబడుల వెల్లువ

కవిత వలన బీఆర్ఎస్ నేతల లూటీలు బయటకు...

భవిష్యత్‌లో తెలంగాణకు బీసీ సీఎం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్

విశాలాంధ్ర-హైదరాబాద్: గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయని, దీంతో ఈ సమ్మిట్ విజయవంతమైందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడంతో హరీశ్ రావుకు గుబులు మొదలైందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్ని పెట్టుబడులు వచ్చాయనే విషయాన్ని వారు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ సమ్మిట్ వలన దేశ విదేశీ పెట్టుబడులు వచ్చాయని, సీఎం దూరదృష్టికి ఇది నిదర్శనమని కొనియాడారు. గ్లోబల్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే అభినందనలు తెలిపారని, గతంలో దావోస్ వలన లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. బుధవారం మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ త్వరలో నూతన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రచార కమిటీలు వస్తాయన్నారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా పోటీపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ నెలాఖరుకు కార్పొరేషన్ చైర్మన్లు, మిగిలిన చైర్మన్లు, బోర్డు పదవులు కూడా భర్తీ చేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన

- మిగతా 2 లో

తొలి దశ పల్లె పోరుకు
సర్వం సిద్ధం

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరా

890 పంచాయతీలు ఏకగ్రీవం: ఎస్ఈసీ

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనుంది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని ఓటర్లకు ఈ సందర్భంగా సూచించారు. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 పంచాయతీల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఉదయం ఏడు గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు... తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఓటర్లు 18 రకాల ఐడీ కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ ఐడీ కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్టీరియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. కాగా, తొలి విడత ఎన్నికల ప్రచారానికి మంగళవారంతో తెర పడింది. తొలి విడతలో 4,236 పంచాయతీలకు

మిగతా 2 లో

ప్రజా సమస్యల పరిష్కారమే
ప్రధాన అజెండా

సీపీఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో– కొత్తగూడెం : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే సీపీఐ ప్రధాన అజెండా అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాభివృద్ధిని సాధించాలని కోరారు. ప్రజా పారదర్శక పాలన సీపీఐతోనే సాధ్యమవుతుందన్నారు. దశాబ్దాలుగా ప్రజల కోసం రాజీలేని పోరాటాలు, అనేక త్యాగాలు చేశామని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగొద్దన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం చుంచుపల్లి మండల ం పెనుబల్లి, పెనగడప, అంబేద్కర్ నగర్, లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్, తెలగారామవరం, హేమచంద్రాపురం, గడ్డిగుట్ట పంచాయతీల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ అవినీతికి

మిగతా 2 లో

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు
పరిష్కరిస్తాం

- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాల భర్తీ
- త్వరలో నూతన బస్ డిపోల నిర్మాణం
- నగరంలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలన్నదే లక్ష్యం: పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ఆర్టీసీ మరింత విస్తృతం చేస్తోంది. అందులో భాగంగా బుధవారం రాణిగంజ్ డిపోలో 65 ఎలక్ట్రిక్ బస్సులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్‌లోనే 2,800 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం టీజీఎస్ ఆర్టీసీ రాష్ట్రంలో 810 ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. వీటిలో 300 బస్సులు హైదరాబాద్ ... సికింద్రాబాద్ లో తిరుగుతున్నాయి. జనవరికి మరో 175 ఈవీ బస్సులు అందనున్నాయి. దీంతో నగరంలో 540 అందుబాటులోకి వస్తాయి. మరోవైపు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు జరుగుతుంది. ఈ 65 ఎలక్ట్రిక్ బస్సులు సికింద్రాబాద్ - కొండాపూర్, సికింద్రాబాద్ నుంచి ఇస్నాపూర్, బోరబండ, రామాయంపేట, గచ్చిబౌలి, మీడియాపూర్ ఐ రోడ్డు నడవనున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. పర్యావరణ, కార్యాచరణ సామర్థ్యం , ఆధునిక ప్రజా రవాణాలో కార్పొరేషన్ ప్రమాణాలను నిర్దేశిస్తోంది. ఈవీల వల్ల నగరంలో శబ్ద కాలుష్యం , కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చు. నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచవచ్చు. ఈ బస్సుల్లో రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఇంటిగ్రేటెడ్ ఐటీఎస్ (ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్) ఉంటుంది .అగ్ని ప్రమాదాల గుర్తింపు... నిరోధక వ్యవస్థ ఏర్పాటు చేశారు. 36 సీట్లతో సౌకర్యవంతమైన సీటింగ్ సామర్థ్యం ఉంటుంది. గమ్యస్థాన బోర్డులు, యుఎస్బి ఛార్జింగ్,

మిగతా 2 లో

ఆటో కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ మోసం

వారికి బాకీ ఉన్న రూ.1,560 కోట్లు తక్షణమే చెల్లించాలి : కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే హైదరాబాద్‌లో మహా ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా కేటీఆర్ ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటోడ్రైవర్లు

మిగతా 2 లో

ఇదీ లోకం!

మోదీ, నేను ఆర్ఎస్ఎస్ అనుచరులం

- రాజ్యాంగబద్ధంగానే ఎస్ఐఆర్
- ప్రతిపక్షాలది అవాస్తవ ప్రచారం
- హెూంమంత్రి అమిత్‌షా
- 'ఓట్ చోరీ'పై చర్చిస్తారా? రాహుల్ సవాల్



న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు ఎన్నికల సంస్కరణలపై దృష్టిపెట్టకుండా ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై మాట్లాడటం విడ్డూరంగా ఉందని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా విమర్శించారు. కాగా, ఎన్నికల సంస్కరణలపై మంగళవారం లోక్‌సభలో మొదలైన చర్చ బుధవారం కూడా కొనసాగింది. అమిత్ షా, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మధ్య సవాళ్ల పర్వం నడిచింది. ఓట్ చోరీ అంశాన్ని రాహుల్ లేవనెత్తగా... అమిత్ షా తీవ్రంగా బదులిచ్చారు. అమిత్‌షా మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఎస్ఐఆర్‌పై అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రాష్ట్రాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్‌పై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో సహా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై

మిగతా 2 లో

ఎయిర్‌లైన్స్ దోపిడీ ఎందుకు అరికట్టలేదు?

కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు సూటిప్రశ్న

ఈ పరిస్థితి ఎందుకు ఉత్పన్నమైంది

సమగ్ర వివరణ ఇవ్వాలని పౌర విమానయానశాఖకు ఆదేశం

న్యూఢిల్లీ: ఇండిగో సంక్షోభం వేళ ముందుగా బుక్ చేసుకున్న సర్వీసులు చివరి గంటల్లో రద్దయ్యి ప్రయాణికులు నానా అవస్థలు పడుతుంటే... ఇతర విమానయాన సంస్థలు అడ్డగోలుగా టికెట్ రేట్లు పెంచి ప్రయాణికులను దోచుకోవడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ఎలా సాధ్యమైందంటూ కేంద్రాన్ని నిలదీసింది. సరైన సమయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. ఇండిగో వందల సంఖ్యలో సర్వీసుల్ని రద్దు చేయడంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఆ ప్రభావంతో ఇతర విమానయాన సంస్థల్లో టికెట్ ధరలు ఆకాశాన్నంటాయి. ఈ వ్యవహారంపై చాలా ఆలస్యంగా స్పందించిన కేంద్రం... ఎయిర్‌లైన్స్‌లకు హెచ్చరికలు జారీ చేసింది. అయితే ఈ మధ్యలోనే.. ఎయిర్‌లైన్స్‌లు అసాధారణంగా అధిక ధరలు వసూలు చేస్తున్నాయని, ప్రయాణికులకు సమయానికి సమాచారం ఇవ్వడం లేదని.. ఇది ప్రయాణికుల హక్కుల ఉల్లంఘన అని దాఖలైన పిటిషన్‌పై కోర్టు బుధవారం విచారణ జరిపింది. ఒకవైపు సంక్షోభం

మిగతా 2 లో

థాయి-కంబోడియాతో మాట్లాడి యుద్ధం ముగిస్తా

యూరప్ చాలా బలహీనం... ఉక్రెయిన్ ఓటమిని అంగీకరించాలి: ట్రంప్

వాషింగ్టన్: థాయిలాండ్, కంబోడియా మధ్య సరిహద్దు దాడులను ఆపుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు ఫోన్‌లో మాట్లాడతానని చెప్పారు. కంబోడియా, థాయిలాండ్ మధ్య మళ్లీ పోరాటం మొదలైందని, ఫోన్ చేసి మాట్లాడి ఈ యుద్ధానికి తెర దించుతానని ట్రంప్ ప్రకటించారు. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో థాయిలాండ్‌లో జరిగే సౌతీస్ట్ ఏషియన్ గేమ్స్ నుంచి తమ అథ్లెట్లను కంబోడియా బుధవారం వెనక్కి పిలిపించింది. భద్రతా కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కంబోడియా దళాలపై థాయిలాండ్ సైన్యం ప్రయోగించిన బీఎం 21 రాకెట్లు సురిన్ జిల్లాలోని ఫానోమ్ డాంగ్ రాక్ హాస్పిటల్ వద్ద అవి పడినట్లు తెలిసింది. పెన్సెల్వేనియా

ర్యాలీలో ట్రంప్ మాట్లాడుతూ తాను ఇప్పటివరకు ఆపిన యుద్ధాల గురించి మరోమారు చెప్పుకున్నారు. అదే సమయంలో యూరప్‌పై విమర్శలు గుప్పించారు. యూరప్ చాలా బలహీనంగా ఉందన్నారు. ఉక్రెయిన్ విషయంలో సరైన నిర్ణయాలను తీసుకోలేదన్నారు. యూరప్ దేశాలు రక్షణ వ్యయంపై గొప్ప ప్రసంగాలు చేస్తాయి తప్ప యుద్ధం కొనసాగుతున్నప్పటికీ అవసరమైన సహాయాన్ని అందించవని ఎద్దేవా చేశారు. వలసదారుల విషయంలోనూ యూరప్ దేశాల విధానాలను విపత్తు అంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఇదిలావుంటే, తమ శాంతి ఒప్పందంలోని కొన్ని భాగాలను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తిరస్కరించారని, ఆయన ఓటమిని అంగీకరించాలని ట్రంప్ అన్నారు. కాల్పుల విమరణ విషయంలో రాజీపడేందుకు ఆయనకు ఇదే సమయమని సూచించారు. అమెరికా శాంతి ప్రణాళిక కొత్త ముసాయిదాను జెలెన్‌స్కీ నిశితంగా అధ్యయనం చేయడం మంచిదన్నారు. ప్రాణ నష్టం భారీగా జరుగుతుండటం వల్ల ఆయన రాజీకి రావాలని సూచించారు. ఉక్రెయిన్ కంటే చాలా పెద్దది... శక్తిమంతమైన రష్యా ఈ పోరులో గెలవడం తథ్యమన్నారు. ఓడిపోతున్నామన్న సత్యాన్ని ఉక్రెయిన్ గ్రహించాలని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్‌లో ఎన్నికలు జరపాలని, యుద్ధాన్ని సాకుగా చూపించి ఎన్నికల నుంచి తప్పించుకోవదని సూచించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు కానీ అది ఎక్కడా కనిపించడం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.

సుప్రీం తీర్పు అమెరికా భద్రతకు ముప్పు: ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై అమెరికా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా అక్కడి సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పు దేశ భద్రతకు ముప్పు కలిగించేదిగా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. సుంకాల ద్వారా ఇప్పటికే వందల బిలియన్ డాలర్ల సంపద సృష్టించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలు చూస్తారంటూ ప్రకటించారు. తన నిర్ణయాలకు వ్యతిరేకిస్తే అమెరికాకు ఆర్థిక రక్షణ ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఇతర దేశాలు తమతో ఎలా ప్రవర్తిస్తున్నాయో అదే రీతిలో బదులిస్తామని, ఈ పద్ధతిని అడ్డుకోవద్దని న్యాయస్థానాలను కోరారు. సుంకాల అమలుతో అమెరికా భద్రత మెరుగైందని ట్రంప్ తెలిపారు.

జన్మత: పౌరసత్వం బానిసల పిల్లల కోసమే

జన్మత: పౌరసత్వం హక్కు కేవలం బానిసల పిల్లలకే తప్ప ధనవంతుల కోసం కాదని ట్రంప్ అన్నారు. పౌరసత్వానికి సంబంధించిన 14వ రాజ్యాంగ సవరణను ప్రస్తావించారు. ధనిక వలసదారులు తమ కుటుంబాన్ని అమెరికా పౌరులుగా మార్చుకునేందుకు ఇది మార్గం కాదని స్పష్టంచేశారు. జన్మత: పౌరసత్వం వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. విచారణకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. దీంతో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం చర్చకు దారితీసింది. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం అక్రమ వలసదారులు, పర్యాటకుల పిల్లలకు జన్మత: పౌరసత్వం లభించదు. ఈ ఆదేశాల అమలును ఫెడరల్ కోర్టులు తాత్కాలికంగా నిలిపివేశాయి. ఇప్పుడు సర్వోన్నత న్యాయస్థానం దీనిపై విచారణకు సిద్ధమైంది. ఈనెల 5న అప్పీలును స్వీకరించింది. వచ్చే వేసవిలో తుది తీర్పుకు అవకాశం ఉన్నది. అయితే ట్రంప్ తన ఆదేశాన్ని సమర్థించుకున్నారు. ఆ చట్టం బానిసల పిల్లల కోసమేనని యుద్ధం ముగిసిన సమయాన్ని, తేదీలను చూస్తే స్పష్టమవుతుందని అన్నారు. విదేశాల నుంచి వచ్చిన ధనిక కుటుంబాలకు ఇది వర్తించదని చెప్పారు. ఈ కేసును ప్రభుత్వం ఓడిపోతే అమెరికాకు తీవ్ర నష్టం తప్పదని ట్రంప్ హెచ్చరించారు.

ఆస్ట్రేలియాలో భారతీయుడికి 25 ఏళ్ల జైలు

క్యాన్‌బెర్రా: భారత సంతతికి చెందిన వ్యక్తికి ఆస్ట్రేలియా సుప్రీం కోర్టు 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2018లో క్వీన్స్‌లాండ్ బీచ్‌లో 24 ఏళ్ల యువతిని హత్య చేసిన కేసులో రాజ్విందర్ సింగ్ (41)ను దోషిగా తేల్చింది. 2018 అక్టోబరు 21న కైర్న్స్‌లోని వాంగెట్టి బీచ్‌లో తన కుక్కతో పాటు షికారుకు వెళ్లిన యువతిని సింగ్ ఉద్దేశపూర్వకంగా చంపినట్లు జస్టిస్ లింకన్ క్రోవ్లే నిర్ధారించారు. హత్య అనంతరం తన భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు చెప్పాపెట్టకుండా భారత్‌కు పారిపోయి, శిక్ష నుంచి తప్పించుకోవాలని సింగ్ ప్రయత్నించినట్లు దుయ్యబట్టారు. ఏడేళ్ల తర్వాత అతినికి 25 ఏళ్లు నాన్-పెరోల్ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. కాగా, క్వీన్స్‌లాండ్ పోలీసులు మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల రివార్డు ప్రకటించిన క్రమంలో రెండేళ్ల కిందట సింగ్‌ను ఆస్ట్రేలియాకు అప్పగించారు.

భద్రతకు హామీనిస్తే ఎన్నికలకు సిద్ధం

రష్యా ఒప్పకుంటే కాల్పులు విరమిస్తాం: జెలెన్‌స్కీ

కీవ్: ఎన్నికలకు ఉక్రెయిన్ సిద్ధమని అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని సాకుగా చేసుకొని ఎన్నికలు నిర్వహించడం లేదన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శల క్రమంలో తాజా ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. వాస్తవానికి జెలెన్‌స్కీ ఐదేళ్ల పదవీ కాలం 2024 మేతో ముగిసింది. అయితే రష్యా సైనిక చర్యలతో ఆ దేశంలో సైనిక పాలన అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికలు జరగలేదు. జెలెన్‌స్కీ తాజాగా విలేకరులు మాట్లాడుతూ ఈ విషయంలో స్పష్టతిచ్చారు. ఇందుకోసం చట్టాన్ని మార్చడం గురించి ప్రతిపాదనలు కోరతాసన్నారు. భాగస్వామ్య దేశాల నుంచి భద్రతకు హామీ లభిస్తే మరో 60-90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించుకోవచ్చు అని చెప్పారు. అమెరికా, ఇతర మిత్రదేశాలు మద్దతిస్తే ఇది సాధ్యమన్నారు. అదే సమయంలో రష్యా అంగీకరిస్తే చమురు క్షేత్రాలపై కాల్పులను విరమించుకోవడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. శాంతి ఒప్పందంపై వచ్చే రెండు వారాల్లోగా అమెరికాలో అత్యుతన్న స్థాయి సమావేశం కోసం దేనికైనా సిద్ధమన్నారు. అమెరికా ప్రతిపాదిత ఒప్పందంలో భాగంగా ఉక్రెయిన్ పునరుద్ధరణపై చర్చించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ వారంలో జరిగే భద్రతా సలహాదారుల స్థాయి సమావేశాల్లో భాగంగా యూరప్, అమెరికా ప్రతినిధులతో మరిన్ని సమావేశాలను ఆశిస్తున్నట్లు జెలెన్‌స్కీ వెల్లడించారు.

చెక్ రిపబ్లిక్ ప్రధానిగా ఆండ్రెజ్ బాబిస్

ప్రాగ్: చెక్ రిపబ్లిక్ ప్రధానిగా ఆండ్రెజ్ బాబిస్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశాధ్యక్షుడు పీటర్ పవేల్ సమక్షంలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అక్టోబరు 3-4 తేదీల్లో జరిగిన ఎన్నికల్లో బాబిస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకున్నది. ది ఫ్రీడమ్ అండ్ డైరెక్ట్ డెమొక్రసీ యాంటీ మైగ్రెంట్ పార్టీ, మొటరిస్ట్స్ ఫర్ దెమ్‌సెల్ఫ్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 16 మందితో కేబినెట్ ఏర్పాటు చేసుకునేందుకు అధికార భాగస్వామ్య పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. అధిక స్థానాలు గెలుచుకున్న ఏఎన్ఓ పార్టీకి ఎనిమిది స్థానాలు, ప్రధాని పదవి దక్కగా, మొటరిస్ట్స్‌కు నాలుగు, ఫ్రీడమ్‌కు మూడు చొప్పున స్థానాలు కేటాయించారు. 200 స్థానాలు ఉండే దిగువ సభలో కొత్త సంకీర్ణానికి 108 స్థానాలు ఉన్నాయి. ఈ సంకీర్ణం హంగరీ, స్లోవేకియా మార్గంలో రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు మద్దతుకు దూరంగా ఉండబోతోంది. కాగా, ఆండ్రెజ్ బాబిస్ (71) ప్రధానిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఆయన 2017 నుంచి 2021 వరకు ప్రధానిగా ఉన్నారు. స్వదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడైనా సరే చెక్ రిపబ్లిక్ ప్రజల ప్రయోజనాల కోసమే పోరాడతానన్నారు. ఈ భూమి మీద అత్యుత్తుత జీవితాన్ని అందించే దేశంగా చెక్ రిపబ్లిక్‌ను నిలుపుతానని ఆండ్రెజ్ బాబిస్ హామీనిచ్చారు.

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

ఫోర్త్ సిటీ చారిత్రకమని, ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ ఒకటేనని తెలిపారు. ఫ్యూచర్ సిటీ వల్ల దేశం చూపు తెలంగాణ వైపు మళ్లిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అజెండాగా సుపరిపాలన సాగిందని, మెట్రో ఫేజ్‌తో పాటు మూసీ సుందరీకరణ జరగనుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో పార్టీ కోసం స్థలం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులపై హరీశ్‌రావు స్పష్టమైన నిర్ణయం వెల్లడించాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసం పాలైందని, తెలంగాణ భవిష్యత్‌కు గ్లోబల్ సమ్మిట్ సరికొత్త దశ తీసుకుందని ఆయన వివరించారు. లావాదేవీల్లో తేడాల వల్లే కవిత విమర్శలు చేస్తోందని, ఆమె వలన బీఆర్ఎస్ నేతల లూటీలు బయటకు వస్తున్నాయని తెలిపారు. కవిత లూటీ వ్యాఖ్యలపై సీఎం విచారణ జరపాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక సాధారణ విషయం కాదని, స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టారని వెల్లడించారు. గతంలో 50 ఎకరాలు భూదానం చేశానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రియాంక గాంధీ చరిత్రను మరోసారి గుర్తు చేశారని, వందేమాతరం ఆచరించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రధాని చవకబారు వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ నాయకత్వంలో తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి అవుతారని, ఆ ఆకాంక్ష తప్పకుండా నెరవేరుతుందని తెలిపారు. సీఎంకు, తనకు మధ్య గ్యాప్ అసత్య ప్రచారమంటూ కొట్టిపారేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వృద్ధులు ... దివ్యాంగుల కోసం మోకాలి/ర్యాంప్‌లు అందుబాటులో ఉన్నాయి. మంత్రి పొన్నం మాట్లాడుతూ నగరంలో 373 కొత్త కాలనీ రూట్లకు ఆర్టీసీ బస్సులు నడుపుతుందన్నారు. దాదాపు ఏడు లక్షల మందికి అదనంగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందని పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులకు అవసరమైన బస్సులు నడిపించడానికి సిద్ధంగా ఉన్నామని, సొంత వాహనాలు , క్యాబ్ లకు దూరంగా ఉంచడం వల్ల ట్రాఫిక్ ను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. రాజధాని నుంచి గ్రామాల వరకు ఆర్టీసీ మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగ నియామకాలు పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రమాదాలను తగ్గించడానికి రవాణా శాఖ అధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ యాత్రదానం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే హైదరాబాద్ ,కరీంనగర్ , నిజామాబాద్ , నల్లగొండ, సూర్యాపేటలలో ఈవీ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు ఉచితంగా రూ.8,500 కోట్ల విలువైన ప్రయాణాన్ని చేశారని పేర్కొన్నారు. 40 శాతం బస్సులు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేసిందనీ కొనియాడారు. ఆర్టీసీ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత అంశాలుగా పని చేస్తుందన్నారు. నూతన బస్ డిపోలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 65 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభం వల్ల నగరంలో ఆర్టీసీ మరింత విస్తృత సేవలు అందిస్తుందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు ప్రతి రోజు ఒక టన్ను కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిస్తుందని నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, కార్పొరేటర్ సుచరిత రెడ్డి, ఈడీలు, ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఉమర్, షర్జిల్ బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్

(మొదటిపేజీ తరువాయి)

తరపున కపిల్ సిబల్, షర్జిల్ ఇమామ్ తరపున లుత్రా వాదనలు వినిపించారు. ఉమర్, షర్జిల్ బెయిల్ పిటిషన్లను ఢిల్లీ పోలీసులు తీవ్రంగా వ్యతిరేకించారు. 2020 ఫిబ్రవరి అల్లర్లు అప్పటికప్పుడు జరగలేదని, పథకం ప్రకారం దేశ సార్వభౌమత్వంపై దాడి ఉద్దేశంతో చేయించినవిగా పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వొద్దు అని న్యాయస్తానాన్ని కోరారు. కపిల్ సిబల్ వాదిస్తూ 'ఈ విద్యార్థులు చేసింది తప్పో, రైటో పక్కన పెడితే... మనం కూడా యువకులుగా ఉన్నప్పుడు ఆందోళనలు చేశాం. నిరసన తెలిపినంత మాత్రానా జైల్లో పెట్టడం, శిక్షించడం సరికాదు. ఆందోళనల్లో భాగంగా చక్కా జామ్, రైల్ రోకో వంటివి మన దేశంలో సర్వసాధారణం. వీటిని ఉగ్రవాద చర్యలు అనలేం. ఉపా చట్టాన్ని ఆపాదించలేం. వెర్నమ్, షమా సేన్‌పై ఉపా కేసుల్లో కోర్టు ఉదారశీనంగా వ్యవహరించి బెయిల్ ఇచ్చింది' అని అన్నారు. 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో అల్లర్లు జరిగినప్పుడు ఉమర్ ఖాలిద్ అక్కడ లేరని, ఉమర్ ప్రసంగాల్లో కొంత భాగాన్ని మాత్రమే తీసి కోర్టులో సాక్ష్యంగా చూపారని వాదించారు. ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇదిలావుంటే, 2020 అల్లర్ల సూత్రధారులుగా ఉమర్, షర్జిల్‌తో పాటు మరికొందరు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-1967 (ఉపా) కింద జైల్లో ఉన్న విషయం విదితమే. పౌరసత్వ (సవరణ) చట్టం (సీఏఏ), ఎన్ఆర్‌సీ వ్యతిరేక ఆందోళనల క్రమంలో జరిగిన అల్లర్లలో 53 మంది చనిపోగా, 700 మంది గాయపడ్డారు. తమకు బెయిల్ నిరాకరిస్తూ సెప్టెంబరు 2న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్వర్వులను సర్వోన్నత న్యాయస్థానంలో నిందితులు సవాల్ చేశారు. దీనిపై విచారణ క్రమంలో తీర్పును సుప్రీం కోర్టు తాజాగా రిజర్వులో పెట్టింది.

ఎయిర్‌లైన్స్ దోపిడీ ఎందుకు అరికట్టలేదు?

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతుంటే.. దాని నుంచి ప్రయోజనం పొందేందుకు ఇతర విమానయాన సంస్థలకు అనుమతి ఎలా లభించింది?. టికెట్ ధరలు రూ.35 వేల నుంచి 39 వేల వరకు ఎలా పెరిగాయి? ఇతర ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి అధిక ధరలు వసూలు చేయడం ఎలా సాధ్యమైంది? ఇది ఎలా జరుగుతుంది? అని జస్టిస్ గెడెలా కేంద్రానికి ప్రశ్నలు సంధించారు. అయితే.. కేంద్రం తగు చర్యలు తీసుకుందని అదనపు సొలిసిటర్ జనరల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ... ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలను అభినందిస్తున్నాం. అయితే ఇక్కడ మా ప్రశ్న ఏంటంటే... అసలు ఈ పరిస్థితి ఎందుకు ఉత్పన్నమైంది? దీనికి ఎవరు కారణం? అని ప్రశ్నించింది. దాంతో ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి అడిషనల్ సొలిసిటర్ జనరల్ కోర్టుకు వెల్లడించారు. ఆ సమాధానంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇండిగో వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా నష్టపోయింది. పరిస్థితి ముందుగా అంచనా వేయలేకపోయారు. ఇటు ఇతర ఎయిర్‌లైన్సులు ధరలు పెంచుతున్నా... ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు? ఎయిర్‌లైన్స్ అధిక ధరలు వసూలు చేయడానికి అనుమతి ఎలా ఇచ్చారు? అని పౌరవిమానయాన శాఖను ఢిల్లీ హైకోర్టు సమగ్ర వివరణ కోరింది. "మీరు సంక్షోభం ఏర్పడిన తర్వాతే అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రశ్న అది కాదు. అసలు ఆ పరిస్థితి ఎందుకు తలెత్తింది? అప్పటి వరకు మీరు ఏం చేస్తున్నారు?" అని న్యాయస్థానం ప్రశ్నించింది. పైలట్‌లపై అధిక పనిభారం ఎందుకు ఉందో, దానిని నివారించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చెప్పాలని కూడా కోర్టు కేంద్రాన్ని కోరింది. అదే సమయంలో.. ఇండిగో తగినంతమంది పైలట్లను నియమించుకోవాలని, ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను పాటించాలని ఆదేశించింది.

సమగ్ర సమాచారంతో రండి: ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం

ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తమ ముందు హాజరుకావాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. ఇటీవలి పరిణామాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో ఈ నెల 11న డీజీసీఏ కార్యాలయానికి రావాలని ఓ ప్రకటనలో తెలిపింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయాలతో ఇటీవల లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డ సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం సంస్థ సర్వీసుల్లో 10 శాతం కోత విధించింది. ఈ క్రమంలోనే ఇండిగో సీఈఓకు నోటీసులిచ్చింది. 'ఇండిగో సీఈవో, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డీజీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలి. ఇటీవలి అంతరాయాలకు సంబంధించిన సమగ్ర సమాచారం, అప్‌డేట్‌లు, పూర్తి నివేదికతో రావాలి" అని డీజీసీఏ ఆదేశించింది. విమాన సర్వీసుల పునరుద్ధరణ, పైలట్లు, సిబ్బంది నియామకాల ప్రణాళిక, పైలట్లు, క్యాబిన్ సిబ్బంది సంఖ్య వివరాలు, రద్దయిన విమానాల సంఖ్య, రిఫండ్‌లు తదితర పూర్తి సమాచారాన్ని అందజేయాలని స్పష్టం చేసింది. ఇండిగో వ్యవహారంపై దర్యాప్తు కోసం డీజీసీఏ ఇప్పటికే నలుగురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలి అంతరాయాలకు దారితీసిన కారణాలను గుర్తించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. కమిటీ నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుకుంటామని పౌర విమానయాన శాఖ ఇప్పటికే వెల్లడించింది.

ఆటో కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ మోసం

(మొదటిపేజీ తరువాయి)

భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆటో అన్నలతో బీఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం కొత్తది కాదని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటో డ్రైవర్లు కూడా ముందుండి పోరాడారని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా కేవలం ఆటో అన్నలకే కాకుండా, రాష్ట్రంలోని సుమారు 6న్నర లక్షల నుంచి 7 లక్షల మంది ఆటో కార్మికులకు అడగకుండానే, మ్యానిఫెస్టోలో పెట్టకుండానే రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించారని వివరించారు. రాష్ట్రంలో మార్పు, మార్పు అంటూ జరిగిన మోసం ఎలా ఉంటుందో రెండేళ్లలో ప్రజలకు అర్థమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువత, మహిళలు సహా అందరినీ 420 హామీలు ఇచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. నెలకు రూ.1,000 చొప్పున ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సిన మొత్తాన్ని రెండేళ్లకు లెక్క కడితే, రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,560 కోట్లు బాకీ పడి ఉందని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లకు బీమా కల్పిస్తే, ఈ ప్రభుత్వం దాన్ని కూడా ఊడగొట్టిందని, అందుకే గతంలో 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యే అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల హక్కుల సాధనకు తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి లోపు బీమా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు పెట్టకుంటే, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహా ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఒక క్రెడిట్ సొసైటీ (కోఆపరేటివ్ సొసైటీ) గా ఏర్పడాలని ఆయన సూచించారు.

దీపావళికి యునెస్కో గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

రక్షించుకోవాల్సిన అవసరం ఉందని యునెస్కో ప్రతినిధులు చెప్పారు. యునెస్కో 20వ సదస్సు ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈనెల 13 వరకు జరుగనుంది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశం భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి. కాగా, యునెస్కో గుర్తింపు కోసం 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను కమిటీ పరిశీలించింది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు. దీపావళి పండుగను యునెస్కో గుర్తించడాన్ని భారత్ స్వాగతించింది. దేశ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులకు ఇది ఉత్సాహాన్ని కలిగించే విషయమని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

మోదీతో విభేదించిన రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

అసమ్మతి నోట్ అందజేశారు. అయితే సెంట్రల్ ప్యానల్ల చీఫ్‌ల ఎంపికలో షార్ట్‌లిస్ట్ చేసిన అధికారులకు సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. లోక్‌సభ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశ మూలాలనే దెబ్బతీసేలా ఓటుచోరీ జరుగుతోందని, భారత ప్రజాస్వామ్యానికి భంగం కలిగేలా ఈసీని బీజేపీ వాడుకుంటోందని ఆరోపించిన విషయం తెలిసిందే. తన ప్రసంగానికి సంబంధించిన వీడియోను రాహుల్ బుధవారం సోషల్ మీడియాలో షేర్‌చేశారు. ఎన్నికల్లో అవకతవకలపై లోక్‌సభలో తాను కేంద్రాన్ని అడిగిన మూడు ప్రశ్నలకు సమాధానం ఒకటేనని పేర్కొన్నారు. అది ఓట్ల చోరీకి బీజేపీ ఎన్నికల కమిషన్‌ను ఓ సాధనంగా వాడుకోవడమేనని రాసుకొచ్చారు.

మోదీ, నేను ఆర్‌ఎస్‌ఎస్ అనుచరులం

(మొదటిపేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. నెలల తరబడి ఎస్ఐఆర్‌పై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని... అందర్నీ తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ చేస్తున్న 'ఓట్ చోరీ' ఆరోపణలు కూడా ఎస్ఐఆర్‌ను తప్పుదారి పట్టించేవేనని చెప్పుకొచ్చారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధ సంస్థ అని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసే సంస్థ కాదని అమిత్‌షా స్పష్టం చేశారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరపాల్సిన బాధ్యత ఈసీదేనని చెప్పారు. పార్లమెంటులో చర్చ ఎన్నికల సంస్కరణలకు ఉద్దేశించినప్పటికీ విపక్షాలు కేవలం ఎస్ఐఆర్‌పైనే దృష్టిసారించాయని, గత నాలుగు నెలలుగా ఎస్ఐఆర్‌పై అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో 1952లో తొలి ఎస్ఐఆర్ జరిగిందని, ఆ తర్వాత కూడా నెహ్రూ, ఇందిరాగాంధీ సహా కాంగ్రెస్ పాలనలో అనేకమార్లు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించారని చెప్పారు. రాజ్యాంగ బాధ్యతలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ నిర్వహిస్తోందని వివరించారు.

ఓట్ల చోరీపై చర్చకు సిద్ధమా? అమిత్‌షాకు రాహుల్ సవాల్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లచోరీ జరిగిందన్న రాహుల్ గాంధీ ఆరోపణలపై అమిత్‌షా కీలక స్పందిస్తూ... హర్యానాలోని ఒకే ఒక ఇంట్లో 501 మంది ఓటర్లు ఉండటంపై ఈసీ ఇప్పటికే స్పష్టత ఇచ్చిందన్నారు. ఈసీ ప్రకారం, ఇంటి నంబరు 265లో ఉన్నది చిన్నపాటి ఇల్లు కాదని, ఆ నివాసం దాదాపు ఎకరానికిపైగా స్థలంలో విస్తరించి ఉందని ఆయన తెలిపారు. అందులో ఒకే కుటుంబీకులు నివసిస్తున్నారని అమిత్‌షా చెప్పారు. గత మూడు తరాలుగా ఆ కుటుంబం అదే ఇంట్లో ఉంటోందన్నారు. అది ఫేక్ ఇల్లు కాదని, అందులో ఉన్నవాళ్లు మోసపూరిత ఓటర్లు కానే కాదని హోం మంత్రి తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ జోక్యం చేసుకుంటూ... ఓట్ల చోరీ విషయంలో నా ఆరోపణలపై సభలో చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. హర్యానాలో 19 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. మొదటిసారి ఈసీకి పూర్తి ఇమ్యూనిటీ ఇచ్చారని చెప్పారు. ఓట్ల చోరీకి సంబంధించి తాను నిర్వహించిన 'హైడ్రోజన్ బాంబ్' ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రస్తావించిన అంశాలపై లోక్‌సభలో చర్చను నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనికి అమిత్‌షా ఆగ్రహంతో బదులిచ్చారు. తన అభిమతం ప్రకారమే లోక్‌సభలో ప్రసంగిస్తానని, రాహుల్ గాంధీ ప్రశ్నలు అడిగి రెచ్చగొడితే రెచ్చిపోనని స్పష్టంచేశారు. రాహుల్ గాంధీ లెక్క ప్రకారం పార్లమెంటు నడవదన్నారు. తన సమాధానాలను వినే ఓపిక రాహుల్ గాంధీకి ఉండాలని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సభ్యులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, తాను కూడా ఆ సంస్థ అనుచరులేనని అన్నారు. దీని తర్వాత ప్రతిపక్షాలు సభనుంచి వాకౌట్ చేశాయి. దీనిపై అమిత్ షా మాట్లాడుతూ వారు 200 సార్లు బహిష్కరించవచ్చు గాక... ఈ దేశంలో ఒక్క చొరబాటుదారుడిని కూడా ఓటు వేయడానికి అనుమతించమని చెప్పారు. సర్దార్ పటేల్ ప్రధాని కావాల్సింది, ఓట్ చోరీ ద్వారా నెహ్రూ అయ్యారని షా ఆరోపించారు. సర్దార్ పటేల్‌కు 28 ఓట్లు వస్తే, నెహ్రూకు 2 ఓట్లు వచ్చాయని కానీ, నెహ్రూనే ప్రధాని అయ్యారన్నారు.

తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)



నోటిఫికేషన్ వెలువడింది. ఐదు చోట్ల అసలు నామినేషన్లు దాఖలు కాలేదు. 3,836 సర్పంచ్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత పోరులో మొత్తం 13,127 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇదిలా ఉండగా... పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రూ. 175 కోట్ల నిధులను రేవంత్ ప్రభుత్వం కేటాయించింది. అందులో రూ. 100 కోట్ల నిధులను విడుదల చేసింది.

మూడు దశల్లో పోలింగ్...

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరుగుతున్నాయి. తొలి దశ గురువారం జరుగుతుండగా... రెండో దశ ఈ నెల 14న, మూడో దశ 17న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ పూర్తి కాగానే లెక్కింపు జరుగుతుంది.

రూ. 8 కోట్లు సీజ్: అదనపు డీజీ

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఇప్పటి వరకు రూ. ఎనిమిది కోట్ల నగదు సీజ్ చేశామని లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ వెల్లడించారు. రూ. రెండున్నర కోట్ల విలువైన డ్రగ్స్, రూ. రెండు కోట్ల నగదు, రూ. మూడు కోట్ల విలువైన మద్యం సీజ్ చేశామన్నారు. 3,214 మందిపై ఎఫ్ఐఆర్, 31,428 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

ముందస్తు చర్యల్లో భాగంగా కొందరి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

(మొదటిపేజీ తరువాయి)

ఎవరు పాల్పడ్డా ప్రశ్నించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు వెన్నంటి ఉండేది సీపీఐ ప్రజా ప్రతినిధులేనన్నారు. ప్రతి పథకాన్ని గ్రామీణ పేదల గడప చేర్చే బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ఖానాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని, జిల్లా ఎస్పీ జానకితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అందరూ ప్రశాంతంగా ఉండి, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ కొరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఓపికగా ఉండాలని అన్నారు. అన్ని ఫారములను తప్పులు లేకుండా పూరిస్తూ, ఓటింగ్ సరళి వివరాలను పంపాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు,ఉప సర్పంచ్ ఎన్నిక ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. కౌంటర్ల వారీగా తిరుగుతూ, అన్ని పోలింగ్ ప్రతులు, ఫారములు, ఇతర ఎన్నికల సామాగ్రి ఆయా రూట్ల, పోలింగ్ కేంద్రాల వారిగా అందయో లేదో ఎన్నికల విధులు నిర్వహించబోయే అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు సమయానికి భోజనం అందించాలని అన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి (సిపిఓ) జీవరత్నం, డీఈవో భోజన్న, తహసీల్దార్ సుజాత,రెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్, ఇతర అధికా రులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

మానవ హక్కులు.. మన భవిష్యత్

విశాలాంధ్ర కొనిజర్ల : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తనికెళ్లలో గల గ్రేస్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భరోసా ఇన్చార్జి ఎస్సై షాహినా హాజరై మాట్లాడుతూ మానవ హక్కులు అంటే ప్రతి మనిషి ప్రాథమిక హక్కులు, పొందడం అన్నారు. ఇవి జాతి, మతం, లింగం, భాష, దేశం, కులం, ఆర్థిక స్థితి ఏవైనా సరే, అందరికీ సమానంగా వర్తిస్తాయి. ఎవరి గౌరవం, స్వేఛ్, జీవితం, భద్రతను కాపాడే హక్కులే మానవ హక్కులు.మానవ హక్కుల్లో ముఖ్యమైనవి:జీవించే హక్కుస్వేచ్ఛగా ఆలోచించే, భారత రాజ్యాంగం, మానవ హక్కులుమన భారత రాజ్యాంగం కూడా మానవ హక్కులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంది. రాజ్యాంగం మనకు కల్పించిన ఈ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి పౌరుడుపై ఉందన్నారు. ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బాధ్యులు భాస్కర్ మాట్లాడుతూ మానవ హక్కులు అంటే పుస్తకాలలో ఉన్న ఆర్టికల్స్ మాత్రమే కాదు, మన రోజువారీ జీవన విధానంగా మారాలన్నారు. అనంతరం, బాల్య వివాహ ముక్తి భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు తో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్ మాధవి లత, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బాధ్యులు భాస్కర్ , నషా ముక్త్ భారత్ కోఆర్డినేటర్ మానస, గ్రేస్ కళాశాల ఇంచార్జి ఏ .పుల్ల రావు, ప్రిన్సిపాల్ బి కృష?య్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : గురువారం జిల్లాలో నిర్వహించనున్న తొలి విడత ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా, పూర్తి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు.బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట మండల పరిధిలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వర్తించనున్న పోలీస్ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఎస్పీ గారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావంతో పని చేయాలని సూచించారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన ప్రాంతాలను వదలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలని, అనుమతిలేని వ్యక్తులు పరిసరాల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిస్తూ, ఎన్నికల భద్రత అనేది సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు.

ధర్మకోల్ పడవలో నదిని దాటిన ఎన్నికల సిబ్బంది

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : రోడ్డు సౌకర్యాలు లేని గ్రామానికి గ్రామపంచాయతీ ఎన్నికల తొలి దశపోలింగ్ సందర్భంగా నిర్మల్ జిల్లా జనరల్ అబ్జర్వర్ ఐషా మస్రత్ ఖానం పెంబి మండలంలోని యాపాలగూడ గ్రామపంచాయతీని సందర్శించారు. పోలింగ్ సిబ్బంది నదిని దాటి పోలీస్టేషన్లకు చేరుకునే ప్రాంతాన్ని ఆమె స్వయంగా పరిశీలించారు.యాపాలగూడలో పోలింగ్ బూత్‌కి చేరుకునే మార్గంలో వాగు ఉండడం వల్ల, స్థానికంగా తయారు చేసిన థర్మాకోల్ పడవను ఉపయోగించి సిబ్బందిని సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఏర్పాట్లను అబ్జర్వర్ సమగ్రంగా పరిశీలించి, సిబ్బంది ప్రయాణం ఎటువంటి ప్రమాదం లేకుండా జరుగాలన్న దిశగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేడే మొదటి విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, సిబ్బందికి రవాణా, భద్రత, కమ్యూనికేషన్ వంటి అన్ని ఏర్పాట్లు ఖచ్చితంగా సిద్ధంగా ఉండాలని ఆమె స్థానిక ఎన్నికల నిర్వాహకులకు ఆదేశించారు. నదిని దాటే ప్రాంతంలో తగినంత సిబ్బంది, లైఫ్ జాకెట్లు, సపోర్ట్ రోప్స్ వంటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బంది లేకుండా బూత్‌లకు చేరుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అబ్జర్వర్ స్పష్టం చేశారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి : మంత్రి భట్టి



విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : మధిర పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అన్ని నిర్ణత సమయానికి పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన మధిర క్యాంపు కార్యాలయంలో మధిర మున్సిపాలిటీకి సంబంధించిన అభివృద్ధి పనుల ప్రగతిపై వివిధ శాఖ అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. కింది స్థాయిలో పనిచేసే అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్ లో పోస్ట్ చేయాలి.. ఉన్నతాధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను క్వాలిటీ అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఎప్పుడు మొదలుపెట్టారు, ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి. నిర్ణీత సమయానికి పనులు పూర్తి కావాలంటే ఏ తరహాలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించాల్సిన తీరుపై డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీ ఏజెన్సీతో క్వాలిటీ చెక్ జరగాలని మున్సిపల్ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనుల్లో అలస్యం జరిగితే ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయని ఆ పరిస్థితి ఏర్పడవద్దని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మధిర మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన నూతన భవన నమూనాలను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ క్రమంలో స్థానికులు మంచి నీరు, వాహనాల రాకపోకల విషయంలో ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకవైపు మరోవైపు వేగంగా నాణ్యతతో పనులు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ వారి సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. మున్సిపల్ వార్డుల వారీగా పరిస్థితిని డిప్యూటీ సీఎం సమీక్షించారు. నిర్లక్ష్యంగా ఉంటే కఠిన నిర్ణయాలు కూడాఉంటాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

ఆసుపత్రుల నిర్వహణ మెరుగ్గా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - చర్ల : ఆసుపత్రుల సేవలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి లోటుపాట్లకు తావు ఇవ్వకూడదని సూచించారు. కలెక్టర్ తో పాటు భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ బుధవారం చర్ల మండలంలో విస్తృత పర్యటన నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రామీణ మహిళా ఉత్పాదక యూనిట్ల పనితీరుపై సమగ్ర సమీక్ష చేస్తూ పలు కీలక సూచనలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా చర్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ఎమర్జెన్సీ, గైనకాలజీ, పీడియాట్రిక్, లేబర్ రూమ్, ల్యాబ్, ఫార్మసీ, మొత్తం మౌలిక సదుపాయాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, పరికరాల పనితీరు, పరిశుభ్రత, వైద్య సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. ఇన్ పేషంట్ వార్డ్ లో ఉన్న రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కొన్ని చోట్ల ఉన్న చిన్నచిన్న లీకేజీలు, మరమ్మత్తులు, గుర్తించిన తక్షణమే సరిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా సిబ్బంది హాజరు, డబుల్-లాక్ సిస్టమ్‌ను పరిశీలించి ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందితో కలిసి భోజనం చేశారు. తరువాత కలెక్టర్ సుబ్బంపేట గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన మౌలిక వసతులు, వికలాంగులకు ఏర్పాటు చేసిన ర్యాంపులు, త్రాగునీరు, విద్యుత్, టాయిలెట్ సదుపాయాలు, వెబ్‌కాస్టింగ్ కోసం అమర్చిన వీడియో కెమెరాల పనితీరును సమీక్షించారు. పోలింగ్ రోజు ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఆర్.కొత్తగూడెం లోని శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లయబిలిటీ యూనిట్‌ను సందర్శించి మహిళలు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డు, బర్ఫీ, చాక్లెట్, టీ పొడి, నల్లేరు పచ్చడి తదితర ఉత్పత్తులను పరిశీలించారు. ఇప్పపువ్వు సేకరణ విధానం, నాణ్యత, నిల్వ విధానాలు, మార్కెటింగ్ అవకాశాలపై సభ్యులతో చర్చించారు. ఇప్ప చెట్ల లెక్కింపు చేపట్టాలని సూచిస్తూ, పండ్లు నేలపై పడకుండా అవసరమైన నెట్లను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పపువ్వు ఎండబెట్టేందుకు సోలార్ డ్రైయర్లు అవసరం ఉందని సభ్యులు కోరగా, వాటి ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ సాయి వర్ధన్, డాక్టర్ కాంత్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రావణి, చర్ల ఎంపీడీవో, ముత్యాలమ్మ జాయింట్ లైబిలిటీ యూనిట్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 160 గ్రామ పంచాయతీలుండగా 16 సర్పంచ్ పదవులు ఏ కగ్రీవమయ్యాయి. మిగిలిన 144 సర్పంచ్ పదవులకు 411 మంది అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. 1402 వార్డులకుగాను 332 ఏకగ్రీవంకాగా, పాపన్నపేట మండలంలోని అర్కెల గ్రామంలో రెండు వార్డులకు ఎలాంటి నామినేషన్లు రాలేదు. 1068 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. 2426 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆరు మండలాల్లో 1292 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం 1421 పిఒలు, 1529 ఓపిఓలు, 155 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. విధులు జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. పాపన్నపేట మండల కేంద్రంలో తూప్రాన్ ఆర్డీఓ జైచంద్రారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసిల్దార్, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో కలిసి ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను పోలింగ్ బందోబస్త్ మధ్య వాహనాలలో తరలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.ఆరుగురు పోలీసుబాధికారుల పర్యవేక్షణలో 10 మంది సిఐలు, 32 మంది ఎస్ఐలు, 640 మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ భద్రత, సెక్టార్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్ వంటి విభాగాల సిబ్బంది ఉంటారని వివరించారు.

పోలీసుల కవాతు

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేలా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా స్థానిక పోలీసు బలగాలతో చింతకాని మండలం రామకృష్ణపురం, పాతర్లపాడు గ్రామంలో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ...గ్రామ పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నాకా బందీ నిర్వహించిన పోలీసులు.. కీలక పాయింట్లపై నిఘా పెట్టి తనిఖీలు ముమ్మరం చేస్తున్నారని అన్నారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే పోలీసు సిబ్బంది అనేక ప్రాంతాల్లో వీధుల్లో తిరుగుతూ.. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూనే..ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించ వద్దని కోరుతున్నామని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి, ఓటువేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని పెర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే నేరచరితులను బైండోవర్ చేశామని తెలిపారు. అక్రమ మద్యం, నగదు, కానుకల రవాణాను చెక్ పెట్టేందుకు చెక్ పోస్టుల ద్వారా నియంత్రించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ,బ్లూకోల్ట్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్కేపీ సీహెచ్‌పీలో 'నియంత' పాలన

సింగరేణికి లక్షల నష్టం!

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా/ రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థకు గుండెకాయ లాంటి కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ లో ఒక అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సంస్థకు తీరని నష్టాన్ని కలిగిస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా ఆర్కేపీ సీహెచ్‌పీలో గత ఎనిమిదేళ్లుగా ఎటు బదిలీ కాకుండా ఒకేచోట తిష్టవేసిన సదరు అధికారి, కార్మికుల పాలిట నియంతలా మారాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'నాకు యూనియన్లతో సంబంధం లేదు.. నేను చెప్పిందే వేదం.. ఎవరు ఏమైనా చేసుకోండి' అంటూ అహంకారంతో వ్యవహరిస్తున్న తీరుపై కార్మికులు మండిపడుతున్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ.. గాలిలో భద్రత

సీహెచ్‌పీలో భద్రత, నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. దుమ్ము ధూళి ఏడాది కాలంగా వాటర్ ట్యాంకర్ లేకపోవడంతో కార్మికులు దుమ్ముతో తీవ్ర అనారోగ్య పాలవుతున్నారు. రోడ్డు క్లీనింగ్ కాంట్రాక్టు అయిపోయి నెల రోజులైనా దిక్కులేదు. బంకర్లు జామ్ అవుతున్నా పట్టించుకోరు. లోడర్లకు బ్రేకులు సరిగా లేకపోయినా, ఏసీ లేని పాత డోజర్లను ఆయిల్ లీకేజీలతో నడిపిస్తూ ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నారు. వర్షాకాలంలో మెరిట్ బంకర్‌పై రేకులు లేక కార్మికులు తడుస్తూనే పనిచేశారు. సెక్యూరిటీ వైఫల్యం కారణంగా పట్టపగలే దొంగలు స్క్రాప్ ఎత్తుకెళ్తున్నారు. చివరికి కార్మికులే దొంగలను పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం బెల్ట్ రోలర్లు, ఫ్రేమ్స్, ట్యూబ్ లైట్లు కూడా తెప్పించలేని దయనీయ స్థితిలో సీహెచ్‌పీ ఉంది.

డెమరేజ్ చార్జీల మోత.. సంస్థకు నష్టం

బొగ్గు రవాణాలో కీలకమైన ర్యాక్ లోడింగ్ విషయంలో సదరు అధికారి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. లోడింగ్ ఆలస్యం కారణంగా రైల్వే శాఖకు చెల్లించాల్సిన 'డెమరేజ్ చార్జీలు' తడిసి మోపెడవుతున్నాయి. ఇది వరకే స్థానిక జీఎం మొట్టికాయలు వేసిన ఆ అధికారిలో మాత్రం చలనం లేదు. కేవలం అధికారి పనితనం లోపం వల్లే మొన్నటికి మొన్న ఆదివారం రోజున ఏకంగా నాలుగు గంటల పాటు డెమరేజ్ చార్జీలు పడ్డాయి అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లోడింగ్ ఆలస్యమై సంస్థ లక్షల్లో నష్టపోతున్నా, 'నాకు అనవసరం' అనే ధోరణిలో అధికారి ఉండటం గమనార్హం.

సొంత మనుషులకు 'ప్లేదే'లు.. కార్మికులపై చిన్నచూపు

ఆ అధికారికి నచ్చిన కొందరు బంటులను వెంటేసుకుని తిరుగుతూ, వారికి మాత్రమే 'ప్లేదే' లు ఇస్తూ, స్పెషల్ గదులు కేటాయిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. నిజాయితీగా పనిచేసే కార్మికులను మాత్రం చీప్ గా చూస్తూ, అగౌరవంగా మాట్లాడటం నిత్యకృత్యమైంది. సమస్యలు చెప్పుకుందామని వెళ్తే "చూద్దాంలే" అంటూ దాటవేస్తారే తప్ప, పరిష్కరించే మనసు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్ డ్యూటీలో మద్యం సేవించిన వారికి అండగా నిలుస్తూ, ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి.

అండర్ గ్రౌండ్ చూడని ఆఫీసర్.. మౌనంలో యూనియన్లు!

ఇన్నేళ్లుగా పనిచేస్తున్నా, ఏ ఒక్కరోజు కూడా సీహెచ్‌పీలో ఉన్న చిన్న టన్నెల్ అండర్ గ్రౌండ్‌లోకి తొంగిచూడని ఈ అధికారి, నీతులు మాత్రం బాగా చెబుతారని కార్మికులు ఎద్దేవా చేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా, కార్మికుల పక్షాన నిలబడాల్సిన యూనియన్ నాయకులు నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ అధికారి నిర్వాకం వల్ల సీహెచ్‌పీ మూతపడే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి, విచారణ జరిపి, సంస్థను నష్టాల బారి నుండి కాపాడాలని కార్మికులు కోరుతున్నారు.

ఎన్నికల విధులు ఉత్సాహంగా నిర్వహించాలి :కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా: ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే అధికారులు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఉత్సాహంగా తమ విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం పెంబి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, కౌంటర్లవారీగా సిబ్బందిని, వారికి కేటాయించిన సామాగ్రి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి దశ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినమని వివరించారు. త్వరగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తగు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం, వారికి అందించిన సామాగ్రి అంతటిని తిరిగి అధికారులకు అప్పజెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఏఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్ర రెడ్డి, ఆర్డిఓ రత్న కళ్యాణి, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, డిఈఓ భోజన్న, తహసిల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు ఐడి కార్డులు తీసుకురావాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు తప్పనిసరిగా తమ ఐడి కార్డులు తీసుకురావాలని జిల్లా ఎస్పీ డా. శబరిష్ అన్నారు. బుధవారం జిల్లాలోని కేసముద్రం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ సందర్శించారు. గురువారం ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులు సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 సెక్షన్ బిఎన్ఎస్ ఎస్అమల్లో ఉంటుందని, 100 నుండి 200 మీటర్ల పరిధిలో ప్రత్యేక నిబంధనలు ఉండటంతో ప్రజలు అనవసరంగా గుమిగూడకూడదని తెలిపారు.పోలింగ్ కేంద్రాల లోపల వాటర్ బాటిల్లు, ఇంకు బాటిల్లు, ఆయుధాలు, పెన్నులు వంటి వస్తువులకు అనుమతి ఉండదని స్పష్టంచేశారు. క్యూ లైన్ పద్ధతిని పాటించి పోలీసులకు సహకరించాలని ఓటర్లను కోరారు. పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఏవైనా అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికల తర్వాత విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సతీష్ రెడ్డికి సిపిఐ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-నేరేడు చర్ల : బోడలదిన్నె గ్రామపంచాయతీలో సర్పంచిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంగాల సతీష్ రెడ్డికి సిపిఐ పార్టీ తన సంపూర్ణ మద్దతు నిస్తుందని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస రెడ్డి నేరేడుచర్ల పట్టణ సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి ప్రకటించారు. బుధవారం బోడలదిన్నె గ్రామంలోని వివిధ వార్డులలో పర్యటిస్తున్న సందర్భంగా వారు మాట్లాడుతూ... గత దశాబ్ద కాలముగా బోడల దిన్న గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజల తలలో నాలుకగా ఉంటూ, తనదైన రీతిలో గ్రామంలో అందరికీ అందుబాటులో ఉంటూ సామాజిక కార్యక్రమాలలోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్న యువనేత సతీష్ రెడ్డి గెలుపుకి ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. బోడల్ దిన్న గ్రామంలో సీతా రామాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణం లాంటి అభివృద్ధి పథకాలు అమలు కావాలంటే సతీష్ రెడ్డి గెలుపు ఎంతో కీలకమని ఆయన గెలిస్తే గ్రామములో అర్హులందరికీ పెన్షన్లు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయని, అందుకు సిపిఐ పార్టీ నిరంతరం చేదోడు వాదోడుగా ఉంటుందని గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రలతో సంయమనంతో అందరూ ఉండాలని ప్రజలు ఎంతో విజ్ఞులని ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నందున ఇరువర్గాలు తమ తమ ప్రచారాలను శాంతియుతంగా నిర్వహించుకుని బోడలదిన్న ఖ్యాతిని జిల్లా మొత్తం చాటాలని ఆయన కోరారు.వారి వెంట రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కటికోల వెంకన్న ఉన్నారు.

మడో విడత ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర- నల్గొండబ్యూరో : మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దేవరకొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు కేటాయించాల్సిన సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కోర్రా లక్ష్మీ సమక్షంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి, గుండ్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండలాలలో మొత్తం 2206 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం 2647 మంది ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), 2959 మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు (ఓపీఓలు)ను విధులకు నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఈవో బిక్షపతి, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ఈడీఎం దుర్గారావు, ఎన్ఐసి అధికారి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

11న సెలవు : కలెక్టర్

విశాలాంధ్ర-కొమరం భీమ్ : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగిందని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సేవల అత్యవసరతకు లోబడి ఆ రోజు కార్యాలయానికి ఆలస్యంగా హాజరు కావడం కార్యాలయం నుండి త్వరగా వెళ్లడం తక్కువ వ్యవధి గైర్హాజరు విధానాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించబడుతుందని, జిల్లాలో 3 విడతలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మొదటి విడతగా ఈ నెల 11న ఎంపిక చేయబడిన ప్రాంతాలలో స్థానిక సెలవు ప్రకటించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

షాపింగ్ మాల్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిసాన్ షాపింగ్ మాల్ సినీనటి యాంకర్ అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. పెద్ద ఎత్తున ప్రజలు అక్కడికి తరలిరాగా అనసూయ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు ఎమ్మెల్యేలు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. మెదక్ పట్టణంలో వ్యాపారం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లు చంద్రపాల్, మల్లికార్జున గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృషా?రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్, ప్రణయ్ తదితరులున్నారు.

సంపాదకీయం

నిరంకుశత్వ దిశగా

నిరంకుశత్వం చెలాయించడానికి చట్ట సభలో పెద్ద మెజారిటీనే ఉండనవసరం లేదు. సొంతంగా బీజేపీ మెజారిటీకన్నా 33 సీట్లు తక్కువే సాధించినా తెలుగు దేశం, జనతా దళ్ (యు) ఊతకర్రల మీద కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. కానీ మోదీ ప్రభుత్వ వ్యవహార సరళి మాత్రం పెద్ద మెజారిటీ ఉన్న ప్రభుత్వం నడుపుతున్నట్టుగానే ఉంది. ప్రభుత్వ నిర్వహణలో తెలుగు దేశం, జేడీ(యు) మంత్రులు స్వతంత్రంగా చిన్న పనైనా చేసే స్థితిలో ఉన్నట్టు లేరు. వారు కూడా బీజేపీ మంత్రుల్లాగే మోదీ మోచేతికిందే పని చేస్తున్నారు. హిందుత్వను సుస్థిరం చేయడానికి కావాల్సిన పనులన్నీ మోదీ ప్రభుత్వం చేస్తూనే ఉంది. దీనిని బీజేపీ మిత్ర పక్షాలు, లేదా ఎన్డీయే పక్షాలు మొహమాటానికైనా నిలవరిస్తున్న, కనీసం అభ్యంతరం లేవనెత్తుతున్న ఉదంతాలే లేవు. ఈ ధోరణి దేనికి సంకేతమో ఆలోచించాలి. మన పార్లమెంటు ఉభయ సభలు కొనసాగుతున్న లేదా నిర్వహిస్తున్న తీరు చూసినా అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇటీవలి కాలంలో పార్లమెంటు సమావేశాలు జరిగే రోజులు విపరీతంగా కుంచించుకు పోయాయి. ఆ కొద్ది రోజులు కూడా నిరసనలు, వాకౌట్లు, సస్పెన్షన్లు, సభా కార్యకలాపాలు సజావుగా నిర్వహించే అవకాశం లేక పదే పదే సభ వాయిదా వేయడం, అనుకున్న వ్యవధికన్నా ముందే పార్లమెంటు సమావేశాలను ముగించేయడంలాంటివి మన ప్రజాస్వామ్యం ఎటు వెళ్తోందోనన్న ఆందోళనకు కారణం అవుతోంది. ఇదివరకూ పార్లమెంటులో ప్రతిపక్షాలకు, అధికార పక్షానికి మధ్య వాద వివాదాలు తీవ్రంగానే జరిగాయి. విమర్శలు, ప్రతివిమర్శలు జోరుగానే సాగేవి. కానీ అవి చాలా సంస్కారవంతంగా ఉండేవి. మోదీ అధికారంలోకి వచ్చే దాకా ప్రధానమంత్రి స్థానంలో ఎవరున్నా సభ జరుగుతున్నప్పుడు ఎక్కువ సేపు సభలోనే గడిపేవారు. కాకపోతే పార్లమెంటు భవనంలోనే తమకు నిర్దేశించిన స్థానాల్లో కూర్చుని ఇతర ముఖ్యమైన పనులు చేస్తున్నా సభా కార్యక్రమాలను పరిశీలిస్తూనే ఉండేవారు. ఇప్పుడు ప్రధానమంత్రి సభలో గడపడమే అరుదు. ఒక వేళ ఆయన సభకు వచ్చినా తన ప్రసంగం ఏదో కానిచ్చేసి వెళ్లిపోతుంటారు. అందులో నెహ్రూను విమర్శించనిదే ఆయన ప్రసంగం ఉండనే ఉండదు. అధికారంలో ఉన్న పక్షాన్ని ప్రతిపక్షం నిలదీయడం సాధారణమైందే. కానీ మోదీ హయాంలో ప్రతిపక్షాలను బోనెక్కించే కొత్త సంప్రదాయం వచ్చింది. మోదీ ప్రభుత్వానికి అత్యంత విశ్వాసపాత్రమైన గోదీ మీడియా కూడా ప్రతిపక్షాల మీదకే ప్రశ్నలు సంధించే పని చాలా శ్రద్ధగా చేస్తోంది. మొత్తం రాజకీయాలు రెండు అంశాల చుట్టే తిరుగుతున్నాయి. ఒకటి మోదీ నామస్మరణ. రెండోది 59 ఏళ్ల కింద మ ృతి చెందిన తొలి ప్రధానమంత్రి పండిత్ నెహ్రూ మీద విరుచుకుపడడం. తప్పు ఏ ప్రభుత్వ హయాంలో జరిగినా నింద మాత్రం నెహ్రూ మీదే పడుతోంది. పార్లమెంటులో జరిగే సరళి చూస్తే అది ప్రతిపక్షాల పాలిటి బోనులా తయారవుతోంది. ప్రతిపక్షాల ఏ మాటనూ, సూచననూ అంగీకరించే స్థితిలో అధికార పక్షం లేదు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీలు నామ మాత్రంగా కూడా పని చేయడం లేదు. ఒక వేళ ఏ అంశం మీదైనా పార్లమెంటు స్థాయి సంఘాలలో చర్చ జరిగితే అందులో ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలను, అసమ్మతిని రికార్డులలో చేర్చాలన్న కనీస మర్యాద కూడా పాటించడం లేదు. ప్రతి అంశాన్ని, బిల్లును కూలంకశంగా, నిశితంగా పరిశీలించి తగిన సిఫార్సులు చేయవలసింది పోయి కేవలం మొక్కుబడిగా మాత్రమే సమావేశం అవుతున్నాయి. ఒకటి రెండు గంటలు మాత్రమే జరిగి బిల్లులను ఆమోదిస్తున్న సందర్భాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. రెండు రోజులుగా వందేమాతరం, ఎన్నికల సంస్కరణల మీద పదేసి గంటలకన్నా ఎక్కువసమయం ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో ఉత్తమ ప్రసంగాలు చేసిన వారు లేకపోలేదు. అలాంటి వారందరూ ప్రతిపక్ష నాయకులే. అధికారపక్షంలో తర్కబద్ధంగామాట్లాడేవారు, పార్లమెంటరీ సంప్రదాయాలు తెలిసినవారు, పాటించేవారూ రాను రాను తగ్గి పోతున్నారు. ప్రతిపక్షాల మీద ఎంత బలంగా దాడి చేశామా అన్న అంశం మీదే అధికారపక్షానికి ప్రధానమై పోయింది.

పార్లమెంటరీ కార్యకలాపాలు నిర్వహించవలసిన బాధ్యత అధికార పక్షానిదే అయినా అధికార, ప్రతిపక్షాలు కలిసి దేశ వ్యవహారాలకు దిశా నిర్దేశం చేయాలి. ఈ వాసనకూడా కనిపించడం లేదు. ప్రభుత్వం అందరినీ కలుపుకు పోతోంది అన్న భావన జనం మనసుల్లో కలగాలి. ఇవన్నీ గతకాలపు మధురస్మ ృతులైపోయాయి. అధికారపక్షం మీద ప్రతిపక్షాలదాడి, ప్రతిపక్షం మీద, ముఖ్యంగా ప్రతిపక్ష నాయకుడి మీద చేస్తున్న దాడి సకల పార్లమెంటరీ మర్యాదలనూ మరుగున పడేస్తున్నాయి. ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నాయకుడికి మధ్య పలకరింపులు కూడా లేనట్టున్నాయి. వందేమాతరం గేయంరాసి 150సంవత్సరాలైన సందర్భంగా గౌరవప్రదంగా చర్చలు, సంప్రదింపులు, అభిప్రాయ వ్యక్తీకరణలు, గౌరవాదరాలు ఎక్కడా కనిపించలేదు. వందేమాతరంలో కొన్ని చరణాలను తొలగించింది కూడా పండిత్ నెహ్రూనే అని మోదీ సభా ముఖంగా పెద్ద అబద్ధం చెప్పారు. వందేమాతరం గేయంలోని దుర్గా స్తుతి లాంటివి వివాదాస్పదం అవుతాయాని భావించి కొన్ని చరణాలు తొలగించిన మాట నిజమే. దాని కోసం ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో సర్దార్ పటేల్, సుభాష్ చంద్రబోస్ లాంటి వారూ ఉన్నారు. బీజేపీ అలాంటి వారి ప్రస్తావన తీసుకురాకుండా నింద అంతా నెహ్రూ మీదే మోపుతోంది. నెహ్రూను విమర్శించకుండా మోదీ నోరె తెరవలేకపోతున్నారు. మీరు నివాసం ఉండే బస్తీలో మురుగుపారుదల మార్గానికి ఆటంకం కలిగినా, రోడ్డు సరిగ్గా లేకపోయినా దానికి బాధ్యత నెహ్రూదేనని మోదీ ఏ మాత్రం బిడియం లేకుండా మాట్లాడుతుంటారు. తమిళనాడులో కనీసం రెండు చోట్ల హిందూ–ముస్లిం ప్రార్థనా స్థలాల మీద వివాదం రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ అంశాలు ఇంతవరకు ఉత్తరభారత ప్రజలకు అంతగా తెలియదు. కానీ తెలిసేట్టుచేయడానికి సంఘ్ పరివార్ ఏ ప్రయత్నాన్నివదలదు. వచ్చే ఏడాది తమిళనాడులోనూ శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయని గుర్తుంచుకుంటే ఈ వివాదాలు ఎందుకు రెచ్చగొడ్తున్నారో అర్థం అవుతుంది. ఇది దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య భావైక్యత, సంవేదనా శీలత లేకుండా చేయడమే. పార్లమెంటులో జరుగుతున్న రగడ, వాద వివాదాలు నిజానికి జనందాకా చేరడం లేదు. అందుకే జన స్పందన కనిపించడం లేదు. పార్లమెంటులో జరుగుతున్న మంచి–చెడు పరిణామాలను ప్రజలకు అందకుండా చేయడానికి అధికార పక్షం ఒళ్లో కూర్చున్న మీడియా సకల ఏర్పాట్లూ చేస్తోంది. ఇప్పుడు గోదీ మీడియా పాటిస్తున్నది స్వీయ నియంత్రణ కాదు. ప్రభుత్వ వ్యతిరేక భావనలను జనానికి అందకుండా చేయడానికి అనుసరిస్తున్న స్వీయ సెన్సార్షిప్ మాత్రమే. నాకు 60నెలలు ఇవ్వండిచాలునని 2014 ఎన్నికలకు ముందు చెప్పిన మోదీ ఇప్పుడు 2047 వేపు చూపిస్తున్నారు. అప్పటి దాకా మోదీయే ఉంటారని కాదు. కాషాయజెండా ప్రభుత్వమే కొనసాగుతుందన్న విశ్వాసం ఆయనలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇవన్నీ దేశం నియంతృత్వం, నిరంకుశత్వం వేపు పయనిస్తోందనడానికి తిరుగులేని తార్కాణాలు.

అంధకారాన్ని చీల్చిన వెలుగు

రామకిష్టయ్య సంగనభట్ల

తెలుగు సమాజంలో 19 వ శతాబ్దం రెండో భాగం సంస్కరణల మేలుకొలుపు కాలం. విద్వేషపు, వెనుకబాటు ఆచారాల కాటుకు చిక్కుకున్న సమాజాన్ని వెలిగించేందుకు కొంతమంది దూరదృష్టి గల మేధావులు ముందుకు వచ్చి స్త్రీ పురుషుల హక్కుల సమానత్వంపై ప్రగతిశీల చైతన్యం నింపారు. ఆలోచనల ఆరంభంలోనే వితంతువుల దుస్థితి అత్యంత భయంకరంగా నిలిచింది. ఆ కాలంలో వితంతువుల సంఖ్య పెరుగు తున్నా, వారిలో 85 శాతం మందికి పైగా జీవనోపాధి లేకుండా, కుటుంబ అవమానా లతో, సామాజిక అడ్డంకులతో బాధితులై ఉన్నట్లు 19 వ శతాబ్దం చివరన బ్రిటీష్ రికార్డులు నమోదు చేశాయి. వితంతువు సంప్రదాయ పునర్వివాహం అనేది అప్పుడు ఒక కల్పనలా కనిపించింది. ఈ నేపథ్యాన్ని ఛేదించిన మహోన్నతుడు కందుకూరి వీరేశలింగం పంతులు. కందుకూరి వీరేశలింగం పంతులు అప్పటికే విద్యోదయం, స్త్రీ విముక్తి, బాల్యవివాహాల నిర్మూలన వంటి విషయాల్లో పురోగామి రచనలు చేస్తున్న కాలం. రాజమండ్రి విద్యా సంస్థల్లో గురువుగా పనిచేస్తూ, గ్రంథాల ద్వారా జ్ఞానోదయం వెలుగు విస్తరించే ప్రయత్నం చేశారు. వితంతువుల పునర్వివాహం అనేది కేవలం సమాజ సంస్కరణ కాదు. మహిళా జీవన హక్కులను తిరిగి సమాజంలో స్థాపించేందుకు చేసిన సాహసోపేత పునాదిరాయి. 1856లో హిందూ వితంతు పునర్వివాహ చట్టం బ్రిటీష్ పాలనలో అమల్లోకి వచ్చినా, దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు ప్రాంతాల్లో, ఆ చట్టం కాగితాల మీద మాత్రమే నిలిచిపోయింది. 30 సంవత్సరాల పాటు ఒక్క వితంతు వివాహం కూడా ప్రాక్టికల్‌గా నమోదు కాలేదంటే సమాజ ప్రతిఘటన తీవ్రత అర్థమవుతుంది.

అలాంటి ఘడియలో, 1891 డిసెంబర్ 11 న రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం పంతులు ఆధ్వర్యంలో మొట్టమొదటి వితంతు పునర్వివాహం నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం ఆయన పొందిన వ్యతిరేకత, విమర్శలు, బెదిరింపులు అసాధారణమైనవి. సంస్కారవాదులు, సంప్రదాయ ధర్మ గురువులు, స్థానిక సామాజిక వర్గాలు అన్ని వైపులా ఒత్తిడి పెంచినా, ఆయన వెనక్కి తగ్గలేదు. పునర్వివాహానికి ముందుగా వధూవరుల భద్రత కోసం పోలీసు రక్షణను కూడా ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రికార్డుల ప్రకారం, ఆ సమయంలో రాజమండ్రిలో 400మందికి పైగా ప్రజలు ఈ వివాహానికి సాక్షులయ్యారు. ఈ సంఘటన తరువాత కేవలం ఐదేళ్ల వ్యవధిలో ఆంధ్ర ప్రాంతంలో 20కి పైగా వితంతు పునర్వివాహాలు నమోదవడం ఈ చారిత్రక ఘట్టం తెచ్చిన ప్రభావానికి నిదర్శనం.

ఈ వివాహాన్ని కందుకూరి 'మానవధర్మ యజ్ఞం'గా స్వయంగా పిలిచారు. సమాజాన్ని బిగించిపట్టిన మూఢాచారాలను విరిచి, కొత్త ఆలోచనలకు మార్గం వేసిన ఈ చర్య వలన ఆలోచనా సంస్కరణలు వేగం పుంజుకున్నాయి. ఆ కాలంలోని పత్రికలు, ముఖ్యంగా వివేకవార్త, హితవాది, సత్యవాది వంటి సంస్కరణ ప్రచురణలు ఈ ఘట్టాన్ని భారతీయ సామాజిక పునరుజ్జీవనంలో ముఖ్య మైలురాయిగా వర్ణించాయి. వితంతువుల పట్ల తగిన గౌరవం, విద్య, జీవన భద్రత అనే మూడు ప్రధాన సూత్రాలను పంతులు ప్రతిపాదించగా, వాటిని తరువాతి దశాబ్దాల్లో స్త్రీ సాధికారత ఉద్యమాలు మరింత విస్తరించాయి.

ఈ చారిత్రక కార్యక్రమం తర్వాత కందుకూరి వీరేశలింగం పంతులుకు తెలుగు సమాజంలో ఆలోచనా విప్లవకారుడనే బిరుదు స్థిరపడింది. ఆయన కృషి ఫలితంగా 20 వ శతాబ్దం ఆరంభానికి రాగానే ఆంధ్ర ప్రాంతంలో వితంతు విద్యాలయాలు, స్త్రీ శిక్షణ కేంద్రాలు స్థాపితమవగా, 1910 నాటికి బ్రిటీష్ గెజిట్ ప్రకారం 150కి పైగా వితంతు పునర్వివాహాలు నమోదైనట్లు రికార్డులు తెలియ జేస్తున్నాయి. మన సమాజ చరిత్రలో 1891 రాజమండ్రి వితంతు పునర్వివాహం ఒక సాహసఘట్టం మాత్రమే కాదు అది మానవత్వానికి, న్యాయం- సమానత్వాలకు ప్రతీక. ఒకే ఒక్క సంఘటన పునర్వ్యవస్థీకరణ శక్తిగా మారి ఎలా తరాల సామాజిక మానసికతను మార్చ గలదో తెలుపుకొచ్చిన అద్భుత ఘట్టం. తెలుగు సమాజం ఈరోజు పొందుతున్న స్త్రీ స్వాతంత్ర్యం, విద్యావకాశాలు, న్యాయహక్కుల పునాది అచ్చంగా అక్కడే నిలుస్తుంది. కందుకూరి వీరేశలింగం పంతులు వెలిగించిన దీపం అప్పటి చీకటిని తొలగించినంత మాత్రమేకాక, ఆధునిక సమాజ నిర్మాణం వైపు తొలి వెలుగు కిరణంగా నిలిచింది.

సెల్: 9440595494

మోదీ పాలనలో శ్రమ విలువ, కార్మిక భద్రతకు పాతర

వి.ఎస్.బోస్

భారతదేశంలో మోదీ అహంకార పూరితమైన నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నాడు. దానిలో భాగమే 29 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం, కార్పొరేట్ శక్తులకు కావాల్సిన లాభం చేకూర్చుతున్నాడు. చట్టాల పేరు తీసివేసి కోడ్‌లని పేరు పెట్టాడంటేనే అసలు మోదీ నీతి బయటపడుతుంది. చట్టమంటే అగ్రిమెంట్. కోడ్ అంటే కోరలు లేనిది. అగ్రిమెంట్ స్థానంలో ఉన్న 29 చట్టాలను మార్చి 4 కోడ్‌లుగా తెచ్చాడంటే కేంద్ర ప్రభుత్వం అసలు రంగు బయటపడుతున్నది. ప్రతి కార్మిక చట్టం వెనుక అనేక పోరాటాలు, త్యాగాలు, కమిషన్లు కమిటీలు సంబంధిత వర్గాలతో చర్చోపచర్చలు జరిపి అంతిమంగా చేసిన నిర్ణయాలు తరువాత చట్టాల రూపం దాల్చాయి. ఇప్పుడు ఎలాంటి సంప్రదింపులు లేకుండా ప్రధాని మోదీ అంతఃపురంలో పారిశ్రామిక వేత్తలు చెప్పింది కోడ్‌ల రూపంలో తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించి వేస్తున్నారు. కార్మిక సంబంధాల విషయం ఉమ్మడి జాబితాలో ఉంటే అనేక రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంతో 4 కోడ్‌లను బలవంతంగా రుద్దింది. దీని మూలంగా రాజ్యాంగబద్ధమైన కార్మిక హక్కులు, అదే సందర్భంలో రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి దేశంలో ప్రజాస్వామ్యం ఖూనిచేసింది. ఏదైన ఉత్పత్తి జరగాలంటే అది కర్మాగారంలో జరుగుతుంది. పెట్టుబడి ఉన్నా కార్మికులు లేకుండా ఉత్పత్తి జరగదని చరిత్ర చెప్పిన సత్యం. అలాంటి సత్యాన్ని గతంలో బుద్ధుడు, వివేకానందుడు, మహాత్మాగాంధీ లాంటి ప్రముఖులు కూడా చెప్పారు. చదువుకున్నాడో లేదో తెలియని మోదీ మాత్రం కార్మికులు లేకుండానే పెట్టుబడి ఉంటే ఉత్పత్తి జరుగుతుందని వాస్తవ విరుద్ధంగా చెపుతూ దోపిడీదారుల పక్షాన ప్రచారం చేస్తున్నాడు. మోదీ చెప్పిందే నిజమైతే తొలినాటి నుంచి ఉత్పత్తి కేంద్రాలకు కర్మాగారాలుగా ఎందుకు నామకరణం చేశారు. పెట్టుబడి ఆరాలుగా ఎందుకు అనలేదు. ప్రజలంతా వారు వారి తల్లిదండ్రులకు పుట్టామని ప్రకటించుకుంటుంటే మోదీ మాత్రం తాను ప్రత్యక్షంగా దేవదూతగా వచ్చానని చెప్పటం ఎంతనిజమో, ఉత్పత్తిపై మోదీ చేస్తున్న ప్రచారం కూడా అంతే నిజం. బ్రిటీష్ వారి దోపిడీ పాలనలో వచ్చిన పాత కార్మిక చట్టాలను బూజు దులిపి కొత్త చట్టాలు ప్రవేశపెడతానన్న మోదీ కార్మికుల దుమ్ముదులిపి కార్పొరేట్ సంస్థలకు కనక వర్షం కురిసే విధంగా 4 కోడ్‌లు తీసుకొచ్చాడు. 1926 లో బ్రిటీష్ కాలంలో తెచ్చిన చట్టంలో యూనియన్ పెట్టుకోవటానికి ఏడుగురు సభ్యులు సరిపోతారని ఉంటే కొత్త కోడ్‌లలో 10శాతం లేక 100 మంది సభ్యుల సమ్మతితోనే యూనియన్ పెట్టుకోవాలని చెప్పటం దేనికి నిదర్శనమో విజ్ఞులు ఆలోచించాలి. కార్మిక సంఘంలో ఒక వ్యక్తి సంస్థలోని కార్మికుల ఆమోదంతో ఎన్ని సార్లయినా ఆఫీస్ బేరర్‌గా ఉండవచ్చునని ఉంటే కొత్త కోడ్‌లలో ఒక వ్యక్తి కార్మికుల ఆమోదం ఉన్నప్పటికీ 2 సార్లు కన్నా ఎక్కువ సార్లు ఉండకూడదన్న నిబంధన పెట్టారు. అలాగే యూనియన్ ఆఫీసు బేరర్స్‌లో 25 శాతం బయటవారు ఉండవచ్చునని గత చట్టంలో ఉంటే ప్రస్తుత కోడ్‌లలో దానిని రద్దు చేశారు. దీని మూలంగా కార్మికులు అనుభవం కల్గిన కార్మిక నాయకులను పొందే అవకాశం లేకుండా చేసి కార్మికులకు మోదీ ద్రోహం చేశాడు. 1936 లో వేతనాలపై సంప్రదింపుల హక్కులతో కూడిన చట్టం బ్రిటీష్ కాలంలో సాధించుకుంటే ప్రస్తుత కోడ్‌లలో మోదీ దాన్ని మింగేశాడు. వేతనాల కోసం సమ్మెలు చేయకూడదు, వేతనాలపై డిమాండ్ చేయరాదు, కష్టాలు చెప్పుకోవటానికి ప్రస్తుతం ఉన్న లేబర్ కమిషన్ వ్యవస్థను మోదీ రద్దు చేసి సంఘాలకు ఉన్న హక్కులను తొలగించాడు.

కార్మికునికి కర్మాగారంలో ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం చెల్లించే చట్టాన్ని బ్రిటీష్ కాలంలో 1923 లోనే సాధించుకోవటం జరిగింది. కానీ నేటి కోడ్‌లలో నష్టపరిహారం కోసం ప్రమాదాన్ని పరిశీలించి సిఫార్సు చేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను రద్దు చేయటం ఎవరికి లాభం చేయటానికో సులువుగానే అర్థమవుతుంది.

కాంట్రాక్టు కార్మికులను శాశ్వత తరహా ఉద్యోగాల్లో నియమించరాదని చట్టంలో ఉంటే మోదీ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అనే కొత్త తరహా విధానం ప్రవేశపెట్టి యాజమాన్యాల దోపిడీకి మరింత బలం చేకూర్చాడు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ విధానాలకు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అదనంగా చేర్చి పారిశ్రామికవేత్తల అదనపు దోపిడీకి మోదీ సహకరించాడు. 1970 లో ఆనాటి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నప్పటికీ 2014 నుంచి దాని అమలుకు మోదీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. 2016 లో సుప్రీంకోర్టు దీనిపై అనుకూలమైన తీర్పుతో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినప్పటికీ మోదీ ప్రభుత్వం మొండిగా ప్రవర్తించి ఆ తీర్పును అమలు చేయలేదు. అలాంటి మోదీ తాను తెచ్చిన కోడ్‌ల మూలంగా కార్మికులకు సంక్షేమం, లాభం జరుగుతుందని తన కార్పొరేట్ శిష్యులతో ప్రచారం చేయించటం మరింత ద్రోహం. కార్మికులు తాత్కాలికంగా కాకుండా పర్మినెంట్ ఉద్యోగాల్లో ఉంటే కార్మికుడు పనిదొంగగా మారుతాడని దోపిడీదారులు చేస్తున్న ప్రచారానికి మోదీ కూడా వంత పాడుతున్నాడు. మేడే స్ఫూర్తితో రక్తతర్పణతో కార్మికులు 8 గంటల పనిదినాన్ని సాధించుకుంటే మోదీ 10 గంటలు లేక 12 గంటలు రోజుకు పని చేయించుకోవచ్చు అని కోడ్‌ల ద్వారా దోపిడీదారులకు వజ్రాయుధాన్ని అందించాడు. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీ యాక్ట్ ద్వారా కర్మాగారంలో కార్మికునికి కల్పించవల్సిన మౌలిక సౌకర్యాలైన నీరు, వెలుతురు, మరుగుదొడ్లు, భద్రతా సౌకర్యాలు లాంటి వాటిని పరిశీలించే ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను తొలగించి యాజమాన్యాలకు కార్మికుల్ని కొత్తతరం బానిసలుగా అందించాడు. కర్మాగారాల్లో కార్మికుడు పొందవల్సిన ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్, కనీస వేతనాలు లాంటి వాటి అమలు కొరకు పరిశీలించే వ్యవస్థను కూడా మోదీ ప్రభుత్వం కోడ్‌ల ద్వారా హరించి వేసింది. కార్మికుడు తనకు యాజమాన్యం నష్టం చేసినప్పుడు లేక కష్టానికి గురిచేసినప్పుడు నేరుగా కోర్టును ఆశ్రయించే విధానాన్ని రద్దు చేసి కార్మికులను దిక్కులేని వారిగా కోడ్‌ల ద్వారా చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు న్యాయం పొందాలంటే వైకుంఠపాళి ఆట చవి చూడాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం 100 మంది కార్మికులు పనిచేస్తున్న కర్మాగారం మూసివేయాలంటే యజమాని తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాలి. దానిని కోడ్‌లలో ఆ సంఖ్యను 300 కు పెంచారు. కర్మాగారాల్లో కాంట్రాక్టు వ్యవస్థ, ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ లాంటి వ్యవస్థలు ఉంటే యజమాని 300 కన్నా ఎక్కువ కార్మికులను నియమించుకుంటాడనేది కలలో మాట. 95 శాతం పరిశ్రమలు నేటికి 300 కన్నా తక్కువ కార్మికులనే కల్గి వున్నాయనేది వాస్తవం. ఇప్పుడున్న పారిశ్రామిక వివాదాల చట్టంలో కార్మికుడ్ని తొలగించాలంటే యాజమాన్యం అనేక నిబంధనలు పాటించాలి. కానీ ప్రస్తుతం ప్రవేశపెట్టిన 4 కోడ్‌ల ప్రకారం కార్మికుడ్ని తీసివేయటానికి యాజమాన్యానికి ఎలాంటి అడ్డంకులు లేవు. కూరలోని కరివేపాకులా తీసిపడేయటానికి యాజమాన్యానికి హక్కు కల్పించడంతోపాటు పరిశ్రమల మూసివేతకు మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా కోడ్‌లు తెచ్చింది.

కార్మికులు కష్టాలు, బాధలు పడుతుంటే యాజమాన్యాలు లాభాలతో ఆనందపడటం భవిష్యత్తులో జరిగేది వాస్తవం. ఇలాంటి పరిస్థితి రావటానికి పూర్తిగా కోడ్‌ల ప్రభావం అనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. కార్మికులపై కోడ్‌ల మూలంగా పడుతున్న వ్యతిరేక ప్రభావాన్ని కాదని కోడ్‌లు మూలంగా కార్మికులకు న్యాయం జరుగుతుందని, వేతనాలు పెరుగుతాయని, కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని వక్రబుద్ధితో ప్రచారం చేస్తున్న వారు భారతీయులు కాదు. దోపిడీదారుల తొత్తులుగా భావించాలి. ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయలేని వాడు కొత్త కోడ్‌లు తెచ్చి కార్మికులకు మేలు చేస్తానని చెప్పటం నక్క నీతి వచనాలను గుర్తు చేస్తున్నాయి. అంతిమంగా కోడ్‌లు అమలు చేస్తే కార్మికులు బానిసలుగా మారటం తప్పనిసరి. బానిస కాలంలో బానిసలు తిరుగుబాటు చేసి ఆనాడు యంత్రాలే వారి కష్టాలకు కారణమని భావించి ఆ యంత్రాలను పగలగొట్టారు. అప్పుడు యజమానులే దిగివచ్చి కార్మికుల డిమాండ్లను పరిష్కరించారు. నేటి కార్మికుడు తమ కష్టాలకు యాజమాన్యాలే కారణం అని తెలుసుకాబట్టి వారి ఆవేశం యాజమాన్యాలపై సారించి తిరుగుబాటు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు గతంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రభుత్వం తెలుసుకోవాలి. కెనడా దేశ ప్రధాని "మా దేశం అమ్మకానికి లేదని" ప్రకటించినట్లుగానే మన దేశ కార్మికులు మేము బానిసలం కాదు అనే ఉద్యమం తప్పనిసరిగా తీసుకువస్తారని ప్రభుత్వాలు గుర్తించాలి. భారతదేశంలో కార్మికులను బానిసలుగా దోచుకోవటానికి ప్రభుత్వాన్ని లోబరుచుకొని కార్మికుల హక్కులను హరించి ఈ దేశంలో పెట్టుబడులు పెడితే వారు ఊహించినట్లు పారిశ్రామిక శాంతి కాకుండా పారిశ్రామిక విప్లవం వస్తుందని వారు తెలుసుకోవాల్సిన చారిత్రక సత్యాలు చాలా ఉన్నాయి. కార్మికుల ఆవేశాన్ని పక్కదోవ పట్టించటానికి మోదీ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపింది. అదే "కార్మిక శక్తి నీతి 2025" పేరుతో చట్టం తెచ్చి ప్రచారం చేస్తున్నది. దాని ప్రకారం కార్మికుడు పని చేయటానికే పుట్టాడు అది ప్రకృతి ధర్మం, కావున కార్మికుడు తన ధర్మాన్ని తాను నెరవేరిస్తే యాజమాని తన ధర్మాన్ని నిర్వహిస్తాడని తప్పుడు ప్రచారం చేయటం మనువాద కాలంలో ప్రజలు అనుభవించిన పరిస్థితులను గుర్తుచేస్తున్నది. ఉన్న చట్టాలను అమలు చేయని మోదీ ప్రభుత్వం యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం చేస్తానని ప్రచారం చేయటం పెద్ద భూటకం. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న చట్టాన్ని న్యాయపరంగా అమలు చేయటంలో విఫలమైన ప్రభుత్వం వారు దాచుకున్న డబ్బును ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయటంపై ఆ రంగంలోని కార్మికులు పోరాటం చేస్తున్నా పరిష్కారం లేదు. అలాంటిది యజమాని అనే వాడు లేని యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డు ఇస్తామని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ కలుగజేస్తామని ఇంక అనేక సౌకర్యాలు ఇస్తామని చెప్పటంలో నీతిలేదు అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్టు కార్మికులకు, అనేక లక్షల మంది పనిచేస్తున్న ప్రైవేటు కర్మాగారాల్లో ఏ చట్టం అమలు కాకపోతే కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణునిలాగా నిద్రపోతున్నది. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం బేస్డ్ (ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, సాక్షర భారతి లాంటి) అనేక రంగాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, సెలవులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్, గ్రాట్యుటీ లాంటి ఎలాంటి సౌకర్యం లేక చాలీ చాలని వేతనాలతో పనిచేయటం కేంద్ర ప్రభుత్వానికి కనపడటం లేదా. మోదీ తెచ్చిన కోడ్‌లతో సంభవించిన బానిస విధానాన్ని, యజమానుల దోపిడీని ఎదిరించటం కార్మికుల ముందున్న జీవన మరణ సమస్య. ఎవరు అడ్డుపడినా గత చరిత్ర ప్రకారం కార్మికుల తిరుగుబాటు తప్పదనే సూచనలు కనపడుతున్నాయి. దోపిడీ చరిత్రను అంతం చేయాల్సిన కర్తవ్యం కార్మికుల ముందు ఉన్నదని ప్రస్తుత పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

ఏఐటీయూసీ నాయకులు, ఫోన్:9391356527

'వికాస భారాలు' ఎవరికోసం?

వెంకగారి భూమయ్య

సామాజిక మాధ్యమాలలో విపరీతంగా చర్చకు దారి తీసిన ఈ వ్యంగ్య చిత్రం (కార్టూన్), భారతదేశంలో ప్రస్తుత పరిపాలనా వైఖరి, ఆర్థిక వాస్తవాల మధ్య ఉన్న పెద్ద అంతరాన్ని సూచిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యాన ముద్రలో, నవ్వుతూ, సమస్యల శిఖరంపై ప్రశాంతంగా కూర్చుని ఉన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ తమ నియంత్రణలో ఉందని, స్థిరంగా ఉందని ప్రభుత్వ అగ్ర నాయకత్వం ఇస్తున్న సంకేతాన్ని సూచిస్తుంది. అయితే, ఆ కొండరాళ్ల కింద, పెట్రోల్ ధర పెరుగుదల, రూపాయి పతనం, భారీ పన్నుల భారంతో నలిగిపోతున్న సామాన్య పౌరుడి నిస్సత్తువైన రూపం, క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. మోదీ ప్రభుత్వం 2014 లో అధికారంలోకి వచ్చిన తర్వాత, నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ సంస్థలను (పీఎస్‌యూలను) ప్రైవేటీకరించడం లేదా వ్యూహాత్మక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచడం ముఖ్య ఆర్థిక లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ప్రభుత్వానికి మేలు చేసినప్పటికీ, సామాన్యుడిపై కొన్ని భారాలను మోపిందనేది ఈ కార్టూన్ ప్రధాన విమర్శ.

చిత్రంలో కనిపించే భారీ పెట్రోల్ పంపు నాజిల్, 'ట్యాక్స్' అని ఉన్న పెట్టె... ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణ విధానాన్ని ఎత్తి చూపుతాయి. ఇంధన రంగం నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే అత్యంత ముఖ్యమైన ఆర్థిక వనరుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక ఎక్సైజ్ సుంకాలు, రోడ్డు సెస్సులు వంటి పన్నుల కారణంగా వినియోగదారులకు ధరల ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వం ఈ అధిక పన్నుల రాబడిని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం నిధులు సమకూర్చడానికి ఉపయోగిస్తున్నప్పటికీ, ద్రవ్యోల్బణం పెరుగుదలకు, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి ఇది ప్రధాన కారణంగా మారుతోంది. ఈ విధంగా, దేశ నిర్మాణానికి అయ్యే భారాన్ని సామాన్యుడి జేబుపై అధిక పన్నుల రూపంలో మోపుతున్నారు అనే వాదనకు ఈ అంశాలు బలం చేకూరుస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వాన్ని పైన అనుభవిస్తుంటే, ఆ భారం మొత్తం కింద ఉన్న సామాన్యుడిపై పడుతోంది.

రూపాయి విలువ క్షీణత... ఆర్థిక అనిశ్చితి: విరిగిపోయిన రూపాయి నాణెంపై ఉన్న 'రూపీ ఫాల్' అనే ఆంగ్ల అక్షరాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాలును సూచిస్తాయి. భారత రూపాయివిలువ నిరంతరం క్షీణించడం వలన దిగుమతులు (ముఖ్యంగా ముడిచమురు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలు) ఖరీదైనవిగా మారుతున్నాయి. దీని ప్రభావం దేశీయంగా ధరల పెరుగుదలకు దారితీసి, సామాన్య ప్రజల దైనందిన ఖర్చులను పెంచుతుంది. ఈ ఆర్థిక అనిశ్చితి, ప్రపంచ పరిణామాల కారణంగా వచ్చినప్పటికీ, సామాన్యుడికి మాత్రం నిస్సత్తువను, భయాన్ని కలిగిస్తుంది. అధికారంలోఉన్నవారు అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి స్థిరత్వాన్ని కొనసాగించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈ ప్రయత్నాలప్రభావం సామాన్యుడికి దక్కకపోవడం ఈ చిత్రంలోని ప్రధాన విమర్శాంశం.

చిత్రంలో ఇండిగో విమానం, సంచార్ సాథి వంటి అంశాలు ప్రభుత్వంలోని కీలక రంగాల విధి విధానాలను సూచిస్తాయి. మోదీ ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద ప్రైవేటీకరణ చర్యలలో ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్‌నకు విక్రయించడం ఒకటి. దశాబ్దాలుగా ప్రభుత్వానికి వేల కోట్ల నష్టాలను భారీ రుణభారాన్ని మిగిల్చిన ఈ సంస్థను విక్రయించినప్పటికీ, నష్టాల భారాన్ని ప్రభుత్వమే భరించాల్సి వచ్చింది. టెలికాం రంగంలో ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్ వంటివి ప్రైవేట్ పోటీని తట్టుకోలేక భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులను కూడా ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించింది, ఎందుకంటే అవి నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏల) కారణంగా నష్టాలను చవిచూస్తున్నాయి. ప్రైవేటీకరణ ద్వారా బ్యాంకింగ్ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, ఈ నష్టాల భారం మొత్తాన్ని చివరికి ప్రభుత్వ ఖజానా, పరోక్షంగా ప్రజలు మోయాల్సి వస్తోంది.

సమస్యల శిఖరం కింద నలిగిపోతున్న సామాన్య పౌరుడు, ప్రభుత్వ విధానాల వల్ల కలిగే ప్రయోజనాలు, భారాల పంపిణీలో ఉన్న అసమానతను సూచిస్తున్నాడు. ఈ వ్యంగ్యచిత్రం ప్రధానసందేశం ఏమిటంటే, దేశ నాయకత్వం అభివృద్ధి, స్థిరత్వం సంకేతాలతో ఉన్నతస్థాయిలో ఉన్నప్పటికీ, అధిక ఇంధన ధరలు, అధిక పన్నులు, ద్రవ్యోల్బణం వంటి ఆర్థిక భారాలు సామాన్య ప్రజానీకాన్ని రోజువారీ జీవితంలో కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితి, ప్రభుత్వ విధానాలు కేవలం అగ్రస్థాయిలో ఉన్నవారికి మాత్రమే అనుకూలంగా ఉన్నాయనే సామాజిక విమర్శకు బలం చేకూరుస్తుంది.

సీనియర్ జర్నలిస్ట్, 9848559863

'మీ డబ్బు... మీ హక్కు'

క్లెయిమ్ చేయని ఆస్తులపై ప్రధాని పిలుపు



న్యూఢిల్లీ: క్లెయిమ్ చేయని ఆస్తులకు సంబంధించి 'మీ డబ్బు...మీ హక్కు' అనే నినాదాన్ని ప్రధాని నరేంద్రమోదీ తీసుకొచ్చారు. దీనికి సంబంధించి మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదు దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని ప్రధాని తెలిపారు. 'మీ డబ్బు.. మీ హక్కు' ఉద్యమంలో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78 వేల కోట్లు, బీమా కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3 వేల కోట్లు, డివిడెండ్లు రూ.9 వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని ప్రధాని వెల్లడించారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్ము తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. 'మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగస్వాములు కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయి' అని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ.2 వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో అర్హులైన హక్కుదార్లకు అందించామని ప్రధాని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభించింది.

భారత్‌లోనే రైలు టికెట్ ధరలు తక్కువ: అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: భారతదేశంలోనే రైలు టికెట్ ధరలు తక్కువని రైల్వేమంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు, పొరుగుదేశాలతో పోలిస్తే మన రైలు టికెట్ ధరలు చాలా తక్కువగా ఆయన పేర్కొన్నారు. వీటి ధరలు తక్కువగా ఉంచేందుకు గతేడాది రూ.60 వేల కోట్లు సబ్సిడీ అందించామని మంత్రి తెలిపారు. వయోవృద్ధులకు రైలు టికెట్ రాయితీ పునరుద్ధరించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా అని కాంగ్రెస్ ఎంపీ ఎంకే విష్ణు ప్రసాద్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి సమాధానమిచ్చారు. పొరుగు దేశాలతో పోలిస్తే మనదగ్గర రైలు టికెట్ ధరలు అందుబాటులో ఉన్నాయని, అభివృద్ధి చెందిన దేశాల ధరల్లో ఇవి ఐదు నుంచి పది శాతం మాత్రమేనని మంత్రి వైష్ణవ్ చెప్పారు. గతేడాది దాదాపు రూ.60 వేల కోట్లు రాయితీల కోసం అందించామని, తద్వారా ప్రయాణికుల టికెట్ ధరలు అందుబాటులో ఉన్నాయన్నారు.

నోయిడాలో యాపిల్ స్టోర్ ప్రారంభం నేడు

న్యూఢిల్లీ: దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ ... ఐ-ఫోన్లు, ఇతర ఉత్పత్తులకు భారత్ అనుకూలమైన మార్కెట్ కావడంతో భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, బెంగళూరు, పూణెలో రిటైల్ స్టోర్‌లను తెరిచింది. గురువారం నోయిడాలో మరోకొత్త స్టోర్‌ను తెరవబోతోంది. ఈ స్టోర్‌లో 80 మంది సభ్యుల బృందం ఉంటుంది. ఇక్కడ వినియోగదారులకు ఐఫోన్ 17 సిరీస్‌తో సహా కొత్త ఉత్పత్తి శ్రేణి అందుబాటులో ఉంటుంది. ఐఫోన్, మాక్, యాపిల్ వాచ్, ఐప్యాడ్ వంటి యాపిల్ ఉత్పత్తులను కొనుగోలుకు అవకాశం ఉంటుంది. కాగా, బొంబాయి, ఢిల్లీ స్టోర్ల ద్వారా తొలి ఏడాదే సంస్థకు దాదాపు రూ. 800 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం నాలుగు యాపిల్ రిటైల్ స్టోర్లు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి.

పినాకా ఎంకే-4 సిద్ధమవుతోంది

డీఆర్‌డీఓ ఛైర్మన్ కామత్



న్యూఢిల్లీ: భారతదేశ సైనిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన పేరు ఆపరేషన్ సింధూర్. మే 7వ తేదీ రాత్రి భారత సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై 24 కచ్చితమైన దాడులు చేసింది. ఈ దాడులలో స్వదేశీ పినాకా మల్టీ-బ్యారెల్ రాకెట్ లాంచర్ (ఎంబీఆర్‌ఎల్) నిమిషాల్లో 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉగ్రవాద సరఫరా లైన్లు, బంకర్‌లు, స్టేజింగ్ ప్రాంతాలను ధ్వంసం చేసింది. ఈ దాడి గురించి డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ మాట్లాడుతూ 300 కిమీ పరిధి గల కొత్త పినాకా-ఎంకే 4 క్షిపణిని 2030 నాటికి సైన్యంలోకి చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అప్పుడు పొరపాటున ఆపరేషన్ సిందూర్ నాటి పరిస్థితులు ఉంటే ఇస్లామాబాద్ వణకాల్సిందే- కరాచీ దద్దరిల్లాల్సిందే అని సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఎందుకంటే ఈ క్షిపణి గతంలో కంటే మరింత బలంగా, ఆధునిక సాంకేతికతతో తయారవుతుందని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయక ప్రజలు మరణించారు. దీంతో భారతదేశం మే 7-8 తేదీల మధ్య రాత్రి పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. దాడి జరిగిన ప్రదేశాలు ఐదు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో, నాలుగు పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్నాయి. ఎంకే-3 వేరియంట్ (120 కి.మీ పరిధి) బ్రహ్మోస్ క్షిపణి, రాఫెల్ జెట్‌లు స్మెర్చ్‌తో కలిపి 24 దాడులు చేసింది. ఒక బ్యాటరీ (6 లాంచర్లు) 44 సెకన్లలో 72 రాకెట్లను ప్రయోగించింది. ఇవి 1,000 × 800 మీటర్ల విస్తీర్ణాన్ని నాశనం చేయగలవు.

పినాకా దాడిలో మురిడ్కే, సియాల్‌కోట్, జకోబాబాద్ శిబిరాలు ధ్వంసమయ్యాయి. ఐసీ-814 హైజాకింగ్, పుల్వామా పేలుళ్లకు కారణమైన వారితో సహా 100 మందికి పైగా ఉగ్రవాదులు ఈ దాడిలో మరణించారు. ఈ దాడులకు పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో (శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్‌పై) ప్రతీకార దాడులు చేసింది. కానీ భారతదేశం ఎస్-400, ఇంటిగ్రేటెడ్ కౌంటర్-డ్రోన్ గ్రిడ్, పినాకా క్షిపణులతో వాటిని విజయవంతంగా అడ్డుకున్నాయి. పాక్ దాడిలో భారత్‌లో పెద్దగా ప్రాణనష్టం జరగలేదు. ఈ దాడి తర్వాత పాకిస్థాన్‌తో సింధు జల ఒప్పందాన్ని భారతదేశం రద్దు చేసింది. పినాకను 1986లో రష్యన్ గ్రాడ్-స్మెర్చ్ స్థానంలో డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది. దీనిని మొదట కార్గిల్ యుద్ధంలో (1999) ఉపయోగించారు. ఆ సమయంలో ఈ ఆయుధం పాకిస్థాన్‌కు సింహస్వప్నంగా మారింది. ఆ యుద్ధ సమయంలో ఈ ఆయుధం పాక్ బంకర్లను పేల్చివేసింది. ప్రస్తుతం ఇవి సైన్యం వద్ద నాలుగు రెజిమెంట్లు (72ం లాంఛర్లు) ఉన్నాయి. 2030 నాటికి ఇవి 22 రెజిమెంట్లుకు పెరగనున్నాయి.

రాహుల్ పర్యటనపై రాజకీయ రగడ

'లీడర్ ఆఫ్ పార్టీయింగ్' అంటూ బీజేపీ విమర్శ

తిప్పికొట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఓవైపు జరుగుతుండగా కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనకు వెళ్లనుండటం రాజకీయ రగడకు దారితీసింది. రాహుల్ విదేశీ పర్యటన షెడ్యూల్‌పై బీజేపీ విమర్శలు గుప్పించింది. రాహుల్‌ను 'లీడర్ ఆఫ్ పర్యటన్' అంటూ అభివర్ణించింది. విధులను నిర్లక్ష్యం చేసి తరచూ విదేశీ పర్యటనలకు వెళుతుంటారని ఆరోపించింది. దీనికి కాంగ్రెస్ దీటుగా సమాధానమిచ్చింది. ప్రధానమంత్రి విదేశీ పర్యటనల మాటేమిటంటూ నిలదీసింది. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుంచి 20 వరకూ బెర్లిన్‌లో పర్యటించనున్నారు. మరోవైపు ప్రస్తుత పార్లమెంటు సమావేశాలు డిసెంబర్ 19తో ముగియనున్నాయి. రాహుల్ విదేశీ పర్యటనపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ ఎల్‌ఓపీ అంటే 'లీడర్ ఆఫ్ పర్యటన్', 'లీడర్ ఆఫ్ పార్టీయింగ్' అని రాహుల్ గాంధీ మరోసారి రుజువు చేశారని అన్నారు. రాహుల్ సీరియస్ పొలిటీషియన్ కాదన్నారు. ఇటీవల బీహార్ ఎన్నికల్లో ఆయన జంగిల్ సఫారీని సందర్శించారని, ఆయన ప్రాధాన్యతలేమిటో దీనినిబట్టే చెప్పవచ్చని అన్నారు. జర్మనీకి ఎందుకు వెళుతున్నారో తనకు తెలియదని, భారత్‌పై విషం చిమ్మేందుకు కావచ్చని వ్యాఖ్యానించారు. అది భారత్ బద్నామీ బ్రిగేడ్ అని, భారత్ బద్నామీ టూర్ అని విమర్శించారు. వెకేషన్ కోసం, భారత్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు మరోసారి ఆయన విదేశాలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు రాహుల్ విదేశాల్లో గడుపుతుంటారని, ఆ తర్వాత తనకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదని చెబుతుంటారని అన్నారు. ఆయనను పార్ట్ టైమ్ రాజకీయ వేత్తగా అభివర్ణించారు.

మోదీ పర్యటనల సంగతేంటి: ప్రియాంక

రాహుల్ గాంధీ పర్యటనపై బీజేపీ చేస్తున్న విమర్శలను ఆయన సోదరి, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా తిప్పికొట్టారు. ప్రధానమంత్రి సగం పనిరోజులు విదేశాల్లోనే గడుపుతుంటారని గుర్తుచేశారు. అలాంటప్పుడు రాహుల్ గాంధీ పర్యటనలనే ఎందుకు ప్రశ్నిస్తున్నారని నిలదీశారు. లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్ సైతం బీజేపీ విమర్శలను తోసిపుచ్చారు. ఎన్నికల అవకతవకలపై రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు బీజేపీ వద్ద కానీ, ప్రధాని వద్ద కానీ జవాబులు లేవన్నారు. అందుకే రాహుల్‌పై బురద చల్లుతున్నారని విమర్శించారు.

విమానాల రద్దుతో రూ.వెయ్యి కోట్ల నష్టం

- దేశ రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం
- సీటీఐ అంచనా

న్యూఢిల్లీ: ఇండిగో విమానయాన సంస్థలో వరుసగా పదో రోజు కూడా వందలాది విమానాలు రద్దు కావడం, ఆలస్యం కావడం వల్ల ఢిల్లీ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. దీని వల్ల ఢిల్లీకి దాదాపు రూ. 1,000 కోట్ల నష్టం వాటిల్లినట్లు ది ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) అంచనా వేసింది. ఈ సంక్షోభం కారణంగా ఢిల్లీలోని వ్యాపార, పర్యాటక, పారిశ్రామిక రంగాలు భారీగా నష్టపోయాయని పేర్కొంది. విమానాల రాకపోకల్లో అంతరాయాల వల్ల వ్యాపారులు, పర్యాటకులు, బిజినెస్ ట్రావెలర్ల రాకపోకలు భారీగా తగ్గిపోవడంతో నగరం అంతటా మార్కెట్ కార్యకలాపాలు పెద్ద ఎత్తున తగ్గినట్లు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ పేర్కొన్నారు. సీటీఐ నివేదిక ప్రకారం గత 10 రోజుల్లో ఢిల్లీ మార్కెట్లలో జనసంచారం దాదాపు 25 శాతం తగ్గింది. సాధారణంగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ 1.5 లక్షలకుపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా... అందులో సుమారు 50 వేల మంది వ్యాపారులు, బిజినెస్ ట్రావెలర్‌లు ఉంటారు. అయితే ఇండిగో విమానాల రద్దు కారణంగా ఈ వ్యాపారుల రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. దీని ఫలితంగా టోకు మార్కెట్లు, రిటైల్ హబ్‌లు భారీ నష్టాలను చవిచూశాయి.

ఇక విమానాల రద్దు ప్రభావం పర్యాటక రంగంపై తీవ్రంగా ఉంది. గత వారం రోజుల్లోనే హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్ట్‌లలో బుకింగ్‌లు వేలాదిగా రద్దు అయినట్లు సీటీఐ తెలిపింది. ముఖ్యంగా ఢిల్లీలో ఎగ్జిబిషన్, ఈవెంట్స్ ఎకోసిస్టమ్‌పై ఈ సంక్షోభం తీవ్ర ప్రభావం చూపింది. గత 10 రోజులుగా ప్రగతి మైదాన్, ఆనంద్ మండపంలో ఆటోమొబైల్స్, చేనేత, వస్త్రాలు, గృహోపకరణాలు వంటి పెద్ద ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఈ సంక్షోభం క్రిస్మస్, న్యూ ఇయర్ సీజన్‌ను దెబ్బతీసింది. డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు హాజరు కావాల్సిన వ్యక్తులు విమానాలు రద్దు కావడంతో వేదికలకు చేరుకోలేకపోవడంతో హోటళ్లు, క్యాటరర్‌లకు నష్టం వచ్చింది. ఈ సంక్షోభం ఇండిగోకు మాత్రమే పరిమితం కాకుండా ఢిల్లీ వాణిజ్య కేంద్రంగా ఉన్న మొత్తం దేశీయ ఆర్థిక వ్యవస్థపై పరోక్ష ప్రభావం చూపిందని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థిపై నకిలీ డ్రగ్స్ కేసు... ఆరుగురు పోలీసుల సస్పెన్షన్

భోపాల్: విద్యార్థిని కిడ్నాప్ చేసి... నకిలీ డ్రగ్స్ కేసులో పోలీసులు ఇరిగించిన ఘటన బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో జరిగింది. వివరాలివి. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థిని పోలీసులు కిడ్నాప్ చేశారు. డ్రగ్స్‌తో పట్టుకున్నట్లు ఆరోపించారు. తప్పుడు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అయితే సీసీటీవీ ఫుటేజ్‌లు, ఇతర ఆధారాలు పోలీసుల నకిలీ కేసు బాగోతాన్ని బయటపెట్టాయి. మాండ్‌సార్ జిల్లాలోని మల్హార్‌గఢ్‌కు చెందిన సోహన్ (18) 12వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న బస్సులో అతడు ప్రయాణించాడు. మల్హార్‌గఢ్ పోలీసులు తమ వాహనంలో వెంబడించి ఆ బస్సును అడ్డుకున్నారు. అందులో ప్రయాణిస్తున్న సోహన్‌ను అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మాదకద్రవ్యాల వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మీడియా ముందు పోజులిచ్చారు. 2.7 కిలోల నల్లమందుతో పట్టుకున్నట్టు పోలీస్ అధికారి మీడియా సమావేశంలో చెప్పారు. అతడిని కోర్టులో హాజరుపరిచిన తర్వాత జైలుకు తరలించారు. మరోవైపు ఈ నెల ఐదో తేదీన సోహన్ తల్లిదండ్రులు మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇండోర్ బెంచ్‌ను ఆశ్రయించారు. తమ కుమారుడిని పోలీసులు కిడ్నాప్ చేశారని, అక్రమంగా అరెస్ట్ చేసి తప్పుడు కేసు నమోదు చేసి సాక్ష్యాలు సృష్టించారని ఆరోపించారు. సోహన్‌ను పోలీసులు బస్సులో అదుపులోకి తీసుకున్న సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు ఇతర ఆధారాలు, సాక్షులను కోర్టు ముందు ఉంచారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు ఇండోర్ బెంచ్ ధర్మాసనం ఈ ఆధారాలు చూసి విస్తుపోయింది. మాండ్‌సార్ ఎస్పీ వినోద్ కుమార్ మీనాను వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో ఈ నెల తొమ్మిదో తేదీన కోర్టు విచారణకు ఆ ఎస్పీ హాజరయ్యారు. అమాయక విద్యార్థిపై తమ పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసినట్లు అంగీకరించారు. బాధ్యులైన ఆరుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్లు కోర్టుకు తెలిపారు. శాఖాపరమైన దర్యాప్తునకు ఆదేశించినట్లు వివరించారు.

దీపావళికి యునెస్కో గుర్తింపు హర్షణీయం

ప్రధాని, ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ: దీపావళిని యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ పండగకు ఆ హోదా దక్కడంపై భారత దేశ ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారన్నారు. ఈ పండగ... ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిందని ఆయన తెలిపారు. దీపావళికి ఈ హోదా దక్కడంపై బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా మోదీ స్పందించారు. ఈ పండగ... మన సంస్కృతి, నైతికతలకు దగ్గరి సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. ఇది మన నాగరికతకు ఆత్మ వంటిదిగా ఆయన అభివర్ణించారు. ఈ పండగ ధర్మాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. యునెస్కో జాబితాలో చేరడం వల్ల ఈ పండగ మరింత ప్రజాదరణ పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఇష్టంగా జరుపుకునే దీపావళి పండగను యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చడంపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సైతం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ పండగను యునెస్కో జాబితాలో చేర్చడంపై సంతోషం వ్యక్తం చేశారు. దీపావళి పండగ ప్రపంచ గుర్తింపు పొందిందని తెలిపారు. ఇది ప్రతీ భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. దీపావళి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, ఇది దేశాన్ని ఏకం చేసే ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించే నాగరికతగా ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. భారతదేశ బహుళ సాంస్కృతిక, సామాజిక ఐక్యతను సూచిస్తుందని తెలిపారు. అదే సమయంలో ఆశ, సామరస్యం, చీకటిపై కాంతి విజయంగా దీపావళిని ఆయన పేర్కొన్నారు. వెలుగులు విరజిమ్మే పండగ దీపావళి యునెస్కో వారసత్వ జాబితాలో స్థానం సంపాదించుకోవడంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఇది సంతోషకరమైన సమయమని ఆయన పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ పండగ ఒక ప్రతీక అని తెలిపారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో బుధవారం జరిగిన కీలక సమావేశంలో యునెస్కో ప్రతినిధులు... దీపావళిని వారసత్వ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. భారత్‌కు చెందిన 15 అంశాలు ఇప్పటికే వారసత్వ గుర్తింపు ఇచ్చిన విషయం విదితమే. ఈ జాబితాలో కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠనం, రామలీల చోటుదక్కించుకున్నాయి.

ఆ జర్నలిస్టులను విడుదల చేయండి

ప్రధాని మోదీకి సీపీజే లేఖ

న్యూఢిల్లీ: జైలులో ఉన్న జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జర్నలిస్టుల రక్షణ కమిటీ (సీపీజే) ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాసింది. డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జర్నలిస్టుల అంశంపై దృష్టిసారించాలని ఆ లేఖలో కోరింది. 'జర్నలిస్టులపై నిరంతర నిర్బంధం, వేధింపులు ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం, మూడవ ప్రపంచ దేశాలకు గొంతుకగా ఉన్న భారతదేశ ఖ్యాతిని దెబ్బతీసే ప్రమాదం ఉంది' అని సీపీజే ఆ లేఖలో పేర్కొంది. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని, భారత్‌లో ఖైదు చేయబడిన జర్నలిస్టులను వారి కుటుంబాలతో తిరిగి కలుసుకునేలా, ప్రతీకార చర్యలకు భయపడకుండా వారి పని స్వేచ్ఛగా కొనసాగించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని తెలిపింది. భారతదేశం భద్రత, ఉగ్రవాద వ్యతిరేక, రాష్ట్రస్థాయి క్రిమినల్ ఆరోపణలతో జార్ఖండ్‌కి చెందిన రూపేష్ కుమార్ సింగ్ అనే స్వతంత్ర జర్నలిస్టును బంధించింది. ఆయన పట్నాలోని ఆదర్శ్ సెంట్రల్ జైలులో మూడేళ్లకు పైగా శిక్ష అనుభవిస్తున్నారు. ఆయనకు అధిక కొలెస్ట్రాల్, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ వైద్యం అందించడం లేదని, తగిన ఆహారం ఇవ్వలేదని, బయటకు రాకుండా ఎక్కువ గంటలు సెల్‌లోనే నిర్బంధించారని కుటుంబసభ్యులు తెలిపినట్లు సీపీజే వివరించింది. మరో జర్నలిస్టు ఇర్ఫాన్ మెరాజ్‌ది అదే పరిస్థితి అని తెలిపింది. 2021-23 మధ్య భారతదేశంలో జైలు శిక్ష అనుభవిస్తున్న జర్నలిస్టుల సంఖ్య గరిష్టస్థాయి ఏడు నుండి తగ్గినప్పటికీ... 2014 నుండి సుమారు 15 మంది జర్నలిస్టులపై ఉపా చట్టం కింద దర్యాప్తు జరిగిందని తెలిపింది. భారతదేశం అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడికపై సంతకం చేసిందని, తన అంతర్జాతీయ, దేశీయ మానవ హక్కుల బాధ్యతలను నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేసింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(ఎ) కింద వాక్‌స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడంలో స్వతంత్ర పత్రికా యంత్రాంగం పోషించే కీలక పాత్రను గతంలో వచ్చిన ప్రభుత్వాలు గుర్తించాయని వెల్లడించింది. 'ప్రధానిగారూ... ప్రజాస్వామ్యం మన డీఎన్‌ఏలోనే ఉందని, మొత్తం దేశం ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలపై నడుస్తుందని మీరు చెప్పారు. జర్నలిస్టులు ధైర్యంగా వాస్తవాలు నివేదించే హక్కుతో సహా ఈ విలువలను నిలబెట్టాలని మీ ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని సీపీజే స్పష్టం చేసింది. ఈ ఏడాది 100కి పైగా దేశాల నుండి 1,500 మందికి పైగా జర్నలిస్టులు సీపీజేకి సంఘీభావం ప్రకటించారు. ప్రపంచంలోని పలు ప్రభుత్వాలు, ముఖ్యంగా భారతదేశం జర్నలిస్టులపై క్రూరమైన చట్టాలు వినియోగించడాన్ని ఆపాలని, పత్రికలపై దాడులను అడ్డుకోవాలని, నిందితులకు శిక్ష విధించకుండా స్వేచ్ఛగా వదిలివేయడాన్ని అంతం చేయాలని కోరింది.

ఈవీఎం వద్దు...బ్యాలెట్ ముద్దు

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని, అప్పుడే గెలిచిన వారికైనా... ఓడిన వారికైనా వ్యవస్థపై నమ్మకం ఉంటుందని వైసీపీ లోక్‌సభ పక్ష నేత పీవీ మిథున్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చ లో ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఈవీఎం లపై నెలకొన్న అనుమానాలను, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో జరిగిన వింత పోకడలను సవివరంగా చెప్పారు. ప్రపంచంలోని అత్యాధునిక సాంకేతికత కలిగిన దేశాలే ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ పేపర్‌వైపు వెళుతుంటే... మనం ఇంకా ఈవీఎంలను పట్టుకుని వేళాడటంలో అర్థం లేదని మిథున్‌రెడ్డి చెప్పారు. ఏపీ ఎన్నికల్లో పోలింగ్ సరళిపై మిథున్‌రెడ్డి సందేహాలు వ్యక్తం చేస్తూ... 'ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 3 కోట్ల 38 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరిగింది. కానీ ఆశ్చర్యకరంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఏకంగా 15 శాతం ఓట్లు... అంటే సుమారు 51 లక్షల ఓట్లు నమోదయ్యాయి. రాష్ట్ర చరిత్రలో 2014లోగానీ, 2019లోగానీ ఇలా జరగలేదు. ఈ ఆకస్మిక పెరుగుదల ఎలా సాధ్యమైందో అర్థం కావడం లేదు. ఒడిశాలోనూ ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి' అని మిథున్‌రెడ్డి చెప్పారు. 'విజయనగరంలో లెక్కింపు రోజున ఈవీఎం బ్యాటరీ చార్జింగ్ 99 శాతంగా ఉంది. కానీ పోలింగ్ రోజున అది 60 శాతమే ఉంది. వాడకం తర్వాత బ్యాటరీ చార్జింగ్ తగ్గాలి. కానీ, ఎలా పెరుగుతుందని మా మాజీ ఎంపీ ఫిర్యాదు చేశారు. దీనిపై ఈసీ నుంచి స్పందన లేదు. స్ట్రాంగ్‌రూమ్ సీసీటీవీ ఫుటేజీ అడిగితే ఇవ్వలేదు. కనీసం వీవీపాట్ స్లిప్పులు లెక్కించమని అడిగితే... వాటిని తగులబెట్టేశాం, ధ్వంసం చేశామని సమాధానం ఇచ్చారు. అనుమానం ఉన్న ఈవీఎంలను కాకుండా వేరేవాటిపై మాక్ పోలింగ్ నిర్వహించారు' అని మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హిందూపురం నియోజకవర్గంలోని ఒక పోలింగ్ బూత్‌లో మరీ విడ్డూరం జరిగింది. ఒకేరోజు, ఒకే సమయాన జరిగిన ఎన్నికల్లో... ఒక బూత్‌లో మా ఎంపీ అభ్యర్థికి 472 ఓట్లు వచ్చాయి. అదే బూత్‌లో మా ఎమ్మెల్యే అభ్యర్థికి కేవలం ఒక్క ఓటు మాత్రమే వచ్చింది. అక్కడ మాకు ఐదుగురు ఏజెంట్లున్నారు. వాళ్ల కుటుంబసభ్యుల ఓట్లే 30 వరకు ఉంటాయి. 30 ఏళ్లుగా మేము గెలుస్తున్న బూత్ అది. ఎంపీ అభ్యర్థికి 472 ఓట్లు పడినచోట, ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక్క ఓటు పడటం ఈవీఎంల పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది' అని చెప్పారు. టెక్నాలజీలో ఎంతో ముందున్న ఎలాన్ మస్క్ వంటి వారే ఈవీఎం లను హ్యాక్ చేయవచ్చని చెబుతున్నారని, అమెరికాలో 92 శాతం ఎన్నికలు బ్యాలెట్ పేపర్ మీదే జరుగుతున్నాయని మిథున్‌రెడ్డి చెప్పారు. నెదర్లాండ్స్, జర్మనీ, ఐర్లాండ్, ఫిన్లాండ్, బంగ్లాదేశ్ వంటి దేశాలన్నీ ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ పేపర్‌కు మళ్లాయని తెలిపారు. 'నేను మూడుసార్లు ఎంపీగా గెలిచింది ఈవీఎంల మీదనే అయినా... ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి తీసుకురావాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

సీఈసీ, ఈసీ ఎంపికపై వాగ్వాదం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్నారా లేదా అనే దానిపై అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు బుధవారం లోక్‌సభలో చర్చించారు.

'ఎన్నికల సంస్కరణలు'పై చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్... సీఈసీ, ఈసీలను నియమించే ఎన్నికల కమిటీ నుంచి సీజేఐను మినహాయించడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఈసీ, ఈసీల నియామకంపై చట్టం రూపొందించే వరకు, ఎంపిక కమిటీలో ప్రధాన మంత్రి, సీజేఐ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉండాలని విశ్రాంత న్యాయమూర్తి కేఎం జోసెఫ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించింది. కానీ ప్రభుత్వం ఈ అంశంపై బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఒక ఎంపిక కమిటీని, ప్రధాన మంత్రి నియమించిన కేంద్ర క్యాబినెట్ మంత్రిని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిని సభ్యులుగా ప్రతిపాదించింది. అయితే సీజేఐని మినహాయించడాన్ని వేణుగోపాల్ ప్రశ్నించి, న్యాయ మంత్రి నుంచి సమాధానం కోరారు. వేణుగోపాల్ తర్వాత వెంటనే మాట్లాడిన బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర న్యాయ శాఖ మాజీమంత్రి రవిశంకర్ ప్రసాద్... ప్రధానమంత్రి నేతృత్వంలోని ఎన్నికయిన ప్రభుత్వాన్ని ఓ బటన్‌తో విశ్వసించగలిగినప్పుడు... మంచి సీఈసీ లేదా ఈసీని ఎన్నుకునేటప్పుడు అది ఎందుకు ఉండకూడదన్నారు. చట్ట సభ జ్ఞానం ప్రకారం సీజేఐని మినహాయించి ఎంపిక కమిటీతో ఒక చట్టాన్ని ఆమోదించినప్పుడు న్యాయ వ్యవస్థను ప్రతిదానిలో ఎందుకు చేర్చాలని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎంపిక కమిటీ తాత్కాలిక ఏర్పాటు మాత్రమే అని వేణుగోపాల్ కూడా అంగీకరించారని ప్రసాద్ పేర్కొన్నారు.

ప్రశ్న ఉపసంహరణపై ఆగ్రహం

రాజ్యసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: దేశంలో ఫోరెన్సిక్ సామర్థ్యాలు పెంపొందించడంపై హోం మంత్రి అమిత్ షాను బీజేపీ ఎంపీ ప్రశ్న అడిగారు. అయితే దీనిపై వివరణ లేకుండానే ప్రశ్నను ఉపసంహరించుకున్నారు. దీనిపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు బుధవారం రాజ్యసభలో వాకౌట్ చేశాయి. బీజేపీ ఎంపీ ఆదియా ప్రసాద్... హోం మంత్రిని అడిగిన ఒక ప్రశ్నను స్టార్డ్ ప్రశ్నగా అంగీకరించారు. దీని ప్రకారం, మంత్రులు మౌఖికంగా సమాధానం ఇవ్వాలి. తక్షణ తదుపరి (అనుబంధ) ప్రశ్నలకు అనుమతిస్తుంది. రాజ్యసభ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ప్రశ్నల జాబితా ప్రకారం బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రసాద్ ప్రశ్న రెండవ స్థానంలో ఉంది. ఆ ప్రశ్నను 'ఉపసంహరించుకున్నట్లు' పరిగణించవచ్చని ఒక సవరణ నోట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రశ్నను దాటవేసి సభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ తదుపరి ప్రశ్నకు వెళ్లినప్పుడు... కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్, ఇతరులు ఆ ప్రశ్నను ఎందుకు ఉపసంహరించుకున్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. 'మీకు నియమాలు తెలుసు. నిబంధన 53 ప్రకారం సభ్యుడు తనకు నచ్చిన విధంగా ఏదైనా ప్రశ్నను ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తుంది' అని ఛైర్మన్ అన్నారు. 'కోరుకుంటే మీరు కూడా ఉపసంహరించుకోవచ్చు. సభ్యుల హక్కులలో నేను జోక్యం చేసుకోలేను' అని తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు ఒత్తిడి చేయడంతో రాధాకృష్ణన్ ఇతర సభ్యులకు 'దానిని లేవనెత్తే హక్కు లేదు' అని అన్నారు. సంబంధిత సభ్యుడిని ప్రశ్న అడగమని వారు చేసిన విజ్ఞప్తిని కూడా రాధా కృష్ణన్ తిరస్కరించారు. 'నేను ఎందుకు చెప్పాలి? నాకు చెప్పే హక్కు లేదు. అది ఆయన ఇష్టం. మీరు కూడా రేపు కొన్ని ప్రశ్నలు ఉపసంహరించుకోవచ్చు, అందులో నేను జోక్యం చేసుకోను' అని ఆయన అన్నారు. ఈ అంశంపై ప్రతిపక్ష ఎంపీలు చెప్పేది ఏదీ రికార్డులో ఉండకూడదని ఆదేశించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని భంగపర చవద్దని ప్రతిపక్ష సభ్యులను కోరుతూ జాబితా చేయబడిన ప్రశ్నలతో ముందుకు సాగారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్

విశాలాంధ్ర, హైదరాబాద్ : 2025-26 ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్ మంగళవారం హైదరాబాద్ యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌స్టేడియంలో అధికారికంగా ప్రతిష్టాత్మక ప్రారంభ సమావేశం అనేక మంది ప్రముఖుల సమక్షంలో అత్యంత సుందరంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పొన్నంబలం మురుగన్, చీఫ్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్, జనరల్ మేనేజర్లు రవి కుమార్‌వర్మ, సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియదర్శి పంకజ్, కె.చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ, హెచ్.శంకర్, అధ్యక్షుడు, హైదరాబాద్ సర్కిల్ పాల్గొన్నారు. ఉద్యోగులలో జట్టు స్ఫూర్తి, శారీరక దృఢత్వం, స్నేహాన్ని పెంపొందించడంలో క్రీడా కార్యకలాపాలు కీలక పాత్ర పోషిస్తాయని వక్తలు నొక్కి చెప్పారు. సీజీఎం హెచ్‌ఆర్ పొన్నంబలం మురుగన్ మాట్లాడుతూ స్ఫూర్తిదాయకంగా పాల్గొనే అన్ని జట్లకు గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, టోర్నమెంట్ అంతటా నిజమైన క్రీడా స్ఫూర్తిని నిలబెట్టాలని వారిని ప్రోత్సహిస్తూ పొన్నంబలం మురుగన్‌ను అన్ని జట్టు కెప్టెన్లకు పరిచయం చేశారు. ఈ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ హైదరాబాద్ సర్కిల్, కోల్‌కతా సర్కిల్ మధ్య జరిగింది. పోటీలో ఉత్కంఠభరితంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ సర్కిల్ కోల్‌కతా సర్కిల్‌పై విజయం సాధించింది.

వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఉన్న వ్యాపార సంస్థలు 2026 సంవత్సరానికి సంబంధించిన ట్రేడ్ లైసెన్సులను డిసెంబర్ 20 లోపు రెన్యువల్ చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కోరింది. బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిర్ణయించిన గడువులోపు రెన్యువల్ చేస్తే ఎటువంటి పెనాల్టీ ఉండదని స్పష్టం చేసింది. జిహెచ్‌ఎంసి ఆమోదించిన రీన్యువల్ పెనాల్టీ వివరాలు వున్నాయి. డిసెంబర్ 20 లోపు - పెనాల్టీ ఉండదు, డిసెంబర్ 21 నుంచి 2026 ఫిబ్రవరి 19 వరకు-25% పెనాల్టీ ఉంటుంది. 2026 -2026 ఫిబ్రవరి 20 తరువాత-50% పెనాల్టీ ఉంటుంది. పెనాల్టీ లేకుండా రెన్యువల్‌కు చివరి తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో, చివరి నిమిషం రద్దీ, పెనాల్టీలు తప్పించుకో వాలంటే వ్యాపారులు ముందుగానే రీన్యువల్ పూర్తి చేసుకోవాలని జిహెచ్‌ఎంసి సూచించింది.

పాత పద్ధతిలోనే ఎస్‌ఎస్‌సి పరీక్షలు నిర్వహించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర, హైదరాబాద్ : పాఠశాల విద్యాశాఖలో విడుదలైన ఎస్‌ఎస్‌సి పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ మార్చ్, ఏప్రిల్ 2026 ప్రకారం 14 మార్చి 2026 నుంచి 2026 ఏప్రిల్ 4 వరకు మొత్తం 33 రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ వెలువడిందని, ఈ విధానం అమలు చేయడం ప్రయోగాత్మకంగా ఉండటంతో పాటు విద్యావ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుందని స్టేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్షులు జి.సదానందం గౌడ్ ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు. దీనిలో భాగంగా పాఠశాల విద్యా సంచాలకులు ఈ.నవీన్ నికోలస్ లేఖను అందజేశారు. మార్చి 14న రెండవ శనివారం అయినప్పటికీ ఆరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహిస్తున్నారని, విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో మానసిక ఆందోళన ఒత్తిడి ఉంటుందని, గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పరీక్షలకు భిన్నంగా ఈ సారి పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత మూల్యాంకన ప్రక్రియ ఫలితాల వెల్లడిపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందన్నారు. ఏప్రిల్ నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండడంతో విద్యార్థులు పరీక్షలు రాయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల శ్రేయస్సుదృష్ట్యా, ఎస్‌ఎస్‌సి పబ్లిక్ పరీక్షలను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పూర్వ పద్ధతిలోనే నిర్వహించేలా కొత్త టైం టేబుల్ రూపొందించాలని ఎస్‌టియుటిఎస్ సంఘం కోరుతున్నట్లు అధ్యక్షులు సదానందం గౌడ్ ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక కృషి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ ఉప్పలమ్మ గుడి వద్ద రూ.10 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ వై.ప్రేం కుమార్ కాలనీవాసులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రభాకర్, భాస్కర్, రాంచందర్, ధనరాజ్, రామ్మోహన్, బ్రహ్మ చారి, సుశీల, రోజా రమణి, ప్రమీల, కల్పన, శ్యామ్, కృష్ణ, విజయ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

ఓ.యస్. నెం. 29/2025

బిట్వీన్ :

పోతిని వెంకటాద్రి ...వాది

మరియు

గుమ్మడి పద్మశ్రీ ...ప్రతివాది

To:

గుమ్మడి పద్మశ్రీ,W/o.రాధాకృష్ణ, R/o. డోర్.నెం. 1-B, 134/B, 7-1-395/10, కె.కె. మాన్షన్, శ్రీ అమోఘ జూనియర్ కాలేజ్ దగ్గర, ఎస్.ఆర్ నగర్, VTC, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాను వాది ప్రతివాదిపై వాదిని దావా ఆస్తికి పరిపూర్ణ యజమానిగా పూర్తి హక్కులతో డిక్లేర్‌చేయుమని దాఖలుచేసి యున్నారు. అంతట శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల మేర ప్రతివాదికి దావా సమన్లు పంపిన తీసుకోనందున శ్రీయుత కోర్టువారు పేపర్ ప్రకటన ద్వారా ప్రతివాదికి దావా సమన్లు నిమిత్తం ఉత్తర్వులు జారీచేసిరి, కావున పై తెలిపిన శ్రీయుత కోర్టువారి ఎదుట తేది: **30-12-2025 ఉ॥గం॥10-30ని॥లకు** మీరు స్వయముగా గాని, వకీలు ద్వార గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేసుకోవసినది, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

పృథివి బాలసుబ్రహ్మణ్యం, బోడిపోగు సుహాసిని

వాది తరపు న్యాయవాదులు.

నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

ఐ.ఏ. నెం. 343/2025 ఇన్ ఓ.యస్. నెం. 29/2025

బిట్వీన్ :

పోతిని వెంకటాద్రి ...పిటీషనర్/వాది

మరియు

గుమ్మడి పద్మశ్రీ ...రెస్పాండెంటు/ప్రతివాది

To:

గుమ్మడి పద్మశ్రీ,W/o.రాధాకృష్ణ, R/o. డోర్.నెం. 1-B, 134/B, 7-1-395/10, కె.కె. మాన్షన్, శ్రీ అమోఘ జూనియర్ కాలేజ్ దగ్గర, ఎస్.ఆర్ నగర్, VTC, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు పిటీషన్‌లోని రెస్పాండెంటుకు శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల మేర నోటీసు పంపిన తీసుకోనందున శ్రీయుత కోర్టువారు పేపర్ ప్రకటన ద్వారా రెస్పాండెంటుకు నోటీసు నిమిత్తం ఉత్తర్వులు జారీచేసిరి. కావున పై తెలిపిన రెస్పాండెంటు వారు తేది: **30-12-2025 ఉ॥గం॥10-30ని॥లకు** స్వయముగా గాని, వకీలు ద్వార గానీ హాజరై వారికి గల ఆక్షేపణలు తెలియజేసుకోవసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

పృథివి బాలసుబ్రహ్మణ్యం, బోడిపోగు సుహాసిని

వాది తరపు న్యాయవాదులు.

ముసాయిదా విత్తన చట్టంపై దిశా నిర్దేశం

విశాలాంధ్ర, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విత్తన ముసాయిదా చట్టం -2025పై అభ్యంతరాలను డిసెంబర్ 11 లోపు రాష్ట్రాలు తెలపాలని కోరగా, అందుకనుగుణంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై తుది నివేదిక రూపకల్పనలో చేర్చాల్సిన / చట్టంలో మార్చాల్సిన అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు విత్తనోత్పత్తి కీలమని, సాంప్రదాయ మరియు స్వదేశీ రకాలు సహా అధిక-నాణ్యత గల విత్తనాల సాగు మరియు సంరక్షణలో వేలాది మంది రైతులు భాగస్వాములుగా ఉన్నారన్నారు. రాష్ట్ర ఆర్థికవృద్ధికి వారి సహకారం చాలా ముఖ్యమైనది అయినప్పటికీ, విత్తన రైతులు తరచుగా అధికారిక గుర్తింపు లేకపోవడం, లోపభూయిష్ట ఒప్పంద నిబంధనలు, సరైన పరిహారం అందకపోవడం వంటి ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. గత పదేళ్ళ కాలంలో విత్తనోత్పత్తి సమస్యలతో పాటు, ముఖ్యంగా పత్తి, మిరప, మొక్కజొన్న మరియు కూరగాయలు పండించే రైతులు నకిలీ, నాసిరకం, అనుమతి లేని, అధిక ధర కలిగిన విత్తనాల వ్యాప్తి కారణంగా నష్టాలను చవిచూశారు. నాణ్యతలేని హైబ్రిడ్, బిటి విత్తనాల లభ్యత, విత్తనాలు, ఇన్‌పుట్ ఖర్చులు బాగా పెరగడంతో, సాగుఖర్చు గణనీయంగా పెరిగడంతో పాటు వ్యవసాయ కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను మరింత తీవ్రతరం చేసింద న్నారు. విత్తనచట్టం, 1966, తదనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన 2004-2010 మరియు 2019 నాటి విత్తన బిల్లు ముసాయిదాలో అనేక నిబంధనలు ఉన్నప్పటికి, రైతుల ప్రయోజనాలను, హక్కులను పరిరక్షించడంలో ప్రభావవంతమైన చట్టాలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారుతున్న పరిస్థితులు మరియు వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని కఠిన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఇదే విషయమై వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుండి మరియు రైతు సంఘాల నుండి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము గత రెండు సంవత్సరాలుగా కేంద్రాన్ని చట్టాల మార్పుల కోసం విజప్తి చేసిన విషయం తెలిసిందే. ఈ దశలో గత నెలలో కేంద్ర ప్రభుత్వం విత్తన బిల్లు ముసాయిదా 2025ని తీసుకొచ్చి, దానిలో అభ్యంతరాలు తెలిపి మార్పులు, చేర్పులు చేసేందుకు రాష్ట్రాలకు అవకాశం కల్పించే విధంగా, వెబ్ సైట్ లో ఉంచడం జరిగింది' అని మంత్రిగారు అన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రస్థాయి, జిల్లాల స్థాయిలో రైతులతో, రైతు సంఘాల ప్రతినిధులతో, డీలర్లతో, విత్తనోత్పత్తి దారులతో, విత్తన కంపెనీ ప్రతినిధులతో, పూర్తి స్థాయి చర్చలు జరిపి, ఆ చర్చల ద్వారా వారు తెలిపిన అభిప్రాయాలను క్రోడీకరించి ఒక నివేదికను తయారుచేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ముసాయిదా చట్టం 2025లోని నిబంధనలకు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సవరణలు సెక్షన్ 13 లోని నిబంధన ఏదైనా వ్యవసాయ విత్తనాన్ని రైతులకు అమ్మకానికి విడుదల చేసే ముందు, కేంద్ర విత్తన కమిటీతో ముందస్తు నమోదు తప్పనిసరి.

సూచించిన సవరణ: రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి ప్రత్యేకమైన రకాలను నమోదు చేయడానికి అధికారం ఇవ్వాలి. ఎందుకంటే రాష్ట్రం తన రైతులకు విత్తన రకాల అనుకూలత మరియు అవసరాల గురించి బాగా తెలుసు.- సెక్షన్17(3)లోని నిబంధన: ఉత్పత్తిదారు లేదా ప్రాసెసింగ్ ప్లాంట్ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వంలో నమోదు చేసుకోకపోతే ఉత్పత్తి దారు, విత్తన ఉత్పత్తి సంస్థ లేదా విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్ విత్తనాన్ని విక్రయించకూడదు లేదా పంపిణీ చేయకూడదు.సూచించిన సవరణ: ప్రతి విత్తన ఉత్పత్తి సంస్థ నిర్వాహకుడు వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా కనీస విద్యార్హతను కలిగి ఉండాలి లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో కనీసం మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి ఉండాలి. **సెక్షన్18(1)లోని నిబంధన:** విత్తన డీలర్లు మరియు పంపిణీదారులు విత్తన అమ్మకాలను ప్రారంభించే ముందు రాష్ట్ర ప్రభుత్వంతో నమోదు చేసుకోవాలి. విత్తన డీలర్లు మరియు పంపిణీదారులు రిజిస్ట్రేషన్‌కు అర్హత సాధించడానికి వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుండి విత్తనోత్పత్తిలో సర్టిఫికేట్ కోర్సు యొక్క కనీస విద్యా అర్హతను కూడా కలిగి ఉండాలి.

సెక్షన్21(1డి)లో నిబంధన: ఏదైనా నమోదిత రకం విత్తనాన్ని అమ్మకానికి ఉంచినప్పుడు, అది కేంద్ర కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. సెక్షన్ 22లోని నిబంధన: అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం విత్తనాల ధరలను నియంత్రించవచ్చు. రైతుల ఫిర్యాదులు తలెత్తినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారం కల్పించాలి. రాష్ట్ర విత్తన కమిటీ విత్తన ధరలను సమీక్షించి, హేతుబద్ధమైన ధరల పరిమితిని సిఫార్సు చేయడానికి అనుమతించాలి. ఈ సవరణలతో పాటు రాష్ట్ర రైతాంగం, రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపినపుడు ముసాయిదా చట్టం 2025 లో చేర్చాల్సిన అంశాలను తెలియజేశారు. -నకిలీ లేదా నాణ్యత లేని విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు చట్టబద్ధమైన, కాలపరిమితితో కూడిన పరిహార విధానాన్ని ఏర్పాటు చేయడానికి బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్ని ప్రవేశపెట్టి, సాధారణ పరిస్థితుల్లో రైతు పొందగలిగే అత్యధిక దిగుబడి ఆధారంగా పరిహారం లెక్కించాలి. రైతు ఫిర్యాదు చేసిన 60 రోజుల్లోపు క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసి పరిష్కరించాలి.విత్తనోత్పత్తి చేసే రైతులను రక్షించడానికి ముసాయిదా విత్తన బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్ని చేర్చాలి. విత్తనాలను సరసమైన ధరలలో రైతులకు అందించడానికి విత్తన ధరల నియంత్రణ తప్పనిసరి చట్టబద్ధమైన నిబంధనగా ఉండాలి. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మరియు ఇతర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.



విత్తన చట్టం -2025 ముసాయిదాపై రైతు కమిషన్ నివేదిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన విత్తన చట్టం -2025 ముసాయిదాలో సవరణలు చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్ష, సమావేశాలు నిర్వహించామన్నారు. ఈనెల డిసెంబర్ 2న నిర్వహించిన సమావేశంలో వివిధ పార్టీల నేతలు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, రైతు సంఘాల నేతలు, వ్యవసాయ రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు. ఇక ఈనెల 6న విత్తన కంపెనీల ప్రతినిధులతో కమిషన్ మరోసారి సమావేశం నిర్వహించింది. అంతేకాదు వ్యవసాయ రంగ నిపుణుల నుండి స్వచ్ఛం దంగా వచ్చిన సూచనలను సైతం పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చట్టంలో చేయాల్సిన సవరణలపై ఓ నివేదికను రూపొందించినట్లు కోదండరెడ్డి తెలిపారు. విత్తన చట్టంలో సవరణలపై తయారుచేసిన నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. కేంద్రం తెస్తున్న విత్తన చట్టంలో చాలా లొసుగులున్నాయని రైతుల ప్రయోజనం కోసం చట్టం ఉండేలా చూడాలన్నారు. మల్టీనేషనల్ విత్తన కంపెనీలకోసం ప్రత్యేకంగా చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని వివరించారు.

ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి :కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాలులో జాతీయ రహదారుల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎఐ పిడి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి రోడ్డు విస్తరణపై ఉన్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన కోర్టు కేసులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ రోడ్డు విస్తరణకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి ప్రతి కేసు పూర్వపరాలు తెలుసుకొని, తీసుకోవలసిన చర్యలపై అధికారులకు అవసరమైన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్ రద్దు చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : వైద్య విధాన పరిషత్ రద్దు చేసి, ఆ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేసి, ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా సాలరీస్ (010) చెల్లించాలని ఏఐటియూసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.మూర్తి డిమాండ్ చేసారు. బుధవారం తేది. 10.12.25 న ఆయన మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో వైద్యశాల ఉద్యోగులు సామూహికంగా సంతకాలు సేకరించి, మెడికల్ సూపరింటెండెంట్ కు అందజేసిన సందర్భంగా మాట్లాడుతూ 1986 వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని , ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణింపక పోవడం, అధికారులకు గెజిటెడ్ హెూదా లేకపోవడం, వేతన సవరణ సంఘానికి వినతులు

సైతం సమర్పించక లేకపోవడం,ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడంతో ఈ రోజు వరకు జీతాలు పొందలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు పక్క రాష్ట్రం ఏ.పి.లో వైద్య విధాన పరిషత్ రద్దు చేసి, ఆ స్థానం లో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసస్ ఏర్పాటు చేసారని , మన రాష్ట్రంలో కూడా అలాగే చేయాలని పేర్కొన్నారు. యూనియన్ నిర్ణయించిన విధంగా ఈ రోజు ఉద్యోగుల ఆకాంక్ష ప్రభుత్వానికి మరియు అధికారులకు తెలియజేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్యశాలల్లో ఉద్యోగులు సామూహికంగా సంతకాలు సేకరించి అధికారులకు అందజేశామ న్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

'100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ పర్యాటక శాఖ రాష్ట్రంలోని తెలియని అందాలను వెలికితీయడానికి, ప్రయాణికులు, కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించే ప్రత్యేక సృజనాత్మక పోటీ “100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ” ను ప్రారంభించింది.ఈ పోటీ ద్వారా రాష్ట్రంలోని తక్కువగా తెలిసిన, అరుదైన కానీ తప్పక సందర్శించాల్సిన వీకెండ్ ట్రావెల్ గమ్యస్థానాలను ఫోటోలు, చిన్న వీడియోల రూపంలో పరిచయం చేయడానికి పాల్గొనేవారిని ఆహ్వానిస్తోంది. ప్రకృతి, వన్యప్రాణులు, కళా-సంస్కృతి, వారసత్వ ప్రదేశాలు, జలవనరులు, వంటకాల అనుభవాలు, గ్రామీణ-వ్యవసాయ పర్యటనలు, రిసార్టులు, ఆధ్యాత్మిక ప్రదేశాలు, అడ్వెంచర్ స్పాట్లు వంటి అనేక విభాగాల్లో పాల్గొనవచ్చు. ప్రతి ఎంట్రీ తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న, వీకెండ్ ట్రిప్‌కి అనువైన ఒక ప్రత్యేక ప్రదేశాన్ని ప్రతిబింబించాలి. పోటీ బహుమతులు : 1వ బహుమతి: రూ.50,000, 2వ బహుమతి: రూ30,000, 3వ బహుమతి: రూ.20,000 అదనంగా, 10 కాన్సలేషన్ ప్రైజ్ విజేతలకు ఎంపిక చేసిన హరిత హెూటల్స్‌లో ఉచిత వసతి అందజేయబడుతుంది. పాల్గొనేవారు తమ ఎంపిక చేసిన ప్రదేశానికి సంబంధించిన మూడు ఫోటోలు మరియు గరిష్ఠం 60 సెకన్ల వీడియో సమర్పించాలి. అలాగే ఆ ప్రదేశానికి సంబంధించిన: చేరుకునే రవాణా వివరాలు దూరం, గూగుల్ మ్యాప్స్ లింక్, సందర్శించడానికి అనుకూలమైన సీజన్, వసతి, బడ్జెట్, భద్రత వివరాలతో కూడిన 100 పదాల వివరణ తప్పనిసరిగా జత చేయాలి. ఎంట్రీల ప్రారంభం డిసెంబర్ 10 నుంచి చివరి తేదీ: 5 జనవరి 2026 విజేతల పేర్లు సంక్రాంతి కైట్ ఫెస్టివల్ సందర్భంగా ప్రకటించబడతాయి. పాల్గొనేవారు ప్రచార పోస్టర్‌లో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా Instagram / X (Twitter) లో తమ ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసి కూడా ఎంట్రీ ఇవ్వవచ్చు. ఇందుకోసం అధికారిక అకౌంట్లను ట్యాగ్ చేసి, హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించాలి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని వీకెండ్ పర్యటనలకు అనువైన ప్రదేశాల క్రౌడ్‌సోర్స్ మ్యాప్ రూపొందించడం, అలాగే రాష్ట్రంలో సస్టైనబుల్ , డీసెంట్రలైజ్డ్ టూరిజంను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం. తెలంగాణను దేశీయ ప్రయాణికుల కోసం ప్రాముఖ్యమైన వీకెండ్ డెస్టినేషన్‌గా నిలపడం ఈ కాంపెయిన్ లక్ష్యాల్లో ఒకటి. మరిన్ని వివరాలకు www.tourism.telangana.gov.in అధికారిక వెబ్‌సైట్ సందర్శించండి.

ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ గా డాక్టర్ వెంకటేష్ చౌహాన్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: గిరిజన, ఆదివాసి, ప్రజాస్వామిక ఉద్యమాల్లో దశాబ్ద కాలంగా కీలక భూమిక పోషిస్తున్న డాక్టర్ వెంకటేష్ చౌహాన్ కు ఏఐసీసీ నుంచి గుర్తింపు దక్కింది. ఆయనను ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ గా నియమిస్తూ ఏఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి 26 మందిని జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్‌గా నియమించగా తెలంగాణ నుంచి డాక్టర్ వెంకటేష్ చౌహాన్ నియమితులు కావడం గమనార్హం. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ కాంగ్రెస్ నాయకత్వం ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ల ఎంపిక చేపట్టింది.తెలంగాణ రాష్ట్రం నుంచి గిరిజన, సామాజిక ఉద్యమాల్లో నాయకత్వం వహిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్న చౌహాన్ ను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన సమస్యలపై జాతీయస్థాయిలో గళం విప్పేందుకు ఈ పదవి దోహద పడుతుందన్నారు.నాపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జార్ఖండ్ రాష్ట్ర ఇంచార్జ్ కొప్పుల రాజు, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు విక్రాంత్ భూరియ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ధనసరి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ బెల్లయ్యా నాయక్ ఎమ్మెల్యేలు జాటోతు రాంచందర్ నాయక్, బాలు నాయక్ లకు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామపంచాయతీ ఎన్నికలలో ఆశతో కాదు ఆశయం కోసం పనిచేసే భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ తెలిపారు. మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా సీపీఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించి పోరాడే నిస్వార్థ రాజకీయ నాయకులు కమ్యూనిస్టులని అట్లాంటి వారిని గెలిపించుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధి చెందుతాయని వారన్నారు అవినీతిని పారద్రోలిన వాళ్ల అవుతారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ప్రజల కోసం నిరంతరం పాటుపడే వ్యక్తులు కమ్యూనిస్టులు విషయాన్ని గమనించి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా కో - కన్వీనర్ మహేష్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌ను సందర్శించిన 3 వేల మంది విద్యార్థులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను బుధవారం పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు సందర్శించారు. ఈనెల 8 ,9లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో తమ ప్రొడక్టులను ప్రయివేటు సంస్థలు ప్రదర్శించాయి. నేడు ప్రధానంగా నగరంతోపాటు వివిధ జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. ప్రాధానంగా ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు, డ్రోన్స్, రోబో తదితర 27కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ స్టాళ్లను విద్యార్థులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో బుధవారం నుంచి 13 వరకు నిర్వహిస్తున్న ప్లీనరీ సెషన్లలో నేడు జరిగిన యూత్ ఎంటర్‌ప్రెన్యూషిప్ అనే అంశంపై జరిగిన రెండు సదస్సులలో దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు. వీరిలో గురుకుల పాఠశాలల నుండి 1000 మంది లార్ట్స్ కళాశాల నుండి 700 మంది, వివిధ డిగ్రీ కళాశాల నుండి 1200 మంది, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు 500 పాల్గొన్నారని నిర్వాహకులు వెల్లడించారు. నేడు ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వి -హబ్ సి.ఈ.ఓ విద్యార్థులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం సదస్సుకు ప్రముఖ సినీ నటుడు రానా దగ్గుబాటి విద్యార్థులతో ముచ్చటించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మనో జాగృతి సంస్థ కౌమార దశలో మానసిక పరిపక్వత అనే అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కోసం దాదాపు 56 బస్సులను ఏర్పాటు చేశారు. ప్లీనరీ సెషన్ లో భాగంగా మహిళా సంక్షేమం, సంస్కృతీ (విమెన్ రైజింగ్) అనే అంశంపై రెండు సదస్సులు జరుగుతాయని వెల్లడించారు.

ప్రజలు ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోండి

విశాలాంధ్ర -కొత్తూరు: నేడు జరిగే సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుకు బుధవారం కొత్తూరు సీఐ నరసయ్య ఆధ్వర్యంలో కొత్తూరు మున్సిపల్ కేంద్రంలో ని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ డీసీపీ యం రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోలింగ్ కేంద్రాలవద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని మొత్తం 12 పంచాయతీల్లో ని పోలింగ్ కేంద్రాలవద్ద 3సిఐలు, 5గురు ఎస్ఐలు, సిబ్బంది మొత్తం 180 మందితో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు సిఐ నర్సయ్య తెలిపారు. ఓటర్లు ధైర్యంగా తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గంగారాం, సిఐ లు, ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రెడ్డిసంఘం రూ.లక్ష వితరణ

విశాలాంధ్ర మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్ నగర్‌లో పునఃనిర్మాణం చేపడుతున్న అమ్మబాయమ్మ అమ్మవారికి ఆలయానికి అదే గ్రామానికి చెందిన యువ చైతన్యరెడ్డి సంఘం రూ. లక్ష ఆర్థిక సహాయం చేసింది. బుధవారం సంఘం సభ్యులు ఆలయ నిర్వాహకులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఆలయాల అభివృద్ధికి సంఘం కృషి చేస్తుందని చెప్పారు. గ్రామంలో ఆలయాలు ఉంటే అందూ భక్తి మార్గంలో ఉంటారని చెప్పారు. దేవాలయాలను అభివృద్ధి చేసుకోవడం అందరి భాద్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్‌లోని ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ గోదాము సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించడం జరిగింది. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీలు - బిజేపీ నుండి ఎన్.రవి కుమార్, కె. సతీష్ కుమార్, ఎ.ఐ.ఎం.ఐ.ఎం నుండి సయ్యద్ సిరాజ్, సిపిఐ నుండి ఎన్. నర్సింహా రెడ్డి,ఐ.ఎన్. సీ నుండి కె.బాల్‌రాజ్,అర్షద్,అబ్దుల్ బారీ, టీడీపీ నుండి ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడా మహోత్సవం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియంలో శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ మానియా-2025 కార్యక్రమంను ఎంఈవో వెంకటయ్య, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా మహోత్సవం (స్పోర్ట్స్ మానియా) నిర్వహించడం చాలా అభినందించదగ్గ విషయమన్నారు. టగ్ ఆఫ్ వార్, త్రో బాల్, ఖో,ఖో, క్రికెట్ రన్నింగ్ వంటి ఆటలు నిర్వహించడం జరుగుతుంది. పిల్లలు చదువలతో పాటు, ఆటలు చాలా కీలకం అని , పిల్లలలో దాగిన సృజనాత్మకత ను బయటకి వెలుగు దీయడానికి ఎంతగానో తొడపడుతుంది అని, పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో ముఖ్యం అని , క్రీడలతో శారీరక శ్రమతో పాటు మానసిక ఉల్లాసం కలుగును అని , పిల్లలు చదువుల తో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని అప్పుడే మంచి భావిపౌరులుగా దేశానికి సేవలు అందిస్తారని,,తల్లిదండ్రులకు ,దేశానికి మంచి సేవలు అందించాలని ,విద్య అభివృద్ధి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది అని గాంధీ పేర్కొన్నారు. అదేవిధంగా నా దృష్టికి వచ్చిన మీ ప్రతి సమస్య పరిష్కారానికి నా వంతు శాయశక్తులా కృషి చేస్తానని , తన వంతు కృషి చేస్తానని , నా సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలోశేరిలింగంపల్లి స్పోర్ట్స్ మేనియా 2025, చీఫ్ అడ్వైసర్ లయన్ డా.వెంకటేశ్వర రావు, అధ్యక్షులు, పవన్ కుమార్, సెక్రటరీ పి.త్రిమూర్తులు, కోశాధికారి, సలీం, కన్వీనర్ ఎస్ ఎస్ రావు, కో. కన్వీనర్ నరేంద్ర బాబు...ట్రేసమా స్టేట్ ప్రెసిడెంట్ రెడ్డి ,సెక్రటరీ అనిల్ కుమార్,రాజేశ్వర రావు, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

నేడే పోలింగ్

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- గ్రామాలకు తరలిన ఎన్నికల సామాగ్రి
- నియోజకవర్గంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవం,146 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయని ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో 153 గ్రామ పంచాయతీలకు ఆరు గ్రామపంచాయతీలలో సర్పంచ్ పదవులు ఆరు ఏకగ్రీవం కాగా మిగిలిన 1047 గ్రామ పంచాయతీలకు నియోజకవర్గంలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. అదేవిధంగా 1072 వార్డులగాను 190 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ప్రస్తుతం 882 వార్డులకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సందర్భంగా షాద్ నగర్ ఫరూక్ నగర్ మండలంలో 405 పోలింగ్ స్టేషన్లలో ఓట్లు వేసేందుకు ఏర్పాటు చేశారు. 12 రూట్లు ఉండగా నాలుగు జోన్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో గ్రామపంచాయతీ ఎన్నిక కోసం ఒక ఆరువను ఏర్పాటు చేసినట్లు అధికారులు ఆర్డీవో, ఎంపీడీవో, తెలిపారు. 12 రూట్లలో 35 బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరగనుండగా రెండు గంటలకు అదే రోజు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. అదేవిధంగా మండలంలో బందోబస్తు విషయానికి వస్తే సుమారు 500 మందితో మండలంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఏసిపిలు పదిమంది సిఐలు 30 మంది ఎస్ఐలు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఆర్డిఓ, ఎంపీడీవో, ఎలక్షన్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

విశాలాంధ్ర, పటాన్ చెరువు : లకడారం శ్రీ వెంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు ప్రజలందరి పైన ఉండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించానని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి విశేష అభిషేకములు కైంకర్యంలో శ్రీ గోదాదేవి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాలుపంచుకోవడం సంతోషదయకమన్నారు. నేడు జరగబోయే సంగారెడ్డి జిల్లా గ్రామపంచాయతీ ఆయా గ్రామాల్లో నిర్వహించే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు విజయం దిశగా పయనిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు రాజిరెడ్డి, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: మలిదశ తెలంగాణ ఉద్యమకారులు బెల్లి లలిత జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలని యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ లోని ఎల్బీ నగర్ చౌరస్తాలో బెల్లి లలిత విగ్రహం ఏర్పాటు కోసం యాదవ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్ యాదవ్,యాదవ జేఏసీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉపేంద్రమ్మ యాదవ్ తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సామాజిక తెలంగాణ కోసం బెల్లి లలిత అనేక పోరాటాలు చేసిందన్నారు. బెల్లి లలిత పోరాటం ద్వారానే తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకుందన్నారు.అగ్రవర్ణాలు రాజకీయ కుట్రలతో బెల్లి లలితను 17 ముక్కలుగా నరికి చంపారన్నారు.బెల్లి లలితను చంపిన హంతకులను ఏ ప్రభుత్వం కూడా నేటికి పట్టుకోలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బెల్లి లలిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లాకు బెల్లి లలిత పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కేవిగౌడ్, రఘురాం నేత, శ్రీనివాస్,పాపన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త సెల్టోస్‌ను ఆవిష్కరించిన కియా

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ఎస్‌యూవీ నాయకత్వాన్ని పెద్ద కొలతలు, మెరుగైన భద్రత, అత్యాధునిక వినూత్నతలతో పునర్నిర్వచించే అద్భుతమైన ఉత్పత్తిని అందించాలనే నిబద్ధతకు అనుగుణంగా, కియా ఇండియా ఈరోజు సరికొత్త కియా సెల్టోస్‌ను ఆవిష్కరించింది. ఇది సెగ్మెంట్ బెంచ్‌మార్క్-సెట్టర్ తిరిగి రావడాన్ని సూచిస్తుంది. భారతదేశంలో అత్యంత ప్రియమైన ఎస్‌యూవీలలో ఒకటైన ఇది బోల్డ్ కొత్త స్టైలింగ్, ప్రీమియం ఇంటీరియర్‌లతో పాటు విభిన్న కస్టమర్ అవసరాలకు అనుగుణంగా బహుముఖ ట్రిమ్స్, పవర్‌ట్రెయిన్‌లను కలిగి ఉంది. డిసెంబర్ 11 అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా బుకింగ్‌లు ప్రారంభమవుతాయి, దీని ద్వారా వినియోగదారులు 25,000 ప్రారంభ మొత్తంతో తమకు ఇష్టమైన ఎస్‌యూవీని రిజర్వ్ చేసుకోవచ్చు. కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగులీ మాట్లాడుతూ, 'కొత్త కియా సెల్టోస్ ఒక జనరేషన్ మార్పు కంటే ఎక్కువ; ఇది ఈ విభాగాన్ని పునర్నిర్వచించాలనే కియా ఉద్దేశ్యానికి నిదర్శనం. భారత దేశంలో అరంగేట్రం చేసినప్పటి నుంచి ఒక కొత్త వర్గాన్నినిర్వచించే ఎస్‌యూవీ అయిన కొత్త సెల్టోస్, బోల్డ్ డిజైన్, అధునాతన భద్రత, ప్రమాణాలను తిరిగి నిర్దేశించే విధంగా సెగ్మెంట్-లీడింగ్ టెక్నాలజీతో ఇప్పటి వరకూ ఉన్న హద్దులను దాటింది. వాస్తవ ప్రపంచ భారతీయ పరిస్థితులను అధిగమించడానికి, ఆప్టిమైజ్ చేయడానికి రూపొం దించబడింది- మా కస్టమర్ల ఆకాంక్షలను, అభిప్రాయాలను ప్రతిబింబిస్తుంది. ప్రపంచ ప్రమాణాలతో రాజీ పడ కుండాఇది, అనుసరించ దానికి కాదు, నాయకత్వం వహించాలనే మా ఆశయాన్ని ప్రదర్శిస్తుంది. సరి కొత్త కియా సెల్టోస్, ఈ వర్గాన్ని మళ్ళీ సంచలనాత్మకం చేస్తుందని, భారతదేశంలో కియా దీర్ఘకాలిక నాయకత్వాన్ని బలోపేతం చేస్తుందని మేం విశ్వ సిస్తున్నామన్నారు.

సమస్యలపై మంత్రులకు ఎంపీ వినతి

విశాలాంధ్ర-నిజామాబాద్ : నిజామాబాదు పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి బుధవారం ఢిల్లీలో పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్ లను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు సంబంధించి పలు విజ్ఞప్తులను అందజేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో పిక్టెకలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో పిట్ లైన్ ల ఏర్పాటు, పార్లమెంట్ పరిధి గుండా పలు రైళ్ల పొడగింపులు, వందే భారత్ సహా పలు నూతన రైళ్ల మంజూరు, అయ్యప్ప స్వాముల కొరకు కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా కేంద్ర జాతీయ రహదారులు, రవాణ శాఖ మంత్రి గడ్కరీ ని కలిసి జగిత్యాల జిల్లాలో జాతీయ రహదారులు 61,63 లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం, అంబారీపేట అంతర్గాం గ్రామాల వద్ద ఫ్లైఓవర్లు అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టాల్సిందిగా కోరగా మంజూరుకు తక్షణమే మౌఖికంగా హామీ ఇచ్చి, సాంకేతికంగా సాంకేతికంగా మంజూరుకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఎంపీ అర్వింద్ తెలిపారు. అనంతరం కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే ను సైతం కలిసిన ఎంపీ జగిత్యాల జిల్లాలో బోర్నపల్లి నుండి జగన్నాథపూర్ వరకు హై లెవెల్ బ్రిడ్జిని చేపట్టాలని కోరగా గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మేడిపల్లి: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 12వ డివిజన్ పరిధిలో నిర్వహించిన పలు ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ స్థానిక కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్ హాజరై స్థానిక ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొమ్మక్ కల్యాణ్ కుమార్ మాట్లాడుతూ...స్థానిక కాలనీ ప్రజల ఎన్నో సంవత్సరాలుగా ఉన్న గృహావసరాల సమస్యలు పరిష్కార దిశగా సాగుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం సాధికారతకు ఇది ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నివాసులు, అంబేద్కర్ నగర్ ఫేజ్-3 కాలనీ కమిటీ సభ్యులు, రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీ కమిటీ సభ్యులు, దేవేందర్ నగర్ నివాసులు, వార్డు అధికారులు, ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

అయ్యప్ప మహా పడి పూజ

విశాలాంధ్ర, మేడిపల్లి: జిహెచ్ఎంసీ పీర్జాదిగూడ సర్కిల్ లోని కమలానగర్ నందు హరిహర సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమలానగర్ యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్డు పరిమితుల పునర్నిర్వచన ముసాయిదా ప్రకటన

విశాలాంధ్ర, మేడిపల్లి: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ యొక్క వార్డు పరిమితుల పునర్నిర్వచన (డీలిమిటేషన్ అఫ్ వార్డ్స్)కు సంబంధించిన ముసాయిదా ప్రకటన (డ్రాఫ్ట్ పబ్లికేషన్) బుధవారం ఉదయం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఫామ్ -1 ద్వారా డిప్యూటీ కమీషనర్ శ్రీమతి ఎ. శైలజా విడుదల చేయడం జరిగినది. ఇట్టి డ్రాఫ్ట్ పై ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడానికి ఈ ముసాయిదా ప్రచురించబడింది. కొత్తగా ప్రతిపాదించిన 300 వార్డులకు సంబంధించిన ముసాయిదా ప్రకటన (డ్రాఫ్ట్ పబ్లికేషన్) బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచబడ్డాయి. కావున పౌరులు తమ సూచనలు మరియు అభ్యంతరాలు లిఖిత పూర్వకంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నిర్ణీత గడువు అనగా 16-12-2025 వరకు సమర్పించవచ్చు. అందువల్ల పౌరులు తమ విలువైన అభ్యంతరాలు మరియు సూచనలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము అని డిప్యూటీ కమీషనర్ శ్రీమతి ఎ.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలకు అనుకూలంగా మార్కెట్ స్థలం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-నాగారం : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలో రోడ్లపై కూరగాయల మార్కెట్ ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. రాంపల్లి అంబేద్కర్ కూడలి వద్ద నుంచి చర్లపల్లి అదేవిధంగా కీసరకు వెళ్లే ప్రధానమైన మార్గంలో కూరగాయలు అమ్మడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. చర్లపల్లిలో రైల్వే స్టేషన్ వద్ద ఇటీవల కాలంలో సికింద్రాబాద్ తలపించేలా స్టేషన్ రూపు రేఖలు మారి, సౌకర్యాలు పెరగడంతో రైళ్లు అన్ని ప్రాంతాలకు వెళ్లడానికి స్టేషన్లో అనుకూలంగా స్టేషన్ మారింది. ఈ నేపథ్యంలో రద్దీ అధికమైనదని చెప్పవచ్చు. గతంలో పాలకవర్గానికి తెలిపినప్పటికీ ప్రయోజనం లేదని అన్నారు. రాంపల్లిలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని, మార్కెట్ స్థలాన్ని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోండి

విశాలాంధ్ర-కొత్తూరు: నేడు జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులకు లొంగకుండ ప్రశాంత వాతావరణంలో తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నందిగామ సీఐ పి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 19 గ్రామా పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలవద్ద భారీగా పోలీసు బందోబస్తు నిర్వహించ నున్నట్టు పేర్కొన్నారు. అమాయక ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ డబ్బు, మద్యం పంపిణీలు, గుంపులుగా తిరుగుతూ అల్లర్లను సృష్టించేం దుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లను ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

ఉద్యోగులు జాగ్రత్తగా వ్యవహరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శంషాబాద్ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్జర్వర్ లతో మాట్లాడి పలు సూచనలు చేసారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మున్ని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవహక్కుల దినోత్సవంపై అవగాహన

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలనందు విద్యార్థిని, విద్యార్థులకు మానవహక్కుల దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా విచ్చేసిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, గచ్చిబౌలి రాజనీతిశాస్త్ర విభాగపు అధిపతియైన ఆచార్య నాగేశ్వరరావుగారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించినవి. ప్రపంచంలో పౌర రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించడానికి డిసెంబరు 10వ తేదీన ఒక అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరము నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం మానవహక్కులు - మన దైనందిన అవసరాలు అనే నినాదంతో నిర్వహిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సోమరాజు యూనివర్సిటీ తిరుపతి, అధ్యాపకులు మహమ్మద్ యూనస్, సయ్యద్ మక్సూద్, విద్యార్థులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, జనార్ధన్, పాలం శ్రీను, ప్రేమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నుంచి దక్షిణ మధ్య రైల్వేదరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర, హైదరాబాద్ : సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, హైదరాబాద్, అమరావతిలోని సర్క్యూట్ బెంచ్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్, సికింద్రాబాద్, అమరావతి కొరకై దక్షిణ మధ్య రైల్వే తరపున న్యాయవాదుల ప్యానెల్స్ ఏర్పాటుకై ఆసక్తి, అర్హతగలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులను దక్షిణ మధ్య రైల్వే ఆహ్వానిస్తోంది. ఈ విషయంలో, అర్హత వివరాలను తెలియజేస్తూ ఎంపానెల్ చేయబడటానికి సిద్ధంగా ఉన్న న్యాయవాదుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేయబడింది. న్యాయవాదుల ప్రయోజనం కోసం సంబంధిత బార్ అసోసియేషన్ల నోటీసు బోర్డులలో ఈ నోటిఫికేషన్‌ను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయాలని బార్ అసోసియేషన్లకు సూచించడమైనది. ఇందుకు సంబంధించిన నమూనా దరఖాస్తు వివరణాత్మక నోటిఫికేషన్ దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో అందుబాటులో వుంది. ఆసక్తిగల న్యాయవాదులు తమ దరఖాస్తులను జనవరి 9, 2026న లేదా అంతకు ముందు సికింద్రాబాద్, రైల్ నిలయంలోని 3వ అంతస్తులోనున్న డి.జి.ఎం/లా కార్యాలయానికి అందజేయవచ్చు లేదా ra.catrct.scr@gmail.comకు మెయిల్ ద్వారా పంపవచ్చు.

గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

సీఎం రేవంత్‌ను అభినందించిన సీపీఐ నేత నారాయణ



విశాలాంధ్ర-హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, క్యాబినెట్ చురుకుగా పని చేసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిం చిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ సమ్మిట్‌ను గొప్పగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఇక్కడ మంచి ఏర్పాట్లు చేశారని, దాదాపు 6 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోందని బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూనే పారిశ్రామికాభివృద్ధిని సమన్వయం చేసుకోవాలని నారాయణ సూచించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలు పెట్టుబడికి మంచి వాతావరణం కలిగిన భూములు అందుబాటులో ఉంటాయని, అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా పారిశ్రామికాభివృద్ధి చేపడితే రానున్న రోజుల్లో పరిశ్రమలు పెరుగుతాయని అన్నారు. రెవెన్యూ విభాగం భూములు అనుమతులు ఇచ్చే విషయంలో అవకతవకలు జరగకుండా అమలు చేయాలని కోరారు.

15 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహ ద్దుల్లో చురుకుగా పనిచేసిన మావోయిస్టు నాయకుడు వినోద్ సాయనా లొంగిపోయారు. ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉంది. ఈ మేరకు మహారాష్ట్ర డీజీపీ రసీం శుక్లా, కాంకేర్ ఎస్పీ ఎల్‌కే ఎలిశాల వెల్లడించారు. మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో 15 మంది బుధవారం లొంగిపోయారని, వీరిపై మొత్తం రూ.కోటికిపైగా రివార్డు ఉందన్నారు. గడ్చిరోలిలో 11 మంది ఆయుధాలు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. వారందరిపై 89 లక్షల రూపాయల రివార్డు ఉంది. కాంకేర్‌లో నలుగురు లొంగిపోగా, వీరిలో మదన్వాడ దాడిలో పాల్గొన్న ఒకరు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కింద రూ.50 వేలు చొప్పున చెక్కులను ఎస్పీ ఎలిశాల అందజేశారు.

సాగు వ్యయం తగ్గిద్దాం

పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాగు యంత్ర పరికరాల కోసం అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సాగు వ్యయం తగ్గేలా ఆధునిక యంత్ర పరికరాలను రైతులకు అందుబాటులోకి తేవాలని వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో ధాన్యం, పత్తి, మిర్చి సహా వివిధ వాణిజ్య పంటల కొనుగోళ్లపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. శాస్త్రీయ విధానంలో పంటల సాగు ప్రణాళిక, వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు, డ్రోన్ల వినియోగం ద్వారా సాగు వ్యయం తగ్గించాలని, తద్వారా రైతులకు ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఓ వెబ్‌సైట్ ప్రారంభించి... పరికరాల వివరాలు తెలిపేలా సమాచారం ఉంచాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం కొనుగోళ్లతో పాటు వివిధ పంటల కొనుగోళ్లు, మార్కెటింగ్‌పై సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల సాగు, వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 18.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మొత్తం 2,606 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, 7.39 కోట్ల గోనె సంచులను రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే రూ.4,085 కోట్ల మేర రైతులకు చెల్లింపులు చేసినట్టు సీఎంకు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 32 శాతం అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన సీఎం ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో ప్రజలు తినే వెరైటీ వరి సాగుతో పాటు వాటి కొనుగోలు, అంతర్జాతీయంగా మార్కెటింగ్‌పై దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన స్లాట్ల కేటాయింపు, ఇతర సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి పత్తి కొనుగోళ్లలో సమస్యలు సృష్టించొద్దని సీసీఐకి సూచించారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. సాగులో శాస్త్రీయ విధానాలు అవలంబించటం ద్వారా నాణ్యమైన పంట రైతులకు అందివస్తుందని, వీటిపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో 45,420 హెక్టార్లలో సుబాబుల్ సాగైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా సుబాబుల్ రైతులకు ధర దక్కేలా చూడాలని సీఎం సూచనలు జారీ చేశారు. అరటి, నిమ్మలాంటి ఉద్యాన పంటలకు సంబంధించి కొనుగోలుదారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కనీస మద్దతు ధర దక్కేలా వాణిజ్య పంటల హార్వెస్టింగ్ ప్రక్రియలో రేషనలైజేషన్ విధానాన్ని పాటించాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. రైతులకు రవాణా ఖర్చులు తగ్గించి... అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను అనుసంధానించాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో పండే పంటలకు సంబంధించి ప్రొడక్ట్ క్లస్టర్ల ద్వారా పంట ఉత్పత్తి, మార్కెటింగ్‌ను సమన్వయం చేయాలన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి పంటకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహా ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఏడుగురు సర్పంచ్‌లు ఏకగ్రీవం

కొత్తగూడెంలో సీపీఐ జోరు

టూ ఇంక్లైన్ జీపీలో క్లీన్ స్వీప్

విశాలాంధ్ర-కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బలం పెరిగిందని చెప్పేందుకు పంచాయతీ ఎన్నికలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ రెండేళ్లలో జరిగిన వాడవాడ అభివృద్ధి నేడు విజయాలు అందిస్తోంది. ఇప్పటివరకు ఏడు సర్పంచ్ స్థానాలలో సీపీఐ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు, మూడో దఫాలో ఎన్నికలు జరుగుతుండగా రెండో దఫాలో ఐదు పంచాయతీలు, మూడో దఫాలో రెండు పంచాయతీల సర్పంచ్ పదవులు సీపీఐ బలపరచిన అభ్యర్థులు కైవసం చేసుకోవడం విశేషం. ఈ పరిణామాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని రేపుతున్నాయి. సుజాతనగర్ మండల పరిధిలోని రామవరం ఏరియా 2-ఇంక్లైన్ గ్రామ పంచాయతీలో సీపీఐ పూర్తి పట్టు సాధించింది. సర్పంచ్ స్థానంతో పాటు పంచాయతీలోని ఎనిమిది వార్డు స్థానాలు ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఈ కార్మిక వాడలో దశాబ్దాలుగా ప్రజాసేవ చేసి పట్టు సాధించిన సీపీఐ... స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతోంది. గుగులోత్ అరుణ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చుంచుపల్లి మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీలో కూడా భూక్య శాంతి ఏకగ్రీవంగా ఎన్నికై నాలుగు దశాబ్దాలుగా ఈస్థానాన్ని పదిలం చేసుకోవడం గమనార్హం. పాల్వంచ మండలంలోని బిక్కుతండా గ్రామపంచాయతి సర్పంచ్‌గా భూక్యా శాంతి, సంగేమ్ సర్పంచ్‌గా బానోత్ రవి, తవిసేలగూడెం సర్పంచ్‌గా జి.రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సర్పంచులకు, వార్డు సభ్యులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా శుభాకాంక్షలు తెలిపారు. పారదర్శకంగా పాలనా అందించి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలని కొత్త సర్పంచ్‌లకు సూచించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో

'ఉస్మానియా' అభివృద్ధి

రూ.వెయ్యి కోట్లు మంజూరు

విద్యార్థుల ఆకాంక్షల మేరకే పాలన: సీఎం రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ కాలంలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గత వైభవం తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్, డిజైన్లను విద్యార్థుల సూచనల కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్‌నూ విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 108 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోనే అత్యంత పురాతన యూనివర్సిటీల్లో 7 వ స్థానం, దక్షిణ భారత దేశంలో 3 వ ప్రాధాన్యత కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకునే క్రమంలో అందరినీ కలవాలని వచ్చానని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా యూనివర్సిటీ విద్యార్థులు కదలడం వల్లే ఆ సమస్యకు పరిష్కారం లభించిందని...అందులో తెలంగాణ ఉద్యమం కూడా ఒకటని తెలిపారు. ఉద్యమాలతో విద్యార్థులు ఏమీ ఆశించలేదని, వారు స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కావాలని అడిగారన్నారు. యూనివర్సిటీని కాలగర్భంలో కలపడానికి కొందరు కుట్రలు పన్నారని, ఉస్మానియా ప్రపంచానికి దిక్సూచిలా గొప్పగా ఎదగాలన్నది నా సంకల్పమన్నారు. 30-40 ఏళ్లుగా రగిలిన వర్గీకరణ అంశం దళిత బిడ్డల మధ్య విభజన రేఖను గీసిందని... దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన చేయలేదన్నారు. ఈ సామాజిక సమస్యను పరిష్కరించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అన్నారు. గడిచిన వందేళ్లుగా ఈ దేశంలో బలహీన వర్గాల లెక్కలు లేవు. ప్రభుత్వం ఆలోచన చేసి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ కుల రాజకీయ గణన పూర్తి చేశామన్నారు. తద్వారా కేంద్రంపై ఒత్తిడి పెరిగి 2026 లో చేపట్టే జన గణనలో ఆ అంశాన్ని చేర్చారని తెలిపారు. దళితులు, ఆదివాసీలు, గిరిజనులు. బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళలు నిండుమనసుతో ఆశీర్వదిస్తేనే ఈ స్థాయిలో ఉన్నానని...ఇలాంటి అవకాశం ఏ ఒక్కరికో వస్తుందన్నారు. చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఏదైనా చేయాలన్న సంకల్పం నాలో ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేరుతో వేర్వేరుగా పాఠశాల నిర్వహణ వల్ల వివక్ష ఎలా రూపుమాపగలం? అందుకే ఆలోచన చేసి విద్యార్థులంతా ఒకే క్యాంపస్ లో చదువుకోవాలన్న లక్ష్యంగా మహాత్మాగాంధీ గారి స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సలహాదారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ ములుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కాసీం, ప్రజా ప్రతినిధులు, వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఇండిగో సంక్షోభానికి మోదీనే బాధ్యుడు

- ఐంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణకు గుణపాఠం
- అంబానీ, అదానీకి ప్రభుత్వ రంగ సంస్థలు
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచన సీఎం విరమించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇండిగో విమానయాన సంక్షోభానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలే కారణమని, దీనికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. అదానీ, అంబానీ తదితర కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెట్టడం, వారికి సహకరించడం లాంటి చర్యలకు మోదీ పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ విధానాలను చూస్తే... సర్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. ఇటు రాష్ట్రంలోనూ విద్య, వైద్య రంగాన్ని సర్వం ప్రైవేట్‌కు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే విశాఖ ఉక్కును కారుచౌకగా కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, దీనిపై పెద్దఎత్తున కార్మిక, ప్రజా సంఘాల నుంచి తిరుగుబాటు వచ్చిందని తెలిపారు. అది చాలదన్నట్లుగా ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు చంద్రబాబు ప్రభుత్వం అప్పగించాలన్న నిర్ణయం దారుణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు సుప్రీం కోర్టు మార్గదర్శకాలను ఇండిగో యాజమాన్యం అనుసరించకపోవడంతోనే ఇవాళ ఈ దుస్థితి తలెత్తిందని పేర్కొన్నారు. కనీసం విమానయాన రంగ నిపుణుల సూచనలను ఇండిగో యాజమాన్యం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం అంటే కార్పొరేట్ శక్తులకు లెక్కలేకపోవడం, ప్రభుత్వం పూర్తిగా వారికి లొంగిపోవడం... వాటన్నిటి ఫలితంగానే లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారని వివరించారు. ఇండిగో సంక్షోభాన్ని కేవలం పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని బాధ్యుడిని చేయడం తగదని, దీనికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక కేంద్ర మంత్రి పొరపాటుతోనే ఇండిగోలో సంక్షోభం తలెత్తిందంటూ తన జాతీయ అనుకూల మీడియా ద్వారా ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం తెరలేపిందన్నారు. ఇది మోదీ ప్రభుత్వ వైఫల్యమని, తెలివితేటలతో ఇండిగో వ్యవహారం చర్చకు రాకుండా పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగానే ఇవి జరుగుతున్నాయని, భవిష్యత్‌లో మరిన్ని జరుగుతాయని, వాటిని ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే కార్యక్రమాలు తప్ప ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలు ఎప్పుడూ చేయలేదని, రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరిట ప్రైవేటీకరణ చేసే విధానాన్ని కూటమి ప్రభుత్వం విరమించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు పున: సమీక్షించాలని కోరారు. పీపీపీ విధానం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు దూరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వైపు ఆరోగ్యశ్రీ సేవలు సరిగ్గా అమలుకు నోచుకోలేదని, నెట్ వర్క్ ఆస్పత్రులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు సామాన్యుడికి అందుబాటులో లేవని, అలాంటి తరుణంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. ఇప్పటికయినా కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు గుర్తెరిగి, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌కు కట్టబెట్టే చర్యలను విడనాడాలని, పీపీపీ విధానంతో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను విరమించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

మహోన్నతుడు కట్టమంచి

జయంతి సభలో వక్తల నివాళి

విశాలాంధ్ర-విశాఖ: తెలుగు సాహిత్యంలో తనకంటూ విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నతుడు కట్టమంచి రామలింగారెడ్డి అని వక్తలు కొనియాడారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్‌కి మొట్టమొదటి వైస్ ఛాన్సలర్ కట్టమంచి 145వ జయంతిని బుధవారం ఆంధ్ర వర్సిటీ తెలుగు విభాగం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ... ముసలమ్మ మరణం, నవ యామిని, కవిత్వ తత్త్వ విచారము, పంచమి,వ్యాసమంజరి, అర్థశాస్త్రము మొదలైన గ్రంథాలు రాసి విశిష్ట స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. కట్టమంచి ఉత్తమ పరిపాలనాదక్షుడు అన్నారు. నరసింహారావు మాట్లాడుతూ వందేళ్ల ముందే ఎంతో దూరదృష్టితో విశాఖలో ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఏర్పాటుకు ఆయన గొప్ప ప్రయత్నం చేశారన్నారు. ఆచార్య యోహాన్ బాబు మాట్లాడుతూ కట్టమంచి జ్ఞాన సంపన్నుడు అని అన్నారు. డాక్టర్ దామెర వెంకట సూర్య రావు మాట్లాడుతూ ...ఆధునిక తెలుగు సాహిత్య చరిత్ర ఆవిర్భావ దశలో విద్యావేత్తగా, కవిగా, రాజనీతిజ్ఞుడుగా, విమర్శకుడిగా విలక్షణమైన స్థానాన్ని సంపాదించారన్నారు. 1899 లో క్రైస్తవ కళాశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు సమర్థ రంగయ్య శెట్టి నిర్వహించిన పద్య కవిత కావ్యాల పోటీలో ఆయన రచించిన ముసలమ్మ మరణం కావ్యంగా తొలి ఖండకావ్యం గా ప్రసిద్ధి పొందిందన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి చిరస్మరణీయులు అని పేర్కొన్నారు. విమర్శకుల చేత ప్రశంసలు అందుకున్న మహా మేధావి కట్టమంచని అన్నారు. పరిశోధక విద్యార్థి ఇళ్ల మురళీధరరావు రచించిన పాడ చక్కని శతకం అనే పద్య గ్రంథాన్ని ప్రాచార్యులు నరసింహారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సర విద్యార్థిని ఆశ ఆహ్వానంతో ప్రారంభం అయిన ఈ సదస్సు రత్నం చేసిన వందన సమర్పణతో ముగిసింది. తొలుత అప్పారావు, ఆర్ట్స్ కళాశాల ప్రినిపాల్ ఆచార్య అడ్డాడ నరసింహారావు ... కట్టమంచి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఎం.కృష్ణవేణి, డాక్టర్ ఎం.దాసు, డాక్టర్ బి.సూర్యనారాయణ, డాక్టర్ ఎం.ప్రతాప్, డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్.గిరీష్ కుమార్, డాక్టర్ ఆర్.శివయ్య, పితాని ప్రసాద్, సాహితి వేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

సీజేఐకు రిటైర్డ్ జడ్జిల మద్దతు

44 మంది బహిరంగ లేఖ

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)కు రిటైర్డ్ జడ్జిలు మద్దతు ప్రకటించారు. రొహింగ్యాలపై చేసిన వ్యాఖ్యలకుగాను సీజేఐపై దుష్ప్రచారం ఉద్దేశపూర్వకంగా సాగుతోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు 44 మంది బుధవారం బహిరంగ లేఖలో ఖండించారు. రొహింగ్య వలసదారులపై విచారణ క్రమంలో సీజేఐ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లు ప్రకటించారు. సుప్రీంకోర్టుకు అప్రతిష్ఠ తెస్తే సహించేది లేదని హెచ్చరించారు. న్యాయ విచారణ ఎప్పుడు పారదర్శకంగా, సహేతుకమైన పద్ధతిలోనే సాగాలని మాజీ న్యాయమూర్తులు నొక్కిచెప్పారు. ప్రస్తుతం సీజేఐ వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం కేవలం అభిప్రాయ భేదం కాదని కోర్టు రూమ్‌లో అడిగే సాధారణ ప్రశ్నలను వివక్షపూరితమైనవిగా చిత్రీకరిస్తూ న్యాయ వ్యవస్థను అవమానించే ప్రయత్నమని విమర్శించారు. కోర్టులో దావా చేసే హోదాను చట్టంలో ఎవరు కల్పించారని సీజేఐ అడిగినది సాధారణ ప్రశ్నేనన్నారు. ఇది తేలకుండా తీర్పు రాదని తెలిపారు. 'భారత దేశ గడ్డపై ఏ ఒక్క మానవుడు (పౌరుడు/విదేశీయుడు) వేధింపులకు గురి కారాదు. వారితో ఎవరూ అమానవీయంగా ప్రవర్తించరాదు. వ్యక్తి గౌరవ మర్యాదలకు భంగం కలిగించరాదు' అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసిందని తమ లేఖలో రిటైర్డ్ జడ్జీలు గుర్తుచేశారు. ధర్మాసనం చెప్పినది వక్రీకరించి, న్యాయస్థానం గౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం తగదన్నారు. రొహింగ్యాలు చాలా వరకు అక్రమంగానే దేశంలోకి ప్రవేశించారని, శరణార్థుల రక్షణ చట్టం కింద వారికి భద్రత కల్పించే కార్యాచరణ లేదన్నారు. జాతీయత, వలస, పత్రాలు లేదా సరిహద్దు భద్రతపై ప్రతి విచారణ క్రమంలో అడిగే న్యాయమైన ప్రశ్నలపై విద్వేషం లేదా పక్షపాతం పేరిట ఆరోపణలు గుప్పిస్తే...న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తి ప్రమాదంలో పడుతుందని రిటైర్డ్ జడ్జిలు హెచ్చరించారు.

ఉద్యోగుల భద్రత, హక్కులకు ప్రాధాన్యం: పవన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: 'ఒక ప్రభుత్వ ఉద్యోగి కుమారుడిగా ఉద్యోగుల సాధకబాధకాలు నాకు తెలుసు. నా శాఖ పరిధిలో ఉద్యోగులకు ఏం చేయగలనని ఆలోచించాను. ఉన్నతాధికారులను అడిగితే సంస్కరణలు చాలా ఉన్నాయని చెప్పారు. పదోన్నతి వస్తే ఉద్యోగి ఇంట్లో పండుగ వాతావరణం ఉంటుంది. మరింత ప్రభావవంతంగా పని చేస్తారు. అందుకే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పదోన్నతుల వ్యవహారాన్ని పారదర్శకంగా ముందుకు తీసుకువెళ్లామ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ , గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బందితో బుధవారం మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... పదోన్నతులతో మీరు ఎంత సంబరపడ్డారో... మీరు అందించే సేవల ద్వారా ప్రజలు కూడా అంతే ఆనందపడాలన్నారు. ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. ఏడాదిన్నర పాలనలో ఎన్నో సంస్కరణలు అమలు చేశామన్నారు. మరిన్ని అమలు చేయబోతున్నామన్నారు. చట్టబద్ధంగా ఉద్యోగులకు చేయగలిగినవన్నీ చేస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. పల్లెలు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. అందుకే గ్రామాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పంచాయతీరాజ్ శాఖను ఎంచుకున్నానని చెప్పారు. అనుభవం ఉన్న అధికారి పర్యవేక్షణ కావాలని శశిభూషణ్ కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా తీసుకున్నామని పేర్కొన్నారు. ఆయనతోపాటు కృష్ణతేజ, వెంకటకృష్ణ వంటి నిబద్ధతతో పని చేసే అధికారుల అనుభవంతో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. బదిలీలు, పదోన్నతులపై ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సులు చేసినా... ఉద్యోగికి అర్హత ఉంటేనే దాన్ని ఆమోదించాలని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడినపడితే ఉద్యోగుల ఆకాంక్షలు తీరుతాయన్నారు. ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. 13,350 పంచాయతీలను స్వతంత్ర పాలనా యూనిట్లుగా మార్చామని చెప్పారు. డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి గెజిటెడ్ అధికారిని నియమించి మున్సిపాలిటీలతో సమాన అభివృద్ధి చేపట్టేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. పాలనను సులభతరం చేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించామని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ కమిషనర్ ముత్యాల రాజు, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎంఎస్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, ఇంజినీరింగ్ విభాగం అధిపతులు బాలూ నాయక్, గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత బాలుడికి మంత్రి లోకేశ్ అండ

సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చదువుకోవాల్సిన వయసులో బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న 12 ఏళ్ల బాలుడికి విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. క్యాన్సర్ వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అనంతపురం పట్టణం వేణుగోపాల్ నగర్ కు చెందిన 12 ఏళ్ల కె.చిన్నికృష్ణ ఉదయ్ పవన్ కుమార్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా, బెంగళూరులోని శ్రీ శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్, కీమోథెరపీ కోసం సాయం అందించి బాలుడి ప్రాణం నిలపాలంటూ గత నెల అనంతపురం జిల్లా పర్యటనలో మంత్రి లోకేశ్‌ను కలిసి కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం బాలుడి వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.12 లక్షల ఎల్‌వోసీ అందజేశారు. మంత్రి లోకేశ్ సాయం పట్ల బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

యువకుడు బత్తుల సాయికి నాలుగు పార్టీలు మద్దత్తు

గెలిపిస్తే నిజాయితీగా సేవా చేస్తా : సాయి

విశాలాంధ్ర, దమ్మపేట : స్థానిక సంస్థల ఎన్నికల పోరులో భాగంగా దమ్మపేట రెండో వార్డులో పోటీ చేస్తున్న అభ్యర్థి బత్తుల సాయి కి అన్ని అంశాలు కలిసి వస్తున్నాయి. ఇతనికి కాంగ్రెస్, జనసేన, సీపీఐ, సీపీఐ (మాస్ లైన్) వంటి నాలుగు ప్రధాన పార్టీలు బలపరిచిన ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇతని గెలుపు నల్లేరుపై నడికే అని భావిస్తున్నారు. తనను గెలిపిస్తే నిజాయితీగా ప్రజాసేవ చేస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. ఆయనకు 'గౌను' గుర్తు కేటాయించారు. ఈ గుర్తును వార్డు ఓటర్లలో బలంగా తీసుకువెళ్లడంలో యువకుడైనా సాయి విశేష కృషి చేసారు. ముఖ్యంగా అధికంగా ఉన్న మహిళా ఓటర్లను ఆకర్షించడానికి వినూత్న పద్ధతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ వార్డులో మహిళలా ఓటర్లే కీలకం కనున్నారు. అందుకే అతను యువ ఓటర్లతో పాటు మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. సాయి విజయం పై ఎలాంటి సందేహం లేదని కాంగ్రెస్ నాయకులతోపాటు మిత్రపక్షాల నాయకులు వెల్లడిస్తున్నారు. అత్యధిక మెజారిటీ సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అధికార పార్టీతో పాటు ప్రధాన పార్టీల మద్దతు ఉన్నప్పటికీ యువకుడైన సాయి ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా రాత్రి పగలు శ్రమిస్తున్నారు. చురుకుగా ఉండే అతని వ్యవహార శైలి తో తమ సమస్యలు తీరుతాయని వార్డు ప్రజలు భావిస్తున్నారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల గౌరవాన్ని, అభివృద్ధిని కాంక్షించి సేవలందిస్తానని హామీ ఇస్తున్నారు. తన విజయం ఖాయం అనిపించిన తాను ఏమాత్రం ఎమరపాటు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున తనను గెలిపిస్తే వార్డు అభివృద్ధికి శక్తివంతర లేకుండా కృషి చేస్తానని భరోసా ఇస్తున్నారు.

సిపిఐకి రెండు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

2 ఇంక్లైన్ సర్పంచ్‌గా గురులోత్ అరుణ

అనిశెట్టిపల్లి సర్పంచిగా కొర్సా వీరబాబు ఏకగ్రీవం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాత నగర్ మండలంలోని 2 -ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచి స్తానంతో పాటు లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి సర్పంచ్ స్తానంలో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ రెండు పంచాయతీల్లో ప్రత్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించు కోవడంతో రెండు సర్పంచి స్తనాలు సిపిఐ కైవసం చేసుకుంది. 2 ఇంక్లైన్ నుంచి గుగులోత్ అరుణ, అనిశెట్టిపల్లి నుంచి కొర్సా వీరబాబు సర్పంచులుగా ఎన్నికయ్యారు. 2 ఇంక్లైన్ గ్రామపంచాయతీలోని 8 వార్డు సభ్యులు సైతం సిపిఐకి ఏకగ్రీవమవడం గమనార్హం. కొత్త సర్పంచులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా శుభాకాంక్షలు తెలిపారు. తమ అధికారాలను ప్రజల కోసమే వినియోగించాలని చాలా బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు. సిపిఐ పార్టీ ప్రతిష్టను కాపాడుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు.

పక్కా ఏజెన్సీలోని బొజ్జి గుప్ప పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి : జితేష్ వి. పాటిల్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ఆ మేరకు ప్రోత్సహించినప్పుడే ఇంకా కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆయన దుమ్ముగూడెం మండలంలోని బొజ్జిగుప్ప గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల నిర్వహణ, బోధన ప్రమాణాలు, విద్యార్థుల నేర్పును సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా స్థాయి, హాజరు, పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా ప్రమాణాలు, కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. వాటి పరిరక్షణ తోపాటు సంరక్షణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు స్వయంగా నిర్వహిస్తున్న ఈ చర్య పర్యావరణ పరిరక్షణలో భాగంగా చిన్నారుల్లో మంచి అలవాట్లను పెంపొందిస్తుందన్నారు. పాఠశాల ప్రాంగణంలోని పచ్చదనం, పర్యావరణ శుభ్రత పట్ల ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధను ఆయన అభినందించారు. అలాగే విద్యార్థుల రీడింగ్, రైటింగ్ స్కిల్స్‌ను ప్రత్యేకంగా పరీక్షించి వారు చదివే స్థాయి, అక్షరాల గుర్తింపు, వాక్య నిర్మాణం వంటి అంశాల్లో వారి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు పఠనంలో మరింత నైపుణ్యం సాధించేలా తరగతి గదుల్లో రోజువారీ రీడింగ్ యాక్టివిటీలను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రాయడం..చదవడం నైపుణ్యాలతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా పాఠశాలలో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రీడలు, ఆటలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అత్యంత కీలకమన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే చర్యలో భాగంగా కలెక్టర్ వారికి నోట్‌బుక్స్, పెన్నులను అందజేసారు.



క్రమం తప్పకుండా చదువులో ముందుకు సాగాలని చిన్నారులను కోరారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన ఆయన...ప్రతిరోజూ పాఠశాలకు హాజరై పాఠాలు నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. పిల్లలు కలెక్టర్ మాటలను శ్రద్ధగా విని అవగాహన చేసుకున్నట్లు అనిపించింది. అనంతరం కలెక్టర్ బుజ్జి గొప్ప గ్రామంలో గత సంవత్సరం "ఏరు ఫెస్టివల్" లో భాగంగా చేపట్టిన విధంగానే గిరిజన సాంప్రదాయాలు ఆదివాసీల ఆవాసాలు, ఆహార అలవాట్లను బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా ఈ సంవత్సరం కూడా ఏర్పాట్లు చేయాలని దానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఉపాధ్యాయులు వసంతరావు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయాలు వ్యాపారంగా మారాయి..

రాజ్యాంగ వ్యవస్థను కాపాడుకుందాం

ప్రజాపంథా అభ్యర్థులను గెలిపించండి

చంద్ర అరుణ

విశాలాంధ్ర - గుండాల : వర్తమాన సామాజిక వ్యవస్థలో రాజకీయాలు పక్క వ్యాపారంగా మారాయని ఏమాత్రం నైతిక విలువలు లేని పరిస్థితి నెలకొందని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు చంద్ర అరుణ, మాచర్ల సత్యం అన్నారు. నేటి పాలకులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. పాలకుల రూపంలో ఉన్న కార్పోరేట్ శక్తులు పార్లమెంట్ స్థాయి నుంచి గ్రామాల స్థాయి ఎన్నికలను కూడా ప్రహసనంగా మార్చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిన తమ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. ప్రచారంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజాపంథా సర్పంచ్ అభ్యర్థులైన ఈసం శ్రీను (శంకరన్న), ముత్తాపురం పంచాయతీ అభ్యర్థి పూనేం రమాదేవి (రోజా), లింగగూడెం పంచాయతీ అభ్యర్థి కల్తి ప్రశాంత్ లతో పాటు తమ పార్టీ మద్దతు తెలుపుతున్న వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. ఈనెల 17న జరగనున్న ఎన్నికల్లో నిజాయితీగా ప్రజల కోసం నిలబడే అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు ప్రజల ఓట్లను ప్రభావితం చేసేందుకు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేవలం అధికారం పెత్తనం సంపాదన కోసం నేటి రాజకీయాలు గ్రామాల్లో సైతం అనైతిక సంస్కృతిని వ్యాపింప చేశాయని ఆరోపించారు. రాజ్యాంగ నిర్దేశం ప్రకారం రాజకీయ వ్యవస్థను పునః స్థాపించడానికి ముఖ్యంగా యువతరం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి ఈసం శ్రీను శంకరన్న మాట్లాడుతూ తమ పార్టీ త్యాగధనులు, ప్రజల కోసం సర్వం త్యాగం చేసిన బాటన్న, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య లాంటి మరి ఎంతోమంది నాయకులు సూర్తితో నిజాయితీగా ప్రజా అభివృద్ధి కోసం పనిచేస్తానని భరోసా ఇచ్చారు. నేటి వ్యాపార ఎన్నికల్లో ధన ప్రవాహం, మద్యం ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని ఆరోపించారు. డబ్బు ఎర చూపి సాధారణ ప్రజలను కూడా బానిసలుగా మార్చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి సామాజిక దుస్థితిలో ప్రజలు ఆలోచించి తమ పక్షాన అన్ని సందరాల్లో నిలబడి పోరాడే పార్టీలకు, మంచి నాయకులకు ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. దశాబ్దాల తరబడి బాధితులకు అండగా నిలబడి ఏమి ఆశించకుండా కొట్లాడే ప్రజాపంథ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని, అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామాల సమస్యలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో వందలాది ఎకరాలు పోడు భూములు కొట్టించిన ఘనత ప్రజాపందా పార్టీ దేనని అనేక చెరువులను కుంటలను పోయించి బీడు భూములను సశ్యశ్యామలం చేశామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి తలలో నాలుకలాగా ఉన్నామని స్పష్టం చేశారు.గుండాల మండలంలో అనేక ఇరిగేషన్ సమస్యలు ఉన్నాయని మండలంలో బస్టాండ్ ఏర్పాటు ఆసుపత్రిని ముప్పై పడకలుగా మార్చడం డయాలసిస్ సెంటర్ లైబ్రరీ వంటి ప్రధాన సమస్యలు పరిష్కారం కావాలంటే గుండాల సర్పంచ్ గా పోటీ చేస్తున్న తలలు గారి మెజారిటీతో గెలిపించాలని శంకరన్న అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా అభ్యర్థులకు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ, నవ చైతన్య యూత్ మద్దతు ప్రకటించడానికి స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డివిజన్ కార్యదర్శి శంకరన్న, మండల, కార్యదర్శి కొమరం శాంతయ్య, ఊకే బాబు, తోలెం సాంబయ్య, ఇల్లందుల అప్పారావు, పూణేం లక్ష్మన్న, ఇల్లందుల నరసింహులు, ఈసం చంద్రన్న, తెల్లం రాజు, జగన్, అరెం రాంబాయి, యూత్ నాయకులు షేక్ ఆజాద్, తదితరులు పాల్గొన్నారు.

మనం సురక్షితంగా ఉంటేనే కుటుంబాలు సురక్షితం

బొగ్గు ఉత్పత్తిలో రక్షణ నిబంధనలు పాటించాలి : జిఎం రామచందర్

విశాలాంధ్ర - మణుగూరు : సింగరేణి యాజమాన్యం సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలని రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సంస్థ ముఖ్య ఉద్దేశమని మణుగూరు ఏరియా జిఎం దుర్గం రామచందర్ అన్నారు. సింగరేణి 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మణుగూరు ఏరియా పీకే ఓసి లో సింగరేణి కళాకారుల ప్రదర్శనలు రక్షణ సందేశ నాటిక వేసారు. ఈ కార్యక్రమంలో జిఎం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు కార్మికుల సురక్షిత ప్రయాణం, ఉద్యోగ ప్రదేశాల వద్ద సురక్షిత విధి నిర్వహణను యాజమాన్యం కోరుకుంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణ అనే అంశాన్ని మూల కథగా ఎంచుకుని, వాహన ప్రమాదాల నివారణ, అతివేగం, వ్యక్తిగత రక్షణ పరికరాల ధరింపు ఇతివృత్తంగా ఎంచుకొని కళాకారులు బుధవారం నాటిక ప్రదర్శించారు. పీకే ఓసి లో ప్రదర్శించిన రక్షణ సందేశం నాటిక అందరినీ ఆలోచింపజేసింది. సభికుల ప్రశంసలు అందుకుంది. ఓసి-2 లో ఆపరేటర్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన యస్ డి నాసర్ పాషా రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ కళా ప్రదర్శనలో కళాకారులు తమ పాత్రలకు జీవం పోశారు. అదృశ్య శక్తి విద్యుత్ శక్తి అని... జాగ్రత్తలు పాటించి పనిచేస్తే జగతికి వెలుగునిస్తుందనీ... ఏమాత్రం నిర్లక్ష్యంగా పనిచేసిన జీవితంలో చీకటి మిగులిస్తుందనే నేపథ్యాన్ని వస్తువుగా తీసుకొని నాటిక ప్రదర్శన ఆధ్యాంతం ఆసక్తికరంగా కొనసాగింది. స్టేజి పైనే కార్మికుడికి విద్యుత్ ఘాతం దృశ్యం అందరిని ఉద్విజ్ఞానికి గురిచేసింది. సింగరేణి మాజీ కార్మికునిగా సింగరేణి సంస్థ పై మమకారం బాధ్యత కలిగిన తండ్రి పాత్రలో యస్ డి నాసర్ పాషా ఇమిడిపోయారు. బాధ్యత లేని కొడుకుగా, రక్షణ సూత్రాలు పాటించని నిర్లక్ష్యపు కార్మికునిగా జంగం రాజ్ కుమార్ చక్కని నటన కౌసల్యాన్ని ప్రదర్శించారు. పని పట్ల అప్రమత్తత సంస్థ పట్ల అంకిత భావం, కుటుంబ బాధ్యతలు కలిగిన కార్మికులుగా జర్పుల రాము, కోడి రెక్కల శ్రీనివాస్, పి నరసయ్య, చింతల శంకర్, కొత్తపల్లి సందీప్ లు చక్కని అభినయంతో నటించి తమ పాత్రలకు జీవం పోశారు. ప్రదర్శనలకు మరింత వన్నె తెచ్చే విధంగా ఆర్కెస్ట్రా బృందం ఎస్ సి హెచ్ పవన్ కుమార్, కే శ్రీనివాస్ ద్వయం స్వాగతం రక్షణ గీతాలు అలపించగా కీబోర్డ్ ఎస్ డేవిడ్ రాజ్, రిథమ్ ప్యాడ్ డి ప్రవీణ్, ఫ్లూటు నరసయ్య చక్కని వాయిద్య సహకారం అందించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ సిహెచ్ వెంకటరమణ, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు కార్మికులు కళాకారులను అభినందించారు. కళాకారులను ప్రశంసిస్తూ జ్ఞాపికలను అందజేశారు.

ఇస్లామ్ మానవ హక్కుల రక్షణ కవచం

బానిసత్వాన్ని ఏమాత్రం ఇస్లాం సహించదు :మానవ హక్కుల దినోత్సవం

జే ఐ హెచ్ నేత మహమ్మద్ ఇస్మాయిల్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మానవ హక్కుల కోసం ఇస్లాం రక్షణ కవచంగా ఉంటుందని జమాతే ఇస్లామి హింద్

ఉపాధ్యక్షులు, హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి ఖాజీ ముహమ్మద్ ఇస్మాయిల్ నిజామి అన్నారు. మానవ బానిసత్వానికి ఇస్లాంలో అవకాశమే లేదన్నారు. బుధవారం 8 ఇంక్లైన్ కాలనీ లో జరిగిన ప్రోగ్రామ్ లో ఇస్మాయిల్ నిజామీ మాట్లాడారు. 10 డిసెంబర్ న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచం టెక్నాలజీలో విశ్వంలోకి దూసుకుపోతున్న ప్రగతిలోనూ జాతి వైషమ్యాలు, అసమానతలు మనల్ని ఇంకా వెంటాడు తున్నాయన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ బాధకు పరిష్కారం లేదా? అని ఆయన ప్రశ్నించారు. మనం జీవిస్తున్న ఈ యుగం అపూర్వమైన సాంకేతిక వైభవాన్ని చూస్తోందనీ అదే దశలో అమానవీయ సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆనాటి అనాగరిక సమాజ చరిత్రలో మానవాళిని పీడించిన అసమానతలు, ఘోర దౌర్జన్యాలు, తీవ్ర ఆకృత్యాలు ఇప్పటికీ ఇంత వైజ్ఞానిక యుగంలో జరుగుతుండటం బాధాకరమన్నారు. ఈ చీకటి మనల్ని అంతులేని అమానవీయా బాధల్లోకి నెట్టివేస్తోందన్నారు. సరిగ్గా ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనే విజ్ఞులు మేధావులు ఉద్యమకారులు మానవ మనుగడ, హక్కులగురించి అలోచించి, చర్చించి పరిష్కార మార్గాలు చూపెట్టడం చాలా కీలకమన్నారు. మానవ హక్కులు ఏ సమాజంలో ఉంటాయో అక్కడే శాంతి సామరస్యాలు వర్ధిల్లుతాయన్నారు. ఈ విషయంలో ఇస్లాం బోధలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయని శాంతిస్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రశ్నలు మాగ్నా కార్టా నుంచి జెనీవా కన్వెన్షన్ వరకూ చారిత్రక పత్రాలలో చర్చకు వచ్చాయనీ గుర్తు చేసారు. ఈ లోతైన ప్రశ్నలను వివిధ మత సంప్రదాయాలు కూడా పరిష్కరించాయన్నారు. ప్రత్యేకించి, ఇస్లాంలొ మానవ హక్కులనమూనా దాని దృఢత్వం, విశాలదృష్టి, ఆధునిక కాలానికి దాని ఔచిత్య పరంగా మనల్ని ఆశ్చర్యపరుస్తుందన్నారు. మేధాలు మేధావులు విద్యార్థులు మానవ హక్కుల గురించి ఇస్లాం బోధనలు ఏం వివరిస్తున్నాయో చదవాలని అభ్యర్థించారు. అప్పుడే సమాజంలోని కొన్ని వర్గాల్లో ఇస్లాం పట్ల ఉన్న అపోహలు తొలగిపోతాయని స్పష్టం చేశారు. ఇస్లాంలో సామాజిక, జాతి, లింగ, మతపరమైన ఏకపక్ష విధానం అసలే లేదన్నారు. ఇస్లాం ధర్మంలో హింసకు ఏమాత్రం తావు లేదని కేవలం కొందరు చేసే ఉన్మాదపు చర్యలకు అందరిని బాధ్యులు చేయటం నేటి సమాజంలో సహజంగా మారిందన్నారు. పాశ్చాత్య సమాజాలు విపక్షకు వ్యతిరేకంగా పోరాడుతు న్నట్లే, ముస్లిం సమాజాలు కూడా ఇస్లామిక్ మానవ హక్కులసూర్తిని పూర్తిగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు.

తోటి మనుషుల హక్కులు నెరవేర్చాలని పవిత్ర గ్రంథం ఖర్ ఆన్ ఆజ్ఞలు స్పష్టంగా ఉన్నాయని మానవ హక్కులను అనుసరించని వారు ఇస్లాంలో లేనట్లే అన్నారు.

"న్యాయం చెయ్యండి... ఉపకారం చెయ్యండి... బంధువుల, ఇరుగు పొరుగు వారి హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఖురాన్ గ్రంథంలో స్పష్టంగా ఆజ్ఞాపిస్తున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవ పాత్రుడు అని (ఖురాన్ 49:13) గ్రంథంలో స్పష్టంగా ఉందని తెలిపారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సత్యాన్ని ఎంత అందంగా చెప్పారంటే

"ఒక అరబ్బుకు అరబ్బేతరుడిపై గానీ.... నల్లవానికి తెల్లవానిపై గానీ, తెల్లవానికి నల్లవాని పై గానీ ఎలాంటి అధికృత, అసమానతలు లేవు" అని బోధించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమం జె ఐహెచ్ గోదావరిఖని అధ్యక్షులు సయ్యద్ జావిద్ అక్మల్ హుస్సేనీ అధ్యక్షత వహించగా నాయకులు, ప్రముఖులు అబ్దుల్ రజాక్, ఫసియుద్దీన్, ముస్తఫా, అక్బర్, మక్సూద్ అహ్మద్ ఖాన్-, అహ్మద్ పాషా, ఖాజా మొయినుద్దీన్, జుబేర్ అహ్మద్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ కు మెజారిటీ స్థానాలు

రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల

విశాలాంధ్ర - కొత్తగూడెం : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన పాల్వంచ మండలం పరిధి లోని పలు పంచాయతీల్లో విస్తృతంగా పర్యటిం చారు. నాగారం కాలనీ, దంతలబోరా ఎస్సీ కాలనీ, నాగారం,తోగ్గుడెం లలో ఎన్నికల ప్రచా రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, మహి ళలకు ఉచిత రవాణా, 200 యూనిట్ల లోపు కరెంటు ఉచితం, సన్నబియ్యం, సబ్సిడీపై గ్యాస్ పంపిణీ, రైతుల రుణాల మాఫీ, ఎకరానికి రూ.12 వేల రైతు భరోసా, సన్నధాన్యానికి రూ. 500 బోనస్, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, ఆరోగ్యశ్రీ పథకానికి రూ 10 లక్షల కేటాయింపు వంటి పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను మెజారితో గెలిపించాలని కొత్వాల కోరారు.

నాగారం కాలనీలో కాంగ్రెస్ లోకి చేరికలు...

కొత్వాల పర్యటన సందర్భంగా నాగారం కాలనీలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. %దీ=ా% పార్టీకి చెందిన మాజీ వార్డ్ మెంబర్ బోడ మాలి, బోడ వీరన్న, బోడ దుర్గా, బోడ ప్రసాద్, గుగులోతు వీరన్న, తాపర్ల సమ్మయ్యలు కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బరపటి వాసుదేవరావు, మాజీ జడ్పిటిసి ఎర్రం శెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, పెద్దమ్మ గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ఎల్డీఎం కోఆర్డినేటర్ బద్దికిషోర్, పాల్వంచ టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, నాయకులు భూక్య ప్రసాద్, చౌగాని పాపారావు, తెల్లం మల్లేష్, బానోతు మంచ, భూక్య మంగు, గుగులోతు శంకర్, భూక్య బద్రు,సమ్మయ్య, పోలేబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా

ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : స్థానిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పంచాయతీల వారీగా ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు విధులను నిర్వర్తించే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమాలని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, టూ టౌన్ సీఐ ప్రతాప్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు రమణా రెడ్డి, రవి, రమాదేవి, జయసింహారెడ్డి, శివరామకృష్ణ? తదితరులు పాల్గొన్నారు.

గూడూరుపాడు, కస్నాతండాలో, సిపిఐ ప్రచారం

విశాలాంధ్ర -ఏదులాపురం : మున్సిపాలిటీ ఈ నెల 14న జరిగే ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పుచ్చ కాయల కమలాకర్, సిద్దినేని కర, జిల్లా కార్యవర్గ సభ్యులు మెడికంటి వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ మండల, నాయకులు దండి రంగారావు, యువజన సంఘం నాయకులు కొక్కు రోనాక్, సన్నీ, రితిక్, చింతల ఉదయ్, అభి,గ్రామ శాఖ సభ్యులు ప్రజల కోసం పనిచేసే సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని

హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వతీకరించాలనే డిమాండ్తో హింద్ మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విశాలాంధ్రతో మాట్లాడారు. గుర్తింపు సంఘం హోదాలో ఉన్న నాయకులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో నెలకే పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సింగరేణి యాజమాన్యం కూడా కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నట్లు ఆరోపించారు. ఈ కార్మికులకు వాగ్దానం చేసిన విధంగా గుర్తింపు సంఘం సహకరించాలన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్యతను ఎవరూ తక్కువ అంచనా వేయొద్దని స్పష్టం చేశారు. యాజమాన్యంలో పెద్ద హోదాలో ఉన్న అధికారులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటే వారి కుటుంబాల ఉసురు తప్పకుండా తగులుతుందని హెచ్చరించారు. తమ హక్కుల కోసం కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా నిలబడాలని కోరారు. హెచ్ఎంఎస్ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన తోపాటు ఎఐల్ పి ఇంచార్జి వైస్ ప్రెసిడెంట్ శాంతి స్వరూప్, బ్రాంచ్ సెక్రటరీ గోషిక శ్రీకాంత్, పిట్ కార్యదర్శి రివెల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాభివృద్ధి

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

విశాలాంధ్ర-కొమురం భీ : కొమరం భీం జిల్లాలో జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా గ్రామాభివృద్ధిని మరింతగా ముందుకు తీసుకెళ్లవచ్చని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటం వలన, గ్రామ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారా మాత్రమే సాధ్యమన్నారు.ప్రతి గ్రామంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం మరియు పారిశుధ్య సమస్యలకు తక్షణ పరిష్కారం కనుగొనడం కోసం స్థానిక సర్పంచ్ అభ్యర్థులు కీలకపాత్ర పోషిస్తారని. గ్రామాల ప్రజలకు సంప్రదాయ, సామాజిక, అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా, కాంగ్రెస్ అభ్యర్థుల విజయంతో గ్రామాభివృద్ధి అవుతుందని. జిల్లాలోని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆత్రం సుగుణక్క ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అజ్మీర శ్యామ్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కళ్యాణం వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర -ఖమ్మం : సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఖమ్మం జిల్లాకు చెందిన కళ్యాణంవెంకటేశ్వరరావుఎన్నిక య్యారు. ఖమ్మం ఈనెల 7, 8, 9 తేదీ లలో మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన సిఐటి యు 5వ రాష్ట్ర మహాసభలలో తిరిగి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వర ఎన్నిక కావడం జరిగింది. ఈ మహా సభలకు రాష్ట్రం నుండి 33 జిల్లాల ప్రతినిధులు హాజరు కావడం జరిగింది. ఖమ్మం జిల్లా నుండి రాష్ట్ర కమిటీ సభ్యులుగా తుమ్మ విష? , వై విక్రం , పిన్నంటి రమ్య , ముధం శ్రీనివాస్ , చలమల విటల్ , పేరుమలపల్లి మోహన్ రావు, భూక్య శ్రీనువాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా శీలం నరసింహారావు, బి కోటేశ్వరి, జిల్లా ఉపేందర్ ఖమ్మం జిల్లా నుండి ఎన్నిక కావడం జరిగింది. మహాసభల ఆహ్లాదపూరిత వాతావరణంలో మూడు రోజులపాటు బాగా జరిగాయి.

21 పంచాయతీల్లో 3 ఏకగ్రీవం

కిష్టారం గ్రామంలో 12 వార్డులకు 12 ఏకగ్రీవం

విశాలాంధ్ర-సత్తుపల్లి : చిత్ర విచిత్ర పొత్తులతో ప్రారంభమైన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండల పరిధిలోని 21 పంచాయతీలకు గాను 3 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.ఉపసంహరణకు మంగళవారం చివరి తేదీ కావడంతో నారాయణపురం, రామానగరం, రామ గోవిందపురం గ్రామాలలో సర్పంచి అభ్యర్థిత్వానికి బరిలో ఉన్న కొందరు అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో ఆయ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు తెళ్లూరి లక్ష్మి, ఒంటెద్దు వెంకటమ్మ, మందపాటి మౌనికారెడ్డి లు సర్పంచిలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తీవ్ర ఉత్కంఠ గా జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం అయిన మూడు గ్రామాల్లో అభ్యర్థులు మహిళలే కావడం విశేషం. మండలంలోని కిష్టారం గ్రామంలో ఉన్న 12 వార్డులకు గాను 12 ఏకగ్రీవం అవ్వగా నలుగురు అభ్యర్థులు సర్పంచి పోటీలో నిలిచారు. ఏకగ్రీవ సర్పంచులుగా గెలుపొందిన వారు, వారి ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే, డాక్టర్ మట్ట రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ విజయ్‌కుమార్ కు కాంగ్రెస్ మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉసిరికాయలపల్లి అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా..

సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థి బానోతు సరోజ బస్సీలాల్

విశాలాంధ్ర కారేపలి : ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థి బానోత్ సరోజ బస్సీలాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉసిరికాయల పల్లిలో సిపిఎం పార్టీ బలపర్చిన అభ్యర్థి బానోతు సరోజ బస్సీలాల్ విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త బస్సీలాల్ గత ఐదేళ్ల కాలంలో సర్పంచ్ గా గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీకి వచ్చే అభివృద్ధి నిధులతో ఇంకా గ్రామంలో సిసి రోడ్లు మురుగు కాలువల నిర్మాణంతోపాటు ఎన్నో పనులు చేపట్టి పూర్తి చేస్తానన్నారు.గ్రామ ప్రజలందరి సహకారంతో తాను పోటీలో ఉన్నానని పార్టీలకతీతంగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ గ్రామపంచాయతీ ప్రచారంలో దాసరి మల్లయ్య, సైదులు,మూడు అరుణ,వాంకుడోత్ గంగ, తేజావత్ చందర్, పొడుగు రామస్వామి, గొల్లమందల వెంకన్న, మూడు శంకర్ ఉన్నారు.

బీజేపీ నుండి పసుమర్తి సతీష్ సస్పెన్షన్

విశాలాంధ్ర- ఖమ్మం : భారతీయ జనతా పార్టీ ఖమ్మం 1వ టౌన్ కమిటీ పరిధిలో పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన కారణంగా పసుమర్తి సతీష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు బీజేపీ ఖమ్మం 1వ టౌన్ కమిటీ బుధవారం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది.ఖమ్మం 1వ టౌన్ వాస్తవ్యుడైన పసుమర్తి సతీష్ గత కొంతకాలంగా పార్టీ నిబంధనలకు, సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పార్టీ నాయకులపై వ్యక్తిగత ద్వేషంతో దూషణలకు దిగడం, వారిని కించపరిచేలా మాట్లాడటం, సామాజిక మాధ్యమాలలో , బహిరంగంగా పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా అనుచితంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు వారు తెలిపారు. ఆయన చేసే ఎటువంటి వ్యాఖ్యలకు పార్టీ బాధ్యత వహించదని తెలిపారు. ఈ సస్పెన్షన్ నిర?యాన్ని ప్రకటించిన కార్యక్రమంలో ఖమ్మం బీజేపీ 1వ టౌన్ మండల అధ్యక్షుడు గడిల నరేష్, ప్రధాన కార్యదర్శులు పాలెపు రాము, పొట్టిమూతి వాణి, ఉపాధ్యక్షులు బొడ్ల శ్రీనివాస్, కార్యదర్శి కడుదుల ప్రభాకర్, తుమ్మ ఇందు తదితరులు పాల్గొన్నారు.

మధిర తొర్లపాడు పంచాయతీలో ఘర్షణ

కాంగ్రెస్ నాయకుడు అద్దంకి రవిపై దాడి

విశాలాంధ్ర -ఖమ్మం: ఖమ్మం జిల్లా మధిర మండలం తొర్లపాడు గ్రామంలో సిపిఎం కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. తొర్లపాడు గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాదో ఉపవాసాలు జరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో కాంగ్రెస్ నాయకుడు అద్దంకి రవి తీవ్ర గాయాల పాలయ్యారు ఆయన ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సిపిఎం నాయకులు తనను హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీని చేజిక్కించు కునేందుకే సిపిఎం నాయకులు ఘర్షణలకు దిగుతున్నారని ఆయన ఆరోపించారు.

ఘనంగా ప్రారంభమైన ఖమ్మం బాలోత్సవం..

విశాలాంధ్ర - ఖమ్మం: స్థానిక ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్ నందు నేటి ఉదయం 10 గంటల నుండి శుక్రవారం అనగా ఈనెల 12 సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులపాటు ఖమ్మం నగర బాలోత్సవంను చాలా ఘనంగా ప్రారంభించటం జరిగింది. ముందుగా జాతీయ జెండా మరియు బాలోత్సవం జెండాను బోడేపూడి విజ్ఞాన కేంద్రం జనరల్ మేనేజర్ మరియు బాలోత్సవం కన్వీనర్ వై శ్రీనివాసరావు, తుమ్మల వెంకట్రావు ఆవిష్కరించారు. అనంతర ప్రారంభం సందర్భంగా రిబ్బన్ కటింగ్ బాలోత్సవం నిర్వాహకురాలు శ్రీమతి కానూరి హిమబిందు చేసారు.బోడేపూడి విజ్ఞాన కేంద్రం, టి పి ఎస్ కె, ఆల్ పెన్షనర్స్, జె వి వి మరియు ఎస్ ఎఫ్ ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మం నగర బాలోత్సవంను ఘనంగా నిర్వహించడం జరిగింది.. నగర నలుమూలల నుండి వివిధ విద్యా సంస్థల బాల-బాలికలు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో బాలోత్సవం కన్వీనర్ వై శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ కార్యక్రమంకు విశేష ఆదరణ లభించిందని, ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి బాలోత్సవ నిర్వాహక బృందం చాల కృషి చేసారని అదే విధంగా ,వివిధ ప్రభుత్వ మరియు ప్రయివేటు విద్యా సంస్థలు తమ తమ స్టూడెంట్స్ ని పంపించి జరగబోయే అన్ని కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసినందుకు అభినందనలు తెలియచేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ మెంబర్స్ కె లిహిమబిందు, సామినేని నాగేశ్వరరావు, జనార్ధన్ స్వామి, వాసిరెడ్డి వీరభద్రం,ఎస్ కె అఫ్జల్,ఎన్ గోవిందరావు,వై మధు సూదన్ రావు,ఎమ్ సుబ్బారావు,ఎస్ కె జానీ,వివి లక్ష్మీ నారాయణ, వై రవికుమార్, జి శ్రీదేవి, మైహన్, కళ్యాణం నాగేశ్వరరావు, సీత, విజయలక్ష్మి, ప్రమీల, మల్లిక, రామారావు, పారుపల్లి అరుణ, విప్లవ్, బండారు రమేష్ ,తాతా రాఘవయ్య,భాష్కర్ రావు, రామ శేఖరం,పుచ్చకాయల వెంకటేశ్వరరావు, కెరాములమ్మ,లిమచ్చా సూర్యం తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలకు న్యాయలి నిరే?తలుగా ఆయా సబ్జెక్ట్ కు సంబంధించిన నిపుణులు వ్యవహారించారు.

అన్నంసేవ ఫౌండేషన్‌లో అన్నదాన కార్యక్రమం

సంక్షేమ అధికారిని వేల్పుల విజేత

విశాలాంధ్ర - ఖమ్మం : అనాధలు అభాగ్యుల ఆపన్న హస్తం, అసమాన సేవా తత్పరత కలిగిన అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నం ఫౌండేషన్ లో ఖమ్మం జిల్లా సంక్షేమ అధికారిని వేల్పుల విజేత తన జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అనేకమందికి ఆదర్శ ప్రాయుడైన అన్నం శ్రీనివాసరావు సమక్షంలో ఆయన ఫౌండేషన్ లోని మతిస్థిమితం లేని, దిక్కు లేని అనాధలు, నిరాదరణకు గురైన వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని విజేత పేర్కొన్నారు. బుధవారం ఆమె కేక్ కట్ చేసి అన్నం పౌండేషన్ లో ఆశ్రయం పొందుతున్న అభాగ్యులందరికీ పంచిపెట్టారు.జిల్లా కలెక్టర్ నుంచి మొదలు ప్రభుత్వ ఉన్నతాధికారులు రాజకీయ నాయకులు సేవా భావం కలిగిన అనేకమందికి నికార్సైన మనసు కలిగిన అన్నం శ్రీనివాసరావు ఫౌండేషన్ సేవ చేసేందుకు చిరునామాగా మారింది. ఆయన కొన్ని వేల మందికి ఆశ్రయమిచ్చి మతిస్థిమితం నుంచి విముక్తులను చేసి ఆ పిచ్చి వారిని వారి వారి

బంధువులకు అప్పజెప్పిన ఆపద్బాంధవుడు నూరు శాతం మానవీయత కలిగిన మహనీ యుడని చెబితే అతిశయోక్తి కాదు. అనేకమంది వృద్ధులకు అనాధలకు సహాయం చేయాలని కోరుకునే మంచి మనసున్న దాతలు అన్నం శ్రీనివాసరావు ద్వారా నిజాయితీగా ఆ అభాగ్యులకు తాము చేస్తున్న సహాయం నూరు శాతం అందుతుందని ఆయన ద్వారానే సేవలు అందిస్తున్నారు. భయంకరమైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రోడ్డుపై మెదడు చింది అక్కడికక్కడే సిద్ధమైన శరీరాలను పోలీసులు సైతం సేకరించలేక ఆయనకి అప్పచెబుతారు. శవాల అయితే వారిది ఏ ధర్మమో తెలుసుకొని ఆయా ధర్మాల ప్రకారం అంత్యక్రియలు చేసి తన మానవత్వాన్ని ఇతరులు ఎవరు చేయలేనంత సేవను చేస్తున్నారు అన్నం శ్రీనివాసరావు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని విజేత మాట్లాడుతూ నిస్వార్థంగా అనాధల కోసం పిచ్చి వాళ్ల కోసం తన జీవితమంతా ధారపోసి సేవ చేస్తున్న అన్నం శ్రీనివాసరావు నేతృత్వంలో నడుస్తున్న ఫౌండేషన్కు అవసరమైన తన సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని.

ఈ కార్యక్రమంలో రాజ్యాతండ మాజీ సర్పంచ్ మూడ్ సురేష్ , సేవాసమితి సమితి ఫౌండర్ శ్రీ అన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు .

గ్రామ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా స్వేఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా రఘునాథపాలెం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలలో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ లో వినియోగించే ఎన్నికల సామాగ్రిని పరిశీలించి, పోలింగ్ సిబ్బందితో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పలు సూచనలు చేస్తూ, ఓటర్ లకు బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ తీసుకోవడం, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్ల కౌంటింగ్, సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం, ఉప సర్పంచ్ ఎన్నిక తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించే వారు, వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి డిసెంబర్ 11 గురువారం మొదటి విడతలో జిల్లా నందు ఏడు మండలాలలో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ నిర్వహించి, ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లోకేషన్స్ గుర్తించి క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరా ద్వారా నిరంతర పర్యవేక్షిస్తామని, సెన్సిటివ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీ పోలింగ్ లో ప్రజలు ఎటువంటి ఒత్తిడులు, భయాందోళనలు లేకుండా తమ ప్రజాస్వామ్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్లు అందరూ నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి, ఎవరి ప్రభావానికి లోను కాకుండా స్వేఛగా ఓటు వేయాలని కలెక్టర్ కోరారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో పూర్తి అయ్యే వరకు గ్రామాలలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించ రాదని, ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

పోలింగ్ సిబ్బంది, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలున్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నరసింహారావు, రఘునాథపాలెం తహసీల్దారు శ్వేత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చు



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర బ్యూరో- ఖమ్మం : ఈ నెల 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటపుడు ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో ఇతర 18 రకాల గుర్తింపు కార్డుల లో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు.

1) ఆధార్ కార్డు
2) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు
3) ఫోటోతోకూడిన పోస్టాఫీస్/బ్యాంక్ పాస్ బుక్
4) కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు
5) డ్రైవింగ్ లైసెన్స్
6) పాన్ కార్డ్
7) ఫోటోతో కూడిన ఎస్సీ,ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు
8) ఇండియన్ పాస్పోర్ట్
9) ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్
10) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు
11) ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు
12) దివ్యాంగుల గుర్తింపు కార్డు
13) పట్టాదార్ పాస్ పుస్తకం
14) రేషన్ కార్డు
15) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం
16) ఫ్రీడం ఫైటర్ ఐ.డీ కార్డ్
17) ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్.పీ.ఆర్. స్మార్ట్ కార్డు
18) ఏంపీ లకు జారీ చేయబడిన గుర్తింపు కార్డు

పై వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

సమస్యాత్మక గ్రామ పంచాయతీల జాబితాపై సీపీకి వినతి

విశాలాంధ్ర -ఖమ్మం : ఖమ్మం జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించదగిన గ్రామ పంచాయతీలలో శాంతి భద్రతలను పటిష్టం చేయాలని కోరుతూ బి.ఆర్.ఎస్. పార్టీ, సీపీఎం పార్టీల ఉమ్మడి నాయకత్వ బృందం నేడు ఖమ్మం నగర పోలీస్ కమీషనర్ కి వినతిపత్రం సమర్పించారు. శాసనమండలి సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, సీపీఎం సీనియర్ నాయకులు సున్నా నాగేశ్వర రావు, టిఆర్ఎస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నేలకొండపల్లి మండల పార్టీ అధ్యక్షులు ఫోన్ నెంబర్ మరియు తదితరులు పాల్గొన్నారు.గత ఎన్నికల చరిత్ర, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని, శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్న గ్రామ పంచాయతీల జాబితాను సమర్పించారు. గుర్తించిన ఈ గ్రామాల్లో ఓటర్లు భయం లేకుండా, స్వేఛగా తమ హక్కును వినియోగించుకునేలా అదనపు పోలీసు బలగాలను వెంటనే మోహరించాలని కోరారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు తక్షణమే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నాయకత్వ బృందం పోలీస్ కమీషనర్ ని అభ్యర్థించింది.

ఎంపీ వద్దిరాజు పార్లమెంటులో

వందేమాతరంపై ప్రసంగం

విశాలాంధ్ర బ్యూరో -ఖమ్మం: వందేమాతర గీతం భారతీయుల ఐక్యతను,గౌరవాన్ని మరింత పెంపొందిస్తున్నదని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఇది ప్రధాన భూమిక పోషించిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.రాజ్యసభలో బుధవారం ఆయన వందేమాతర గీతంపై జరిగిన చర్చలో పాల్గొని ప్రసంగించారు.బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ నెలలో రాసిన ఆనంద్ మఠ్ పుస్తకంలో రాసిన ఈ గీతం బ్రిటీష్ వలస పాలకులపై మన పూర్వీకులు ఆత్మగౌరవంతో పోరాడడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.భారతీయులలో దేశభక్తి మరింత పెంపొందడానికి ఊతమిచ్చిన ఈ మహోన్నత గీతానికి 150 ఏళ్ల మహోన్నత చరిత్ర ఉందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఊరూతలూగించిన వందేమాతర గీతం తెలంగాణ ప్రాంతానికి పాకి నిజాం పాలకులపై పోరాడడానికి ప్రేరణనిచ్చిందని ఎంపీ రవిచంద్ర తెలిపారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1938లో ఈ గీతాన్ని గళమెత్తి పాడిన విద్యార్థులను గది బంధించి తీవ్ర నిరశేధం ప్రయోగించడంతో నిజాం రాజ్యమంతా ఉద్యమం ఉవ్వెత్తున లేవడంతో పాలకులు వణికిపోయారని ఆయన వివరించారు.ఈ సందర్భంగా 1550 మంది విద్యార్థులను విద్యా సంస్థల నుంచి బహిష్కరించడం జరిగింది.వారిని ఏ కళాశాలలో కూడా చేర్చుకోవద్దని హుకుం జారీ చేసినా నాగపూర్ విశ్వవిద్యాలయం చదువుకునేందుకు అవకాశాలు కల్పించిందని,వీరిలో మన స్వర్గీయ మాజీ ప్రధాని పీ.వీ.నరసింహారావు కూడా ఉన్నారని తెలపడానికి గర్వపడుతున్నానని ఎంపీ రవిచంద్ర చెప్పారు.నిజాం నిరంకుశ పాలనపై సర్వాయి పాపన్న గౌడ్, కొమురం భీమ్,దొడ్డి కొమురయ్య, చిట్యాల ఐలమ్మ,రావి నారాయణరెడ్డి,బద్ధం ఎల్లారెడ్డి తదితరులు వీరోచితంగా పోరాడారని ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు గుర్తు చేశారు.అలాగే,బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సరోజినీ నాయుడు, కందుకూరి వీరేశలింగం,బూర్గుల రామకృషా?రావు,స్వామి రామానంద తీర్థ, పుచ్చలపల్లి సుందరయ్య,మాడపాటి హనుమంతరావు,ముఖ్దూం మొయినుద్దీన్ తదితరులు ఈ దేశభక్తి గీతం ద్వారానే ప్రేరణ పొందారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.సత్యమేవ జయతే ఉపనిషత్తు పాఠం,జననీ జన్మభూమి ఇఛ్ అనే రామాయణ శ్లోకం,పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప కారల్ మార్క్స్ నినాదం మనిషి వికాసానికి మైలు రాళ్లగా నిలిచాయని,ఈ వందేమాతరం కూడా అదే కోవకు చెందిన స్ఫూర్తిదాయక గీతమని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.ఈ గీతం ఇప్పటికి కూడా భారతీయుల ఐక్యత, గౌరవాన్ని పెంపొందిస్తున్నదని ఎంపీ వద్దిరాజు అన్నారు.

బోనకల్ మండలంలో పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్...

అడిషనల్ డీసీపీ లా&అర్డర్



విశాలాంధ్ర -బోనకల్ : గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ.. ప్రజలు స్వేఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు, ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ లా & అర్డర్ ప్రసాద్ రావు తెలిపారు. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీసు బలగాలతో బోనకల్ మండలం ఎల్. గోవిందపురం గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... గ్రామ పంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సాగేలా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే పోలీసు సిబ్బంది అనేక ప్రాంతాల్లో వీధుల్లో తిరుగుతూ.. ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూనే..ఎన్నికలను ప్రశాంతయుతంగా నిర్వహించేందుకు ప్రజలం దరూ సహకరించాలని, అసాంఘిక శక్తులకు సహకరించ వద్దని కోరుతున్నామని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నచ్చిన వ్యక్తికి, ఓటువేసే ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని పెర్కొన్నారు.నిరభయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు ,బ్లూకోల్ట్ బృందాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ విధులు నిర్వహిస్తున్నట్లు పెర్కొన్నారు.